సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సాఫ్ట్‌వేర్‌లో ముగిసిన స్వర్ణయుగం 04

ఆధార్ సహా, నిర్దేశిత డాక్యుమెంట్‌తో దరఖాస్తుకు 'సుప్రీం' అనుమతి 05

సంపుటి 08, సంచిక: 263 | శనివారం | 23-08-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి

# కూనంనేని సాంబశివరావు



## సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా


తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు


ఇ.టి.నర్సింహా

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ
- పది మంది కార్యదర్శివర్గం, 32 మంది కార్యవర్గం సహా 101 మందితో నూతన రాష్ట్ర సమితి

**రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**
కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, వివిఎస్.బోస్, ఇటి.నర్సింహా

(ఇ.చంద్రశేఖర్)
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇటి.నర్సింహా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్'(గాజుల రామారం)లో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ చివరి రోజు శుక్రవారం నాడు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. కార్యదర్శిగా కూనంనేని పేరును సిపిఐ సీనియర్ నాయకుడు పల్లా వెంకట్ రెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర సమితి ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సిపిఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు.

**రాష్ట్ర కార్యవర్గం:** కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా,బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సిహెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్‌రాజ్, మందా పవన్, బి.విజయసారధి, కర్రె భిక్షపతి,

తరువాయి 3లో


నూతనంగా ఎన్నికైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులతో అభివాదం చేస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా

# వెల్లువెత్తిన ఉద్యమ స్ఫూర్తి

## అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసిన సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు

### చర్చలు ఫలప్రదం, పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్

సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్' (గాజుల రామారం) లో ఘనంగా జరిగాయి. కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్‌లో ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన మహాసభలు మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఉద్యమ స్ఫూర్తితో ముగిశాయి. 'ఎర్ర జెండా జిందాబాద్, ఉద్యమాలే మా ఊపిరి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం, మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి' అని ప్రతినిధులు నినదిస్తూ పోరాట కార్యాచరణతో తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారు. తొలి రోజు బుధవారం ఉదయం మహాసభలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో రాజాకీయ, సామాజిక పరిస్థితులు, సిపిఐ కర్తవ్యం, చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై రాజా ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ప్రతినిధుల సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 727 మంది ప్రతినిధులు మహా సభలో పాల్గొన్నారు. ఈసారి ప్రతినిధులలో మహిళలు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ప్రతినిధుల సభలో సిపిఐ

తరువాయి 2లో

## చట్ట సభల్లో ప్రాతినిధ్యంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

**మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది**
**సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం**



ప్రస్తుత శాసనసభ, శాసనమండలి ఉభయ సభలలో సిపిఐకి ప్రాతినిధ్యం ఉండడంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని ఎంఎల్‌సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చెప్పారు. గడిచిన ఏడాది కాలంగా చట్టసభలలో పేద ప్రజల సమస్యలను లేవనెత్తడంతో పాటు, బయట అనేక ప్రజా ఉద్యమాలను

తరువాయి 2లో

### ఉద్యమాల ద్వారానే

## ఎదురులేని శక్తిగా సిపిఐ

రాష్ట్ర నాలుగవ మహాసభల్లో కూనంనేని సమాధానం

(బి. అంజన్‌కుమార్)
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

ఉద్యమాల ద్వారానే పార్టీ ఎదురు లేని శక్తిగా ఎదుగుతుందని, ఇందుకు ప్రతి నాయకుడు , కార్యకర్త క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలకు సంబంధించి పొత్తు ఉన్న చోట కలిసి పని చేయాలని, లేని చోట గెలుపే లక్ష్యంగా సాధ్యమైన ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలన్నారు. ఉద్యోగ, కార్మిక, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆర్‌టిసి, సింగరేణి కార్మికుల సమస్యలు, ప్రజా సమస్యలను క్రోడీకరించి లక్షలాది మందితో త్వరలో ఉద్యమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో ప్రవేశ పెట్టిన రాజకీయ , నిర్మాణ నివేదిక పై జరిగిన చర్చకు శుక్రవారం నాడు కూనంనేని సాంబశివరావు సమాధానమిస్తూ శాఖలు లేని గ్రామాలు, మండలాలలో విస్తరించి సిపిఐని మరింత బలోపేతం

తరువాయి 2లో

### 'స్థానిక' ఎన్నికలకు

# సన్నద్ధమవ్వండి

- పేదల నమ్మకాన్ని కాపాడుకునేలా ఉద్యమ కార్యాచరణ
- సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి




ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్


ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శ్రేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో మూడవ రోజు శుక్రవారం చాడ వెంకట రెడ్డి సందేశమిచ్చారు. సభలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, తగిన గుర్తింపు రాలేదని విమర్శలు ఉన్నాయని, అయితే భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చరిత్ర కలిగిన ఎర్ర జెండా వద్దకు, సిపిఐ వద్దకు వెళితేనే తమకు నీడ (నివాస స్థలం) దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజలలో ఉండడం సిపిఐకి గర్వకారణమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. రాష్ట్రంలో ధరణి పోయి భూభారతి వచ్చినప్పటీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని,

తరువాయి 2లో

### జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

## నక్సలిజానికి మద్దతిచ్చారట!

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై అమిత్ షా నిరాధార ఆరోపణలు



**కొచ్చి:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి నిలిచిన ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా నిరాధార ఆరోపణలు చేశారు. సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఆయన సల్వాజుడుం తీర్పును ప్రకటించకపోతే, దేశంలో తీవ్రవాద వామపక్ష ఉద్యమం 2020కి

తరువాయి 2లో




### యాదాద్రి పవర్‌ప్లాంట్

## జనవరిలో జాతికి అంకితం

- ప్లాంట్ పరిసర గ్రామాల్లో ఉచితంగా ప్రపంచస్థాయి విద్య, కార్పొరేట్ వైద్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను రానున్న జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పరిసరాల్లోని గ్రామాల్లో ప్రపంచ స్థాయి విద్యను, కార్పొరేట్ వైద్యాన్ని సిఎస్‌ఆర్ నిధుల ద్వారా ఉచితంగా అందజేస్తామని భరోసానిచ్చారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో 500 మందికి శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంఎల్‌సి శంకర్ నాయక్, ఎంఎల్‌ఏ లక్ష్మారెడ్డి తదితరులు

తరువాయి 2లో

### ఘోష్ నివేదికపై 'స్టే'కు

# హైకోర్టు నిరాకరణ

- కెసిఆర్, హరీశ్‌లకు లభించని ఊరట
- రాష్ట్ర సర్కార్, కమిషన్‌లకు నోటీసులు
శాసనసభలో నివేదిక పెట్టాకే చర్యలు : ప్రభుత్వం
- ఐదు వారాలకు విచారణ వాయిదా



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఏర్పాటు జిఒ, కమిషన్ నివేదిక అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. జిఒ 6, కమిషన్ నివేదికలను రద్దు చేయాలంటూ కెసిఆర్, హరీశ్‌రావు వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలను శుక్రవారం హైకోర్టు మరోసారి విచారించింది. కమిషన్ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సభలో చర్చించాకే ముందుకు వెళతామని ప్రభుత్వం చెప్పింది. ఈలోగా కమిషన్ నివేదికపై ఏవిధమైన చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చింది. వీటిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుని కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు వేసిన అభ్యర్థనను తిరస్కరించింది. రెండు పిటిషన్లను విచారణకు స్వీకరించి ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌లకు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఆ తరువాత

తరువాయి 2లో

### యూరియా పక్కదారి పడుతోంది

కిషన్‌రెడ్డి ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్న యూరియా ఎలా పక్కదారి పడుతోందని?, బ్లాక్ మార్కెట్‌లోకి ఎలా వెళ్తుందో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. యూరియా విషయంలో కేంద్రాన్ని బద్‌నామ్ చేయాలన్న దురుద్దేశాన్ని మానుకొని, రైతులకు యూరియాను సక్రమంగా అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే వహించాలన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇతర దేశాల్లో ఎరువుల ధరలు మూడు రెట్లు పెరిగినప్పటికీ, గత 11 సంవత్సరాలుగా ఎరువుల ధర ఎంత పెరిగినప్పటికీ

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అవినీతి ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె అరెస్ట్

**కొలంబో :** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె (76) రాష్ట్ర నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతో శుక్రవారం క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) అరెస్టు చేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సిఐడి ప్రధాన కార్యాలయానికి విక్రమసింఘెను విచారణ కోసం పిలిపించి, ఆ తర్వాత అక్కడే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 2023 సెప్టెంబర్‌లో తన భార్య ప్రొఫెసర్ మైత్రి పట్టాభిషేక కార్యక్రమానికి హాజరయ్యేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)కు వెళ్లినప్పుడు ప్రభుత్వ నిధులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అమెరికా పర్యటన పూర్తయిన అనంతరం అధికారికంగా కాకుండా రాష్ట్ర ఖర్చుతో యుకె వెళ్లారని సమాచారం. ఈ ప్రయాణ ఖర్చుపై ఆయన సిబ్బందిని సిఐడి ఇంతకు ముందే ప్రశ్నించినట్లు తెలిసింది. 2022 ఆర్థిక సంక్షోభ సమయంలో దేశాన్ని దారి మళ్లించిన నాయకుడిగా పేరుగాంచిన విక్రమసింఘె, గోటబయ రాజపక్స రాజీనామా అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి 2024 సెప్టెంబర్ వరకు పదవిలో కొనసాగారు. అంతకు ముందు ఆయన ఆరుసార్లు శ్రీలంక ప్రధానమంత్రిగా సేవలందించారు.

## పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో
# చైనా విదేశాంగ మంత్రి వాంగ్ భేటీ
### ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధంపై దృష్టి

**ఇస్లామాబాద్ :** చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ శుక్రవారం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను కలిసి, ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధం తోపాటు, పరస్పర ప్రయోజనకరమైన అంశాలను చర్చించారు. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న విదేశాంగ మంత్రుల 6వ రౌండ్ 'వ్యూహాత్మక చర్చల' కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం పాకిస్థాన్ చేరుకున్న వాంగ్, ప్రధాని షెహబాజ్ షరీఫ్, అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని కూడా కలిశారు. ఈ సందర్భంగా ఆయన, ప్రాంతీయ శాంతి, అభివృద్ధి, స్థిరత్వం కోసం చైనా-పాకిస్థాన్ భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది అని హామీ ఇచ్చారు. పాకిస్థాన్ సార్వభౌమత్వ పరిరక్షణ, అభివృద్ధి ఎలాంటి షరతులు లేని మద్దతునిస్తామని చైనా స్పష్టం చేసినట్లు సమాచారం. తమ మధ్య ఉన్న మైత్రి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించినట్లు పాకిస్థాన్ ఆర్మీ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. మునీర్-వాంగ్ సమావేశంలో ప్రధానంగా ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధం, ద్వైపాక్షిక సహకార అంశాలు చర్చనీయాంశాలుగా నిలిచినట్లు వెల్లడించారు. ఇరువురూ అన్ని కాలాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై పరస్పర సమన్వయాన్ని పెంచడంలో కట్టుబడి ఉన్నట్టు ధ్రువీకరించారు. ఎల్లప్పుడూ చైనా నుంచి లభిస్తున్న స్థిరమైన మద్దతుకు మునీర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ఇరు దేశాలు కలిసి పనిచేయాలనే అంగీకారంతో ముగిసింది. గత నెల మునీర్ చైనాను సందర్శించినప్పుడు ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, వాంగ్, సైనిక ఉన్నతాధికారులను కలిశారు. అయితే, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో భేటీ కాలేదు. ఇలావుంటే, వాంగ్ – పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్తో



కలిసి చైనా–పాక్ ఆర్థిక కారిడార్ 2.0, వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, బహుపాక్షిక సహకారం, ప్రజల మధ్య సంబంధాలు తదితర విషయాలపై గురువారం వ్యూహాత్మక సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశానికి ముందు, వాంగ్ కాబూల్‌లో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రులతో త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఇరువురూ కలసి సిపిఇసిని కాబూల్ వరకు విస్తరించేందుకు, అలాగే పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు అంగీకరించారు. మూడు సంవత్సరాల్లో వాంగ్ పాకిస్తాన్‌లో పర్యటించడం ఇది మూడోసారి. తాజాగా జరిగిన ద్వైపాక్షిక సమావేశాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు మరింత మెరుగుపడినట్టు చెప్తున్నారు. ఈ వారం ప్రారంభంలోనే వాంగ్ భారత్‌ను కూడా సందర్శించి, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్లతో సరిహద్దు చర్చల 24వ రౌండ్లో పాల్గొన్న విషయం తెలిసిందే.

## గాజా నగరం ధ్వంసం కావొచ్చు
### ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక



**దీర్ అల్-బాలా :** హమాస్ తన నిబంధనలను అంగీకరించని పక్షంలో గాజా నగరాన్ని పూర్తిగా ధ్వంసం చేసే అవకాశం ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ శుక్రవారం హెచ్చరించారు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సైనిక దాడి చేపట్టేందుకు ఇజ్రాయెల్ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తున్నది. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి అతి పెద్ద ఆపరేషన్‌కు అనుమతి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహు ప్రకటించిన ఒక రోజు తరువాత, రక్షణ మంత్రి కాట్జ్, గాజా నగరం రాఫా బైట్ హనూన్‌లా శిథిలాలుగా మారవచ్చని వ్యాఖ్యానించడం గమనార్హం. ఆ రెండు ప్రాంతాలు యుద్ధంలో ఇప్పటికే అత్యంత దారుణంగా దెబ్బతిన్నాయి. 'హమాస్ హంతకులను విడిచిపెట్టేది లేదు. వారు యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్ విధించిన షరతులకు అంగీకరించే వరకూ దాడులు కొనసాగిస్తాం' సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా కాట్జ్ పేర్కొన్నారు. బందీలు అందరినీ విడుదల చేయడం, హమాస్ పూర్తిగా నిరాయుధీకరణ చెందడం. యుద్ధం ముగించడం వంటి చర్యలకు అంగీకరిస్తేనే తమ నుంచి సానుకూల స్పందన ఉంటుందని కాట్జ్ వ్యాఖ్యానించారు. గాజా నగరం హమాస్ ప్రభుత్వ, సైనిక కేంద్రం మాత్రమే కాక, గణనీయమైన సొరంగ నెట్వర్క్ కేంద్రమని ఇజ్రాయెల్ విశ్వసిస్తోంది. అదే సమయంలో, లక్షలాదిగా పౌరులు ఆశ్రయం పొందుతున్న ఈ నగరంలో కీలక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య వ్యవస్థలు కూడా ఉన్నాయి. వాటిని ధ్వంసం చేయడం ద్వారా పాలస్తీనాను తన అదుపులోకి తెచ్చుకోవడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా కనిపిస్తున్నది. గాజా నగరం పూర్తిగా ధ్వంసం కావచ్చని కాట్జ్ హెచ్చరించడం వెనుక, ఇజ్రాయెల్ ఆలోచన స్పష్టమవుతునే ఉంది. పాలస్తీనాను ప్రపంచ పటం నుంచి చెరిపివేయాలని, కనీసం తన చెప్పుచేతుల్లో ఉంచుకోవాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. ఈ అభిప్రాయాలు బలపడే రీతిలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు రక్షణ మంత్రి కాట్జ్ దాదాపు అలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.



## ట్రంప్ సర్కార్‌కు ఊరట
### పరిశోధన నిధుల్లో కోతకు అనుమతి

**వాషింగ్టన్ :** అమెరికాలో ట్రంప్ సర్కారుకు ఊరట లభించింది. పరిశోధన నిధుల్లో విధించిన కోతను సుప్రీం కోర్టు అనుమతించింది. ఫెడరల్ స్థాయిలో వైవిధ్యం (డైవర్సిటీ), సమానత్వం (ఈక్విటీ), చేర్పు (ఇన్‌క్లూజన్ – డిఇఐ) విధానాలను తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా పరిశోధన నిధులపై ట్రంప్ ప్రభుత్వం చేసిన భారీ కోతకు అమెరికా సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. ఇది వరకు ఒక న్యాయమూర్తి 783 మిలియన్ డాలర్ల కోతను నిలిపివేస్తూ ఇచ్చిన ఆదేశాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసింది. ఈ నిధులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్‌ఐహెచ్) నుంచి కోతకు గురైనవే. 5–4 ఓట్ల వ్యత్యాసంతో తీసుకున్న ఈ తీర్పులో చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్, ముగ్గురు లిబరల్ న్యాయమూర్తులు కోతలను అనుమతించరాదని అభిప్రాయపడ్డారు. అయితే జస్టిస్ ఏమీ కోనీ బారెట్ కీలకంగా ఓటు వేసిన కారణంగా, భవిష్యత్తు ఫండింగ్‌పై ట్రంప్ ప్రభుత్వం విధించిన కోతలు కొనసాగుతాయి. దీనితో, వందలాది గ్రాంట్లు రద్దు చేయడానికి ట్రంప్ ప్రభుత్వానికి మార్గం సుగమమైంది. అయితే కేసు విచారణ ఇంకా కొనసాగుతున్న కారణంగా, తుది తీర్పుకు లోబడి ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాల అమలు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతానికి మాత్రం కోతల ఆదేశాలను అమలు చేసే అవకాశం ట్రంప్ ప్రభుత్వానికి ఉంది. కాగా, ఈ కోతలు ప్రజారోగ్యంపై ప్రత్యక్షంగా, మానవ జీవితంపై పరోక్షంగా ప్రతికూల ప్రభావాలు చూపుతాయని, ఈ నిర్ణయంపై దావా వేసిన 16 మంది డెమోక్రటిక్ అటార్నీ జనరల్స్ మరియు పబ్లిక్ హెల్త్ గ్రూపుల ప్రతినిధులు వాదిస్తున్నారు. న్యాయశాఖ కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నది. ఫండింగ్ నిర్ణయాలను కోర్టులు రెండోసారి ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నది. డిఇఐ పేరుతో అమలయ్యే విధానాలు వాస్తవానికి జాతివివక్షనే దాచిపెడుతున్నాయి అని పేర్కొంది. ఈ దావా మొత్తం 12 బిలియన్ డాలర్ల ఎన్‌ఐహెచ్ పరిశోధన ప్రాజెక్టుల్లోని చిన్న భాగానికే పరిమితం అవుతుంది. కానీ ట్రంప్ ప్రభుత్వం తన అత్యవసర అప్పీల్‌లో మరెన్నో ఫండింగ్ కోతలను ఆపిన దిగువ కోర్టు నిర్ణయాలను సైతం సవాలు చేసింది. సొలిసిటర్ జనరల్ డి. జాన్ సావర్ వాదన ప్రకారం, ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాల కోతలను ముందే సుప్రీంకోర్టు అనుమతించింది. కాబట్టి పరిశోధన గ్రాంట్లు కూడా ఆ తీర్పులోనే చేరతాయి. అందువల్ల కేసులు ఇతర క్లెయిమ్స్‌ను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి. కాగా, ఈ అభిప్రాయాన్ని ఐదుగురు కన్సర్వేటివ్ న్యాయమూర్తులు సమర్థించగా, జస్టిస్ నీల్ గోర్సచ్ ప్రత్యేక అభిప్రాయంలో దిగువ కోర్టులు ముందస్తు సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడం అనవసర జోక్యాలకు కారణమైంది అని విమర్శించారు. చివరికి సుప్రీం కోర్టు డిఇఐ విషయంలో ట్రంప్ సర్కారు నిర్ణయానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

## వెల్లువెత్తిన ఉద్యమ స్ఫూర్తి (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదికపై గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు జరిగిన చర్చలో 58 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చకు కూనంనేని సాంబశివరావు సమాధానం ఇచ్చిన అనంతరం సభ ఆమోదించింది. వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు, వివిధ వర్గాల సమస్యలపై 42 తీర్మానాలను ప్రతినిధులు ప్రవేశ పెట్టగా మహాసభ చర్చించి ఆమోదించింది. అనంతరం సిపిఐ రాష్ట్ర నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రజాసమస్యలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై ప్రజానాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

**727 మంది ప్రతినిధులు హాజరు**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభకు మొత్తం 727 ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 619 పురుషులు, మహిళలు 71 మంది ఉన్నట్లు మహాసభ అర్హత కమిటీ ప్రకటించింది.ఇందులో వివాహితులు 590 మంది, అవివాహితులు 71 మంది ఉన్నట్లు వెల్లడించింది. 26 నుంచి 30 ఏళ్ల లోపు వారు 25 మంది, 31 నుంచి 35 మధ్య వయస్సు వారు 41మంది, 36 నుంచి 40 మధ్య వయస్సు 69 మంది, 41 నుంచి 50 లోపు వయస్సు వారు 190 మంది, 51 నుంచి 60 ఏళ్ల లోపు వారు 184 మంది 61 నుంచి 70 వయస్సు వారు 147 మంది, 71పైన బడిన వారు 34 మంది మహాసభలో పాల్గొన్నారు.5 వతరగతి లోపు వారు 33 మంది , 10వ తరగతి లోపు 156 మంది, ఇంటర్ 148 మంది, ఐటిఐ, పాలిటెక్నిక్ 18 మంది, డిగ్రీ 169 మంది, పిజి 12 మంది, ఇంజనీరింగ్ 12 మంది, లాయర్ 38 మంది , పిహెచ్‌డి 2, ఆపైన 8 మంది ఉన్నారు. ఈ నివేదిక అర్హతకమి కన్వీనర్ తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు ప్రవేశపెట్టగా, ప్రతినిధుల సభ ఆమోదించింది.

**ఆడిట్ కమిషన్ నివేదిక ఆమోదం**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన సిపిఐ మూడవ మహాసభలు జరిగిన తర్వాత 2022 అక్టోబర్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు గాను జమా ఖర్చులకు సంబంధించిన వై.కష్ణమూర్తి, వివిఎస్.మూర్తి, వై.జానకిరామ్‌లతో కూడిన అడిట్ కమిషన్ ఇచ్చిన నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు, అడిట్ కమిటీ సభ్యులు వై,కష్ణమూర్తి (92)ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు.

**నవచేతన పబ్లిషింగ్ హౌజ్ పుస్తక ప్రదర్శనను తిలకించిన రాజా**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ప్రాంగణంలో నవచేతన పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సిపిఐ ఐజాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తిలకించారు. ఈ సందర్భంగా రాజా పలు పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. పుస్తకాలకు సంబంధించిన వివరాలను రాజాకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస రెడ్డి వివరించారు.

## అసమర్థులు రాజ్యమేలడం వల్లనే రైతులకు కష్టాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిపాలన అంటే ఏమిటో తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లనే రైతులకు కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కెసిఆర్ నాయకత్వం, ముందుచూపు, పకడ్బందీ పాలన అంటే ఏమిటో ఇప్పుడు తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. గతంలో సిఎం కెసిఆర్ సారథ్యంలో యూరియాను సకాలంలో తెప్పించడానికి అనేక ప్రణాళికలు, కసరత్తులు జరిగేవని కెటిఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సన్నద్ధమవ్వండి (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రంలో పార్టీని విస్తరించడానికి, బలోపేతం చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని, పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్దులు కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియతృంత్వ, ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదవాది, ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి గత 11 ఏళ్లుగా ఢిల్లీలో ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేయడం దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో బిజెపిని ఎదుర్కొనేందుకు వామపక్ష పార్టీలు ఆచితూచి అడుగులు వేయాలన్నారు. బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 'బిజెపికి హటావో దేశ్ కో బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహించిందని గుర్తు చేశారు.

## ఎదురులేని శక్తిగా సిపిఐ
(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు సన్నద్దం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రంలో కులాలు , మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తున్న బిజెపిని రాజకీయంగా నిలువరించేందుకు సమరశీల పోరాటాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పార్టీ స్వంత కార్యాలయాలను నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజా సంఘాలను బలోపేతం చేసేందుకు నిర్విరామ కృషి చేయాలన్నారు.

**5 లక్షల మందితో సిపిఐ శత వసంతాల ముగింపు సభ**

సిపిఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపును ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా లక్షమంది రెడ్ షర్ట్ వాలంటీర్లు ఖమ్మంలో కదం తొక్కనున్నారని, 5లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు.

**ఆహ్వాన సంఘానికి ఘన సన్మానం**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలకు అతిథ్యం ఇచ్చిన సిపిఐ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా సమితిని సిపిఐ మహాసభ ఘనంగా సన్మానించింది. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్, గౌరవాధ్యక్షుడు డి.జి.సాయిలుగౌడ్, ఉపాధ్యక్షులు టి.మల్కయ్య తదితరులతో పాటు మహాసభలకు వాలంటీర్లగా సేవలందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను కూనంనేని సాంబశివరావు సత్కరించారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదిక (ముసాయిదా)పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించిందని చెప్పారు. దిండి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ 25 రోజుల పాదయాత్ర చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని తీసుకువచ్చిన విషయాన్ని సత్యం గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందని నెల్లికంటి సత్యం అన్నారు. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి ఇదో చెంప పెట్టు అయిందని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై చేపట్టిన దమనకాండను నిరసిస్తూ మొట్ట మొదటగా సిపిఐ ఖండించడంతో పాటు వామపక్ష పార్టీలతో కలిసి నిరసన చేపట్టినట్లు వివరించారు.

## జనవరిలో జాతికి అంకితం (మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2022 అక్టోబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే విధించినప్పటికీ దాదాపు రెండు సంవత్సరాల పాటు నాటి పాలకులు యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన పరిశ్రమ ఒక్కరోజు ఆలస్యమైనా ఆ ఆర్థిక భారం రాష్ట్ర ప్రజలపై తీవ్రంగా పడిందన్నారు. తాము అధికారంలోకి రాగానే వెనువెంటనే 2024 ఫిబ్రవరిలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, పర్యావరణ అనుమతులను వెంటనే తీసుకొచ్చామన్నారు. ఆనాటి నుంచి రోజువారిగా యాదాద్రి పవర్ ప్రాజెక్టు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. పవర్ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే లైన్, కార్మికులు అధికారులు ఉండేందుకు టౌన్‌షిప్ ఏర్పా టు ఇవన్నీ నిర్దేశిత సమయాన్ని నిర్ణయించుకున్నామని, బిహెచ్ఇఎల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పవర్ ప్లాంట్ పరిసరాలలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని, స్థానిక ప్రజలు ఇబ్బంది పడకుండా, రహదారులు దెబ్బతినకుండా ప్రత్యేకంగా సిసి రోడ్లు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తామన్నారు.

రహదారుల నిర్మాణ క్రమంలో భూ సేకరణకు అవసరమైన నిధులను మంజూరు చేశామన్నారు. భద్రాద్రి పవర్ యూనిట్ రాష్ట్రానికి గుదిబండగా మారిందిగత ప్రభుత్వ పెద్దలు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టిన భద్రాద్రి పవర్ యూనిట్ రాష్ట్రానికి గుదిబండగ మారిందని భట్టి విక్రమార్క అన్నారు. దేశంలోనే అత్యున్నత,అత్యధిక గ్రీన్‌పవర్ ఉత్పత్తికి తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రంగా చేస్తామన్నారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, 51లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం రూ.17వేల కోట్లను ఖర్చు చేసి, ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుందన్నారు. తెలంగాణ జెన్‌కో విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన 159 మంది బాధిత కుటుంబాలకు రెండో సారి మానవీయ కోణంలో ప్రభుత్వం కారుణ్య నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వం హయాంలో మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఒకసారి మాత్రమే కారుణ్య నియామకాలను చేపట్టిందన్నారు.

**ఈ 'ఉద్యోగ ఆర్డర్లు' మీరెందుకు ఇవ్వలేదు..**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగానికి, సంస్థకు పేరు తీసుకురావాలని సూచించారు. రాను రాను కాలుష్యం పెరిగే అవకాశాలు ఉంటాయని, అందుకే కాలుష్య నియంత్రనకు మరింత అధ్యయనం చేయాలన్నారు. ఉద్యోగ నియామకాలను తామే సిద్ధం చేశామని, కేవలం ఆర్డర్లు మాత్రమే ఇస్తున్నారని ప్రతిపక్ష పార్టీ తమపైన ఆరోపణలు చేస్తున్నారని, ఇదే ఆర్డర్లను వారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని, అప్పుడు ప్రతిపక్షంగా తాము ఏమైనా అడ్డుకున్నమా? అని మంత్రి కోమటి రెడ్డి నిలదీశారు. న్యాయపరమైన సమస్యలపైన తాము ప్రత్యేక శ్రద్ధ కనబర్చి నియామక సమస్యను పరిష్కరించామని వివరించారు.

## నక్సలిజానికి మద్దతిచ్చారట! (మొదటి పేజీ తరువాయి)

ముందే ముగిసి ఉండేది అని అన్నారు. మళయాళ మనోరమ గ్రూప్ శుక్రవారం కొచ్చిలో నిర్వహించిన మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన తర్వాత అమిత్ షా మాట్లాడారు. ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేయడంతో కేరళలో పార్టీ గెలిచే అవకాశాలు మరింత తగ్గిపోయాయని షా అన్నారు. 'నక్సలిజానికి సహాయం చేసిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి. ఆయన సల్వా జుడుం తీర్పు ఇచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోతే, 2020 నాటికి నక్సల్ ఉగ్రవాదం ముగిసి ఉండేది. సల్వా జుడుం తీర్పు ఇచ్చిన భావజాలం నుండి ప్రేరణ పొందిన వ్యక్తి ఆయన' అని షా సమావేశంలో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో సల్వా జుడుంపై 2011 సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ అన్నారు. డిసెంబర్ 2011లో, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మావోయిస్టు తిరుగుబాటుదారులపై పోరాటంలో గిరిజన యువకులను ప్రత్యేక పోలీసు అధికారులుగా ఉపయోగించడం చట్టవిరుద్ధం,రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చారు. వారిని వెంటనే నిరాయుధులను చేయాలని కూడా ఆయన ఆదేశించారు. కేరళ నక్సలిజం భారాన్ని ఎదుర్కొందని షా అన్నారు. వామపక్ష పార్టీల ఒత్తిడితో కాంగ్రెస్ పార్టీ నక్సలిజానికి మద్దతు ఇచ్చిన, సుప్రీంకోర్టు వంటి పవిత్ర వేదికను ఉపయోగించిన అభ్యర్థిని నిలబెట్టిందని అని హోంమంత్రి అన్నారు. పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన మూడు బిల్లుల గురించి అడిగిన ప్రశ్నకు షా సమాధానమిచ్చారు, వీటిని బిజెపి అవినీతి నిరోధక చట్టంగా అభివర్ణిస్తుంది. 'ఈ విషయంపై ఇంకా చర్చించడానికి ఏమీ లేదు. నేను పార్లమెంటులో దేశ ప్రజలను అడిగాను: ప్రధానమంత్రి జైలు నుండి ప్రభుత్వాన్ని నడపాలని వారు కోరుకుంటున్నారా? ఇది ఎలాంటి చర్చ? ఇది నైతికతకు సంబంధించిన ప్రశ్న. ఇప్పుడు వారు దీనిని రాజ్యాంగంలో ఎందుకు చేర్చలేదని అడుగుతున్నారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, జైలుకు వెళ్లిన వ్యక్తులు ఎన్నికైన పదవులను కొనసాగిస్తారని ఊహించలేదు' అని ఆయన అన్నారు. 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో భారత ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితాలో ప్రధాన సవరణ అయిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ అనవసరమైన వివాదాన్ని సృష్టిస్తోందని షా ఆరోపించారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అభ్యంతరాలు తెలిపే అవకాశం కాంగ్రెస్‌కు ఉందని, కానీ ఇప్పటివరకు ఎస్ఐఆర్‌పై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు గురించి, ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. 'దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఇసి నిర్ణయించింది. బిహార్ ఓటర్ల జాబితాలో 22 లక్షల మంది మరణించారు. బోగస్ ఓట్లు వేసే అవకాశం ఉంది. కాబట్టి, వారి పేర్లను తొలగించాలా వద్దా? ఇది సాధారణ జ్ఞానానికి సంబంధించిన విషయం' అని ఆయన అన్నారు.

## పక్కదారి పడుతోంది (మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ప్రభుత్వం రైతులపైన భారం పడకుండా, సబ్సిడీతో రూ. 265లకే బస్తాను అందజేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి సుమారు రూ.80,000 కోట్ల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం భరించిందన్నారు. రూ. 2,650 విలువ గల యూరియా బస్తాను రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.266ల సబ్సిడీ ధరకే అందజేస్తే, ఆ బస్తాను రూ.400లకు కొనుగోలు చేస్తున్నారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నదని, దీని వెనుక అసలు కుట్ర ఎవరిదని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి ప్రత్యేక చర్యలతో వేపపూత పూసిన యూరియాను సరఫరా చేస్తోందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సమస్యలున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి యూరియాను పంపిణీ చేసిందని, కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన సమయంలో, రష్యా,ఇజ్రాయిల్ యుద్ధ సమయంలో కూడా రైతులకు ఎరువుల సరఫరా నిలిపివేయలేదని, సరఫరాను తగ్గించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా విషయంలో కృత్రిమ కొరతను ప్రోత్సహించడం సరికాదని, ఒక్క బస్తా కూడా అధిక ధరలకు అమ్మకుండా చూడాలని, బ్లాక్ మార్కెట్ ను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో,ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా హోల్‌సేల్ గా, ఎవరి కోటా వారికి అన్నట్టుగా అక్రమంగా భూముల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్ డిఎలను తక్షణమే చెల్లిస్తామని హామీనిచ్చినప్పటికీ పెండింగ్ డిఎలను చెల్లించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటానికి బిజెపి రాష్ట్ర శాఖ పూర్తి మద్దతు ప్రకటిస్తోందన్నారు.

హైదరాబాద్‌లోని ప్రధాన విభాగాలైన జిహెచ్ఎంసి,మెట్రోవాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్లకు కనీస నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కాంట్రాక్టర్లకు బిలులు చెల్లించకపోవడం వారు ధర్నాలు చేస్తున్నారని, అభివృద్ధి పనులకు టెండర్లను వేసేందుకు కూడా వారు ముందుకు రావడం లేదన్నారు. గత బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధిపై చేసిన మాటలు కోటలు దాటుతున్నాయని ఎద్దేవా చేశారు.

## హైకోర్టు నిరాకరణ (మొదటి పేజీ తరువాయి)

వారం రోజుల్లోగా ఆ కౌంటర్లపై పిటిషనర్లు కెసిఆర్, హరీశ్ తమ అభ్యంతరాలతో కూడిన రిప్లై కౌంటర్‌ను దాఖలు చేయాలంది. తదుపరి విచారణను ఐదు వారాలకు వాయిదా వేసింది. కమిషన్ ఇచ్చిన 650 పేజీల రిపోర్టును ప్రభుత్వం 60 పేజీలకు సంక్షిప్తం చేయించిన కాపీలు వైబ్‌సైట్స్‌లో అప్‌లోడ్ చేయడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. రిపోర్టును వెబ్‌సైట్స్ నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసెంబ్లీలో రిపోర్టు పెట్టేలోగా నివేదికను వెబ్‌సైట్‌లో ఎలా పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నివేదికలోని సమాచారం పిటిషనర్ల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని చెబుతున్నారని గుర్తు చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఎకె సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల ప్రణాళిక, డిజైన్, నిర్మాణంలో ఇతర అంశాలపై జస్టిస్ ఘోష్ నేతృత్వంలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ఇరిగేషన్ శాఖ 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. కమిషన్ ఈ ఏడాది జులై 31న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ జిఒను రద్దు చేయాలని, కమిషన్ విచారణ చట్ట వ్యతిరేకంగా జరిగినందున నివేదికను కూడా రద్దు చేయాలని, తుది ఉత్తర్వుల జారీలోగా మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కెసిఆర్, హరీశ్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై శుక్రవారం మరోసారి హైకోర్టు విచారణ ప్రారంభించిన వెంటనే అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఒక నివేదికను ధర్మాసనానికి అందజేశారు. కమిషన్ నివేదికను హైకోర్టులో ప్రవేశపెట్టి చర్చించాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారా లేక కమిషన్ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో ప్రవేశపెడతాతారా అని గురువారం హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనీపై ఎజి ఇచ్చిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టాకే తదుపరి నిర్ణయం ఉంటుందన్న ప్రభుత్వ హామీని పరిగణనలోకి తీసుకుని స్టే ఆదేశాలు అవసరం లేదని వెల్లడించింది.

తొలుత కెసిఆర్, హరీశ్ తరపు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ, కమిషన్ నివేదిక పై ప్రభుత్వం ఆరు మాసాల్లో అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలని, ఈలోగా ప్రభుత్వం నివేదికను ఆధారంగా చేసుకుని ముందుకు వెళ్లకుండా మధ్యంతర స్టే ఆదేశాలను జారీ చేయాలని ఇద్దరు న్యాయవాదులు కోరారు.

ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి, కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రతివాదనలు చేస్తూ, ఎలాంటి మధ్యంతర స్టే ఉత్తర్వులను జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టాకే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకోవాలని ఏజీ అన్నారు. పిటిషనర్లకు 8–బి, 8–సి నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కమిషన్ 119 మంది సాక్షుల విచారణలో చిట్టచివరి వ్యక్తులు పిటిషనర్లేనని, అన్నీ తెలుసుకాబట్టి నోటీసుల జారీ అవసరం లేదన్నారు. కమిషన్ నుంచి పిటిషనర్లు సమాచారాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. కిరణ్‌బేడీ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు పిటిషనర్లకు వర్తించవన్నారు. కెసిఆర్, హరీశ్‌రావు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉన్నారని, కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో నివేదించాక జరిగబోయే చర్చలో వాళ్లు తమ వాదన చెప్పుకునే వీలుంటుందని చెప్పారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఏమీ జరగదన్నారు. కమిషన్ రిపోర్టు ఇచ్చాక ముగ్గురు ఆఫీసర్లతో కమిటీ వేసి ఆ రిపోర్టులోని ముఖ్యమైన విషయాలతో 60 పేజీల్లో బ్రీఫ్ రిపోర్టు మీడియాకు చేరిందని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఆ నివేదిక లేదని చెప్పారు. పిటిషనర్లు ఇద్దరూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన నోటీసులను సవాలు చేయలేదన్నారు. కమిషన్ వద్ద ఉన్న సమాచారం ఆధానంగానే పిటిషనర్లు ఇద్దరినీ కమిషన్ విచారించిందని తెలిపారు. కమిషన్ నిజ నిర్ధారణ మాత్రమే చేస్తుందని, కమిషన్ నివేదికపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తదుపరి పరిణామాలు ఉంటాయని చెప్పారు. వాదప్రతివాదనల తరువాత ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 5 వారాలకు వాయిదా వేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తివేయాలి

### కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి లేఖ రాసిన చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తివేయాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అధిక సంఖ్యలో చేనేత రంగంలోనే ఉపాధి పొందుతున్నారని చిన్నారెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.చేనేత రంగంపై జిఎస్‌టి విధించడం వల్ల చేనేతపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని చిన్నారెడ్డి వివరించారు. చేనేత రంగంపై జిఎస్‌టిని మినహాయింపు ఇవ్వాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని, గ్రామీణ చేనేత చేతివృత్తుల కుటుంబాలను ఆదుకోవాలని చిన్నారెడ్డి ఆ లేఖలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు సెంటర్ ఫర్ మానిటరింగ్ రూరల్ ఇండియన్ ఎకానమీ అధ్యక్షులు జై ప్రకాష్ రాపోలు తనను కోరుతూ రాసిన లేఖను జత చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. రానున్న జిఎస్‌టి సమావేశంలో చేనేత రంగానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని చిన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మహిళా సిబ్బంది సమస్యలపై కమిటీ

### మహిళా పోలీసు సదస్సు తీర్మాణాలకు మద్దతు తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా పోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది, మూడు రోజుల సదస్సు ద్వారా మహిళా సిబ్బంది సంక్షేమానికి చేసే సిఫారసులను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. పోలీసు అకాడమీలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న మహిళా పోలీసుల సదస్సు ముగింపు సభను ఉద్దేశించి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. నియామక సమయంలో లేని లింగ వివక్ష విధుల్లో చూపడం సరైనది కాదని, మహిళ పోలీసులో మహిళా అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచనని, రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఈ సిఫారసుతో తాను ఏకీభవిస్తున్నానని డిప్యూటీ సిఎం తెలిపారు. మహిళా సిబ్బంది వ్యక్తిగత అవసరాలు, యూనిఫామ్ అవసరాలు అన్ని అమలు చేయదగినవే అవేమి గొంతెమ్మ కోరికలు కాదని అన్నారు. మహిళా పోలీస్ సిబ్బంది సమస్యలపై త్వరితగతిన కమిటీ వేసి సైంటిఫిక్‌గా రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే సిబ్బంది అవసరాల గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంటుందని తెలిపారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలి అంటే, పెట్టుబడులు రావాలి అంటే శాంతి భద్రతలు బాగుండాలి, అప్పుడే పెట్టుబడులు వస్తాయని తెలిపారు.

అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బంది ఉన్నప్పుడే అది సాకారం అవుతుంది అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు, ఉత్సవాలు జరిగాయి పోలీసులు జీవితాలను పనంగా పెట్టి చిన్న దుర్ఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందన్నారు. పోలీసు సిబ్బంది శ్రమ రాష్ట్ర అభివృద్ధికి మూలం అన్నారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత సమస్యలతో పాటు శాఖపరమైన అవసరాలు కార్యాలయాల భవనాలు, పోలీ స్ స్టేషన్‌లు, సిబ్బంది క్వార్టర్స్ వంటి సమస్యలకు సంబంధించి ప్రతిపాదనలు తీసుకురావాలని పోలీసు అధికారులకు డిప్యూటీ సిఎం సూచించారు. పోలీస్ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఒక యంగ్ ఇండియా ఇప్పటికే ప్రారంభించామని అది బాగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం తెలిపారు. డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ... దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని సంపాదించుకున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మహిళా పోలీస్ సిబ్బంది కోసం దేశంలోనే మొదటిసారిగా మూడు రోజుల సదస్సు నిర్వహించిందని అన్నారు. ఈ మహిళా సదస్సులో వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానన్నారు. మహిళల విషయంలో పోలీసు సిబ్బంది సైతం వివక్ష కనబరిస్తే ఉపేక్షించేది లేదని ఇటీవలే తాను క్రమశిక్షణ చర్యలు చేపట్టానని తెలియజేశారు. సదస్సులో జరిగిన చర్చల వివరాలను పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, అడిషనల్ డిజిపి స్వాతి లక్రా, తమిళనాడు రాష్ట్ర పోలీసు అధికారి బాలనాగదేవి, ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, పోలీస్ అకాడమీ అధికారులు, సిబ్బంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటి నుండి జాతీయ క్రీడా ఉత్సవాలు

### క్రీడా కార్యక్రమాల్లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలి : క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి నుండి తొమ్మిది రోజులపాటు జరుగనున్న 'జాతీయ క్రీడా ఉత్సవాల'లో క్రీడాకారులు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి క్రీడాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించినంత ఉత్సాహభరితంగా జాతీయ క్రీడ వేడుకలను 9 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి అనుగుణంగా అందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు . ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానం అంశాలను క్రీడా సమాజానికి చేరువయ్యే విధంగా వివిధ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలు క్రీడాకారులు క్రీడాభిమానులు యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలలో కూడా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆయన కోరారు.



తెలంగాణ స్పోర్టస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న అకాడమీలు స్పోర్టస్ స్కూల్‌లను బలోపేతం చేయాలని, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానాలలో శిక్షణ పొందుతున్న రెగ్యులర్ ట్రైనిలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. క్రీడారంగం బలోపేతం కావాలి అంటే పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు మరియు కోచుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడా శాఖ విద్యాశాఖ మధ్య సమన్వయంతో గ్రామీణ స్థాయి నుండి అంచలంచలుగా క్రీడాభివృద్ధికి కృషి జరగాలని ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**'సిఎం కప్– 2025'పై నేడు సమీక్ష..**

సీఎం కప్ 2025 ఈసారి, ఏదో మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా పకడ్బందీగా ఉండాలని గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసే విధంగా మట్టిలో మాణిక్యాల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా కార్యక్రమం రూపకల్పన జరగాలని, ఇందుకోసం అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు శనివారం క్రీడా శాఖ మంత్రి కార్యాలయంలో అన్ని జిల్లాల యువజన క్రీడాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వారితో చర్చించిన తర్వాత సిఎం కప్ 2025 రూపకల్పన చేసి ప్రకటిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శివసేనారెడ్డితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, సుజాత, పద్మావతి ఇంజనీర్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్‌కు క్యారెక్టర్ లేదు

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరుపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించిన కెటిఆర్‌కు క్యారెక్టర్ లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీపై ఇలా మాట్లాడటం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. 'వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ మీకు థర్డ్ క్లాస్ పార్టీగా, చిల్లర పార్టీగా కనిపిస్తోందా? ఆ పార్టీ నుంచే రాజకీయాలు నేర్చుకున్న మీ నాన్న కెసిఆర్ కూడా థర్డ్ క్లాసే కదా?' అని నిలదీశారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాధ్యమైందని స్వయంగా కెసిఆర్ అసెంబ్లీలో చెప్పిన మాటలను కేటీఆర్ మరిచిపోయారా అని ధ్వజమెత్తారు. తెలంగాణ రాకపోయి ఉంటే కెటిఆర్ కుటుంబం పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు. 'సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు అమెరికాలో జీతం మీద బతికే వారు. మీ కుటుంబం వేల కోట్లు సంపాదించే అవకాశం ఉండేది కాదు' అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత సోనియా గాంధీ ఇంటికి వెళ్ళి కలిసినప్పుడు లేనిది, ఇప్పుడు కాంగ్రెస్ చిల్లర పార్టీగా ఎందుకు కనిపిస్తోందని ఆయన ప్రశ్నించారు. పదేళ్లు మంత్రిగా పనిచేసినా కెటిఆర్‌కు రాజకీయ పరిణతి రాలేదని, బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని జగ్గారెడ్డి అన్నారు. ఆయన తాత, నానమ్మ బతికి ఉంటే ఇలాంటి మాటలకు చెంప మీద కొట్టేవారని వ్యాఖ్యానించారు. కెసిఆర్ చేసిన దీక్ష కూడా నాటకంలో భాగమేనని ఆయన ఆరోపించారు. తాను సచివాలయంలో సమీక్షలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తాను సమీక్షలు చేస్తానని, వాటిని ఆపేది లేదని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి నేతల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల రైతులకు యూరియా అందించే పనిలోనే ఉన్నారన్నారు. కేంద్రం దగ్గర తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఎన్నిక



**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ :** సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ శుక్రవారం నాడు రాష్ట్ర నూతన కంట్రోల్ కమిషన్‌ను ఎన్నుకుంది. కమిషన్ చైర్మన్‌గా ఎం.డి.మౌలానా (ఖమ్మం), కార్యదర్శిగా ఎం.వెంకటస్వామి(మంచిర్యాల), సభ్యులుగా పొనగంటి కేదారి (కరీంనగర్), మిర్యాల రంగయ్య (కొత్తగూడెం), హెచ్.ఆనంద్‌జీ (నాగర్ కర్నూల్), పల్లా దేవేందర్‌రెడ్డి(నల్లగొండ), పుస్తకాల నర్సింగ్‌రావు (రంగారెడ్డి), డి.జి.సాయిలుగౌడ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), వి.ప్రకాశ్‌రావు (సంగారెడ్డి) ఎన్నికయ్యారు.

# రాత్రంతా అడవిలోనే...

### మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేడు నేచర్ క్యాంప్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో శనివారం నేచర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో సాయంత్రం 5 గంటల నుండి ఆదివారం ఉదయం 10 గంటల వరకు నేచర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెలలో ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుండడంతో నేచర్ క్యాంప్‌ను రద్దు చేశారు. ఇటీవలే ఈ పులిని అటవీ శాఖ అధికారులు బంధించడంతో తిరిగి నేచర్ క్యాంప్‌ను ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, నోక్టర్నల్ వాక్ (రాత్రి పూట అడవిలో నడక), నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, ఉదయం బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలు ఉంటాయి, వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం మరియు ఉదయం బ్రేక్ ఫాస్ట్ కూడా అందిస్తారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9.30 గంటల వరకు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో 'బర్డ్ వాక్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ యొక్క కార్యక్రమానికి పిల్లలు పెద్దలు అందరూ ఆహ్వానితులేనని, పాల్గొనే వారు పక్షుల జాతులను గుర్తించడం, పక్షులు ఏ రకమైన వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలలో గూళ్ళు కడతాయి అనేది తెలుసుకోవచ్చు, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి, పక్షులు ఎలా ఎగురుతాయి, మరియు వాటి సామాజిక ప్రవర్తనలు ఎలా ఉంటాయో మా యొక్క పక్షి నిపుణులు మరియు నేచరలిస్ట్‌లు వచ్చిన వారికి పక్షులను చూపిస్తూ క్షుణ్ణంగా వివరిస్తారని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ తెలిపారు. ఈ యొక్క 'నేచర్ క్యాంప్' 'బర్డ్ వాక్' కార్యక్రమాలలో పాల్గొనాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 73823 07476 లేదా 94935 49399 నెంబర్‌లను సంప్రదించాలని వారు కోరారు.

## కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అలకనంద హస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐడి అదనపు డిజిపి చారుసిన్హా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసులో ఏ24 నిందితుడిగా ఉన్న డాక్టర్ రుత్తల వెంకట రమణ సంతోష్ నాయుడుని ఎపిలోని ఏలూరులో అరెస్ట్ చేసినట్లు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. విశాఖపట్నంలో అనస్థీషియాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ వెంకట రమణ సంతోష్ కిడ్నీ రాకెట్ కేసులో ఉన్న డా.రాజశేఖర్, డా.అవినాష్‌లకు సహకరించే వాడని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. కిడ్ని ట్రాన్స్‌ప్లెంటేషన్స్ అలకనంద హస్పిటల్‌తోపాటు, జనని, ఆరుణ హస్పిటల్‌లో జరిగినట్లు తెలిపారు. పేషెంట్స్‌కు మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు నిందితులకు సహక రించే వారని వెల్లడించారు. ఒక్కో కిడ్ని ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు మత్తు ఇచ్చినందుకు కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న పవన్ కుమార్ నుంచి రూ.2.5 లక్షలు డాక్టర్ వెంకట రమణ తీసుకునే వాడని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. నిందితుడి జ్యూ డిషియల్ రిమాండ్‌కు కొరకు ఎబీ నగర్ కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికి 19మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరారిలో ఉన్న మిగతా నిందితుల కోసం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రపంచానికే ఆదర్శంగా
# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

### 300 ఎకరాలలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం.. అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచానికే ఆదర్శంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని (కొత్తగూడెం) నిర్మించేలా అద్భుత ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో ప్రముఖ ఆర్కిటెక్ ఉషా రూపొందించిన కొత్తగూడెం మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిర్మాణ ప్లాన్‌ను వైస్ ఛాన్సలర్ యోగితా రాణా, ఇతర అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రపంచానికే తలమానికంగా తెలంగాణ రాష్ట్రంలో మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యాధునీక సాంకేతిక పద్ధతులతో అన్ని మౌలిక సదుపాయాలతో యూనివర్సిటీని నిర్మించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడ లోటుపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పకడ్బందీగా ప్లాన్‌ను రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, లెక్చరర్లకు అసౌకర్యం లేకుండా విశాలమైన తరగతిగదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలను నిర్మించాలన్నారు. ఆర్కిటెక్ తయారు చేసిన డిజైన్లను త్వరలో ముఖ్యమంత్రికి చూపించి ఆయన ఆదేశాలకనుగుణంగా డిజైన్ల ఆమోదం తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి ఇచ్చిన వెంటనే ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌తో మాస్టర్ ప్లాన్ గురించి మంత్రి తుమ్మల మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని, హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మూడేళ్లలో యూనివర్సిటీ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటి యూనివర్సిటీ అన్నారు. ఇది రాష్ట్రానికే కాకుండా దేశానికే తలమానికంగా ఆకర్షణీయమైన డిజైన్లతో దీనిని నిర్మించాలన్నారు. 300 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకోనుందని ఈ యూనివర్సిటీ ద్వారా వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలు కలగనున్నాయన్నారు. మైనింగ్ కళాశాలను విశ్వ విద్యాలయంగా మార్చడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అపారమైంది. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎర్త్‌సైన్స్ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ముఖ్యమంత్రిని ఒప్పించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతకృత్యులయ్యారు. ప్రపంచానికే తలమానికంగా విశ్వ విద్యాలయాన్ని నిలిపేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారు. ఖమ్మం జిల్లా ప్రతిష్టను ప్రపంచానికి చాటిచెప్పేలా విశ్వ విద్యాలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషి పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కూనంనేని సాంబశివరావు

(మొదటి పేజీ తరువాయి)

పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మ ణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమామహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా

**ఆహ్వానితులు:** గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాండ్ర సదానందం ఎన్నికవ్వగా, రంగారెడ్డి నుంచి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంది.

**సిపిఐ నూతన రాష్ట్ర సమితి**

**రాష్ట్ర సమితి సభ్యులు :**

**రాష్ట్ర కేంద్రం :** కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్, ఎన్.జ్యోతి, వి.సృజన, ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసుఫ్, కలకొండ కాంతయ్య, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్, వి.సీతారామయ్య, బొమ్మగాని ప్రభాకర్, బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, ఎన్.మధుకర్, రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహా, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.ధనుంజయనాయుడు, మారపాక అనిల్‌కుమార్.

**జిల్లాల నుంచి:** సుధాకర్(నిజామాబాద్), ఎల్.దశరథ(కామారెడ్డి), టి.ఎం.ఖాలీఖ్ (మెదక్), విజయలక్ష్మీ పండిట్ (వికారాబాద్), చెన్న విశ్వనాథం (జగిత్యాల), టి.నర్సింహా(నారాయణపేట్), బి.ఆంజనేయులు(గద్వాల్), బి.బాలకిషన్ (మహబూబ్‌నగర్), తోట మల్లిఖార్జున్‌రావు (ములుగు), ముడుపు ప్రభాకర్ రెడ్డి (ఆదిలాబాద్), బద్రి సాయికుమార్ (ఆసిఫాబాద్), మంద సుదర్శన్ (సిరిసిల్లా), కె.విజయరాములు (వనపర్తి), సయ్యద్ జలాలుద్దీన్ (సంగారెడ్డి), మేకల రవి, షేక్ బాసుమియా, పంజాల రమేశ్ (వరంగల్), పంజాల శ్రీనివాస్, అందె స్వామి (కరీంనగర్), రామడుగు లక్ష్మ ణ్, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ (మంచిర్యాల), తాండ్ర సదానందం, గోశిక మోహన్ (పెద్దపల్లి), దండి సురేశ్, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు (ఖమ్మం), ఎస్.కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి (కొత్తగూడెం), ఎస్.ఎం.డి.ఫయాజ్ (నాగర్ కర్నూల్), మందా పవన్, కె.శంకర్ (సిద్ధిపేట్), నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహా రెడ్డి, ఎల్.శ్రవణ్‌కుమార్ (నల్లగొండ), గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు (సూర్యాపేట), గోదా శ్రీరాములు, యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, చేడె చంద్రయ్య (యాదాద్రి భువనగిరి), పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎం.డి.ఫమీదా, ఓరుగంటి యాదయ్య (రంగారెడ్డి), ఇ.ఉమామహేశ్, జి.దామోదర్‌రెడ్డి (మేడ్చల్), కర్రె భిక్షపతి, అదారి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మందా సదాలక్ష్మి (హన్మకొండ), కొరిమి రాజ్‌కుమార్ (భూపాలపల్లి), సి.హెచ్.రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ (జనగామ), బి.విజయసారధి, బి.అజయ్ సారధి(మహబూబాబాద్), స్టాలిన్, ఛాయాదేవి (హైదరాబాద్),ఇన్సాఫ్(1), నిర్మల్ జిల్లా(1), మజ్దూర్ ఫ్రంట్ (1), రంగారెడ్డి (2) సభ్యులను ఎన్నుకోవలసి ఉంది.

**క్యాండిడేట్ సభ్యులు :**

ముడుపు నళిని(మహిళా ఫ్రంట్), ఎం.నర్సింహా, బి.వెంకటేశ్ (ట్రేడ్ యూనియన్), ఆజ్మీరా రామ్మూరి(గిరిజన సంఘం), కె.భూమయ్య (ఎఐకెఎస్), కె.వి.ఎల్.(అయిప్సో), జోగుల మల్లయ్య (మంచిర్యాల), సిద్ధినేని కరుణాకర్ (ఖమ్మం), సలిగంటి శ్రీనివాస్ (కొత్తగూడెం), బంటు వెంకటేశ్వర్లు(నల్లగొండ), ఉస్తేల నారాయణరెడ్డి(సూర్యాపేట), టి.రామకృష్ణ, బుద్దుల జంగయ్య(రంగారెడ్డి)

**ఆహ్వానితులు :**

కె.సూర్యనారాయణ (ఎఐకెఎస్), కె.శ్రీనివాస్ (ప్రజానాట్య మండలి), టి.వెంకట్రాములు(వృత్తి సంఘాలు), ఎస్.బాబు(ఆర్‌టిసి), జానకిరామ్ (బ్యాంకింగ్), వి.చెన్నకేశవరావు(సి.ఆర్.ఫౌండేషన్), ఉజ్జిని రత్నాకర్‌రావు(తెలంగాణ అమరవీరుల ట్రస్ట్), కట్టెబోయిన శ్రీనివాస్(మహబూబాబాద్), ఇప్పకాయల లింగయ్య, బొల్లం పూర్ణిమ (మంచిర్యాల), ఎం.డి.సలీమ్, బి.జి.క్లెమెంట్(ఖమ్మం), ఎస్.డి.సలీమ్, రావులపల్లి రవికుమార్, చంద్ర నరేంద్ర కుమార్(కొత్తగూడెం), వర్ల వెంకటయ్య, కౌకుంట్ల కేశవులుగౌడ్(నాగర్‌కర్నూల్), ఉజ్జిని యాదగిరిరావు (నల్లగొండ), ఆది సాయన్న (జనగామ), నల్లు సుధాకర్ రెడ్డి(మహబూబాబాద్), కమతం యాదగిరి, జి.చంద్రమోహన్‌గౌడ్ (హైదరాబాద్), తోట భిక్షపతి (హన్మకొండ), గౌతమ్ గోవర్ధన్ (పెద్దపల్లి), కె.ఏసురత్నం (మేడ్చల్ మల్కాజ్‌గిరి), వీరభద్రయ్య (సింగరేణి), సిద్ధిపేట (1), యాదాద్రి భువనగిరి(1), రంగారెడ్డి (1)ల నుంచి ఒక్కొక్కరిని ఎన్నుకోవలసి ఉంది.

## వైద్య విద్యార్థులకు శుభవార్త

### 1623 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరోగ్యశాఖలో మరోసారి ఉద్యోగాల జాతర మొదలైంది. ఈ మేరకు శుక్రవారం 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టు ల భర్తీకి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్స్‌లో 1616, ఆర్‌టిసి హాస్పిటల్లో 7 పోస్టులు ఉన్నాయి. దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్లోని హాస్పిటల్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనుంది. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగు అవనున్నాయి. మరోవైపు పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ కానున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభు త్వం భర్తీ చేసిన విషయం తెలిసిందే. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No.E1/DB/MCK/8201/228/2025-26 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన) తేది: 21.08.2025
ఎంసికె లోని కరీంనగర్ నగర పరిధిలోని వివిధ ప్రదేశాలలో 03 స్పీడ్ బ్రేకర్లు మరియు రంబుల్ స్ట్రిప్లు ఎంజిఎఫ్ కింద - **మొత్తం అంచనా వ్యయం:** రూ.35.00 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 23.08.2025 - 04.00PM, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 02.09.2025 - 04.00PM, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 6892-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, కూకట్‌పల్లి జోన్.
GHMC
NIT No. 04/GHMC/KPZ/CTO/2025-26 (టెండర్ ప్రకటన) తేది: 22.08.2025
**క్ర.సం.1, పని పేరు:** జిహెచ్‌ఎంసి, కూకట్‌పల్లి జోన్‌లో గణేష్ పండుగ-2025 దృష్ట్యా (01) నెల పాటు సిఆర్‌ఎంపి ప్రధాన రహదారి విస్తరణలలో మెకానికల్ స్వీపింగ్ నియామకం. **అంచనా విలువ / ఇసివి:** రూ.25,00,000.00, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 23.08.2025న ఉ.11.00గం.ల నుండి 26.08.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ గోవర్ధన్ గౌడ్, చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, జిహెచ్‌ఎంసి, కూకట్‌పల్లి జోన్. సెల్ నెం. 7337367270. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/ లో చూడవచ్చు.
సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, కూకట్‌పల్లి జోన్.
DIPR R.O. No. : 6914-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025

తెలంగాణ ప్రభుత్వము
**శ్రీయుత అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నల్లగొండ వారి కార్యాలయము, నల్లగొండ జిల్లా**
టెండరు ప్రకటన
నల్లగొండ జిల్లాలోని (868) గ్రామ పంచాయతీలలో **LED వీధిదీపాలు** సరఫరా చేయుటకు మరియు రిపేరు చేయుటకు రేటు కాంట్రాక్టు కొరకు ఆసక్తి గల వారి నుండి సీల్ టెండర్స్ కోరబడుచున్నవి.
కావున, ఆసక్తి గల వారు, వారి యొక్క ఫర్మ్ లెటర్ పాడ్ (with GST నెం.) తో పాటు దిగువ చూపిన సమాచారంతో కూడిన సీల్డ్ టెండర్లు తేది: 23-08-2025 ఉదయం 11:00 గంటల నుండి తేది: 26-08-2025 మధ్యాహ్నం 04:00 గంటల వరకు శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి వారి కార్యాలయము, నల్లగొండ యందు సమర్పించుటకు కోరనైనది. టెండర్ 26-08-2025 సాయంత్రం 04:00 గంటలకు తెరవబడును. వివరాలకు శ్రీ యన్.వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతి కార్యాలయము, నల్లగొండ గారిని (8074172060) సంప్రదించగలరు.

| Sl.No. | Description / Material | |
|---|---|---|
| 1 | STREET LIGHTS (LED) | |
| 2 | REPAIRS OF STREET LIGHTS | |

సం/- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నల్లగొండ
దీనిప్రతి శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి, నల్లగొండ గారికి తదుపరి చర్య నిమిత్తం.
DIPR R.O. No. : 6903-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025

## నూతన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ



ప్రజా పక్షం/తిరుమలగిరి సాగర్: మండలంలోని నెల్లికల్ లో నూతన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ఏర్పడి రేండేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నెల్లికల్ లిఫ్ట్ పనులు గానీ, నెల్లికల్ లిఫ్ట్ క్రింద రైతులకు భూమి కోల్పోయిన వారికి ఎక్కడ లేని విధంగా 1ఎకరానికి సుమారు 24లక్షల రూపాయలు ఇచ్చామన్నారు.

## చంద్రమౌళి ఆసుపత్రి సీజ్ డిఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/మునగాల: మండల కేంద్రంలో 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఆర్ఎంపి చంద్రమౌళి ఆసుపత్రిని శుక్రవారం డిఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈనెల 5వ తేదీన మండలంలో బరాఖత్ గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి చంద్రమౌళి చేసిన వైద్యం వికటించి మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై మునగాల పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొన్నిరోజుల కిందట డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి ఆధ్వర్యంలో చంద్రమౌళిక ఆసుపత్రితో పాటు అనుబంధంగా ఉన్న అమ్మ రక్త పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరిమితికి మించి వైద్యం చేయవద్దని, అనవసరంగా యాంటిబయోటిక్ మందులు వినియోగించవద్దని హెచ్చరించారు. చంద్రమౌళి ఆసుపత్రిని మరల తెరిచి వైద్యం చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి తన సిబ్బందితో సహా ఆసుపత్రికి వద్దకు చేరుకుని సెంటర్‌ను సీజ్ చేశారు. ఆయన వెంట డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి, స్థానిక వైద్యాధికారి రవీందర్ పాల్గొన్నారు.




## ప్రజల భాగస్వామ్యంతో పటిష్ఠంగా పనిచేయాలి : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట: నేరాలు జరగకుండా సాంకేతిక వినియోగం చేసుకుని ప్రజల భాగస్వామ్యంతో పటిష్టంగా పనిచేయాలని జిల్లా ఎస్‌పి కె. నర్సింహా పోలీసులకు అదేశించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ రవాణ నిరోదనలో క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని, ప్రతి అంశాన్ని రికార్డులో నమోదు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు, కోర్టు పెండింగ్ కేసులు, వాహనాల తనిఖీలు, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్టిక్ నైట్ అలార్టింగ్ అధికారి విధులు, హైవై పెట్రోలింగ్, కార్డన్ సెర్చ్, దొంగతనాల కేసుల్లో నగదు స్వాధీనంపై ఆయన సమీక్షించి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని కోరారు. పెట్రోలింగ్ బిట్ సమర్ధవంతంగా నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పలువురుపోలీస్ అధికారులకు రివార్డులు అందజేశారు. జిల్లా అదనపు ఎస్‌పిలు రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట, కోదాడ డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీధర్‌రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నర్సించారితో పాటు ఆయా పోలీస్‌స్టేషన్‌ల సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకోవాలి




ప్రజాపక్షం/మిర్యాలగూడ: ప్రతి విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకో వాల అని తెలంగాణ విద్యా వికాస వేదిక నాయకులు కస్తూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మిర్యాలగూడలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిచయం శాస్త్రీయ దృక్పథం అనే అంశం పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంత్రగాళ్ళు తంత్రగాళ్ల పేరుతో వచ్చి పేద ప్రజలను మోసం చేస్తున్న వారీని నమ్మవద్దని అన్నారు. సామాజికవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తీసుకోవాలని రోజువారి ఆహారంలో ఆకుకూరలు గుడ్డు పప్పు లాంటివి తినడం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్ విటమిన్స్ అందుతాయని ఆపిల్ కన్నా అరటి మేలు చేస్తుందని లడ్డు కన్నా గుడ్డు మరి ఎంతో మంచిదని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కొండల్ రెడ్డి మ్యాజిక్ ద్వారా సైన్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర కృష్ణ కాంత్ నాయక్, ఉపేందర్‌పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పి రమేష్ అన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని ఎన్‌జి కళాశాల లో విద్యార్థులకు సైబర్ నేరాల గురించి ఆడిషనల్ ఎస్‌పి రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయ ణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చదువుకున్న విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉంటే తన చుట్టూ పరిసరాల్లో ఉన్న ప్రజలకు,వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తద్వారా సైబర్ మోసాలు నిరోధించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రంమలో సైబర్ క్రైమ్ ఎస్ఐ విష్ణు,కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గురుకుల విద్యార్థులు సత్తా

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాపక్షం/నందికొండ: తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ లో భాగంగా నల్లగొండ మేకల అభినవ్ స్టేడియం గురువారం నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ మీట్ లో నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి ఈ నెల 30, 31న మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్రస్థాయి అథెటిక్స్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లాస్థాయిలో వివిధ కేటగిరీలలో విజయంతో పతకాలు సాధించి క్రీడాకారుల వివరాలు అండర్ 18 విభాగంలోనందకిషోర్ 1 కిలోమీటర్ పరుగు పందెంలో స్వర్ణం సాధించగా, దినేష్ జావలిన్ త్రో లో స్వర్ణం, లాంగ్ జంప్ లోరజతం సాధించాడు అదేవిధంగా రవితేజ 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. అండర్ 16 విభాగంలో గణేష్ 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ రెండింటిలో స్వర్ణం సాధించగా అరవింద్ 600 మీటర్లు, హరి లంగ్ జంప్ లో రజతం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్,పి ఈ డి, జ్యోతి, పిఇటి అరుణ విద్యార్థులను అభినందించారు.



# కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ వైద్యశాల

### 3.14 కోట్లతో సిటిస్కాన్ ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడుకోట్ల 14 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన సిటి స్కాన్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 26 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి విస్తరణలో భాగంగా జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. పేదలకు మైరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగెట్ చింత కుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యానారాయణ, డిసిహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరధ, కమిషనర్ రమాదేవి, వైద్యులు అభిరామ్, వైష్ణవి, నర్సింహా పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగం

ప్రజాపక్షం/మునగాల: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పనుల జాతర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధులను మెరుగుపర్చడానికి ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున పనుల జాతర కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిఆదరులకు పథకాలు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రూ.80 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటి సిఈవో శీరిష, డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి, కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, ఎంపిడివో రమేష్ దీన్ దయాల్ పాల్గొన్నారు.



## నేర నియంత్రణకు కృషి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ని జిల్లా ఎస్‌పి ఆకస్మిత తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు, పోలీస్ స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిసరాలు, స్థితిగతుల వివరాల గురించి సిఐ రాజశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాక్ అప్, ఎస్‌హెచ్‌ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, సిబ్బందికి కేటాయించిన కిట్లను తనిఖీ చేయడం జరిగింది. అనంతరం, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ క్రైమ్ రికార్డ్, జనరల్ రికార్డ్స్ లు తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధిత ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా, వారి పట్ల తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తీర్చాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, పిడియస్ రైస్ అక్రమ రవాణా,జూదం లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి, గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి, కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌పి మౌనిక, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, ఎస్‌బి సిఐ రాము, ఎస్ఐలు గోపాల్ రావు, సైదులు, సతీష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధి మెరుగుకు కృషి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



ప్రజాపక్షం/చివ్వెంల: గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధులను మెరుగుపర్చేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. ప్రజలకు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెల్లో ప్రగతి కార్యక్రమంలో భాగంగా చివ్వెంల మండల కేంద్రంలో పనుల జాతర ప్రారంభించి మాట్లాడారు. 2వ వార్డులో వడ్డేపల్లి రాములు అనే లబ్ధిదారుడు సుమారు 78500 రూపాయల వ్యయంతో నిర్మించుకున్న పశువుల పాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడు వడ్డేపల్లి రాములుతో మాట్లాడుతూ పశువుల పాక నిర్మించుకునేందుకు ఎంత ఖర్చు అయిందని, ఎన్ని రోజులు పట్టిందని, పశువులు ఎన్ని ఉన్నాయని, పాలు ఎక్కడ అమ్ముతున్నారని , ఎంత ధర వస్తుందని తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తనకు మూడు పాడి అవులు ఉన్నాయని, ప్రతిరోజు ఉదయం 6 లీటర్లు, సాయంత్రం 6 లీటర్లు పాలు ఇస్తున్నాయని, లీటర్ 80 రూపాయల చొప్పుల విక్రయిస్తున్నానని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టనున్న వాననీటి సంరక్షణ కట్టడం పనులను ప్రారంభించారు. వారంలోపు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో వివి అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, తహసిల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉపాధి హామీ ఎపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలి: జిల్లా కలెక్టర్**

విద్యార్థులు బాగా చదివి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ కోరారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భవిత కేంద్రం, తహసిల్దార్ కార్యాలయ, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, సెప్టెంబర్ 1వ తేదీ నుండి అదనపు తరగతులు నిర్వహించాలని, విద్యార్థులు మంచిగా చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం భవిత కేంద్రం సందర్శించి సైగలతో అంకెలు, క లర్స్ మ్యాచింగ్ లను విద్యార్థులో చేపించారు. అనంతరం సోని అనే లబ్ధిదారు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వారికి ఇసుక ఉచితంగా అందజేయాలని తహసిల్దార్‌ని అదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి, స్టాఫ్ హాజరు రిజిస్టర్, ఎఎన్‌సి రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈనెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని డాక్టర్ భవానిని అడిగారు. ఈడిడి క్యాలెండర్‌ను పిహెచ్‌సిలో అందరికి కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, మెడికల్ అధికారి భవాని, ఆయూష్ డాక్టర్ పార్ధసారధి, ప్రధానోపాధ్యాయురాలు కళారాణి, భవిత కేంద్రం ఇన్‌ఛార్జి పద్మ, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెగా హెల్త్ చెకప్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మెగా హెల్త్ చెకప్ కళాశాల నాలుగు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ నల్లగొండ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మ గాంధీ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదువుకునే విద్యార్థులు అందరూ పేద మధ్యతరగతి విద్యార్థులకు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించటం ఎంతో అభినందనీయమని తెలిపారు. విద్యార్థినిలకు బ్లడ్ పర్సంటేజ్, షుగర్ బిపి, లిపిడ్ ప్రొఫైల్, యూరిక్ యాసిడ్ లాంటి అత్యంత విలువైన పరీక్షలు నిర్వహించినందుకు పానగల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ నసేహ తబస్సుమ్, ఏఎన్ఎంలు ఎన్ శిరీష, టి మంజుల, గౌతమి, మెడికల్ టీం ని ప్రత్యేకంగా అభినందించారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చైతన్య సుధ, డాక్టర్ వసంత, పుష్పలత, దయానంద్, అధ్యాపకులు మంజుల, డాక్టర్ సుంకరి రాజారామ్, డాక్టర్ రవి, నవిలా, భాగ్యలక్ష్మి, శ్వేత, కళాశాల బోధనేతర సిబ్బంది జ్యోతి పాల్గొన్నారు.



# లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతోందా?

### రివ్యూలు, ప్రకటనలకే పరిమితం అవుతున్న పోలీసులు

### భయాందోళనలో 'సూర్యాపేట' ప్రజలు

**సూర్యాపేట జిల్లా కేంద్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతోందా... అంటే ప్రజలు ఔననే చెబుతున్నారు. ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ప్రజల మానప్రాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల పరిరక్షణ కోసం పాటుపడాల్సిన పోలీసులు కేవలం రివ్యూలు, ప్రకటనలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా నేరాలు, ఘోరాలు పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.**

ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడులేని విధంగా దోపిడీలు, హత్యయత్నాలు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయి. గత రెండునెలల క్రితం జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్న ఓ వ్యక్తిని హత్య చేసేందుకు కొంతమంది దుండగులు మరణాయుదాలతో కారులో అనుమానస్పదంగా తిరుగుతుండటంతో వారి కదలికలను పసిగట్టిన ప్రజలు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించి పట్టించిన విషయం అందరికి తెలిసిందే. ఇది మరువక ముందే శుక్రవారం ఖమ్మం రోడ్డులో బైకుపై వెళ్తున్న ఒక మగ, ఇద్దరు ఆడ వారిని హత్య చేసేందుకు కారులో కొంతమంది దుండగులు వెంటాడుతుండగా వారినుండి తప్పించుకునేందుకు రోడ్డు పక్కన ఉన్న ఓ వైన్స్‌షాపులోకి వెళ్లేందుకు బైకును రోడ్డు పైనే పడేసి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అందులోకి పరుగు తీశారు. వెనుక నుండి కారులో వెంబడించిన దుండగులు కర్రలు, ఇతర మరణాయుధాలతో వారు దాక్కున్న వైన్స్ షాపులోకి వెళ్లగా అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా బయటకు రావడంతో తిరిగి వెళ్లిపోయారు. ఈదృశ్యాలన్నీ సిసి కెమోరాలు రికార్డు కావడంతో సోషల్ మీడియాలో కొందరు పోస్టు చేయడంతో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల సూర్యాపేట చరిత్రలోనే అతిపెద్ద దోపిడీ జరిగింది. అంతరాష్ట్ర దొంగలు పట్టణ నడిబొడ్డున ఉన్న ఓ బంగారు దుకాణానికి కన్నం వేసి 8 కిలోల బంగారాన్ని దోచుకెళ్లారు. సదరు వ్యాపారి 8కిలోల బంగారం చోరీకి గురైనట్లు మీడియాముందు చెబితే పోలీసులు మాత్రం కేవలం మూడుకిలోల మాత్రమే పోయినట్లు వెల్లడించారు. సొమ్ము పోగొట్టుకున్న వ్యాపారి, పోలీసులు చెప్పిన దానిలో ఎలాంటి పొంతన లేకుండా ఉండటంతో మీడియా కూడా రోజుకో రకంగా వార్తా కథనాలను ప్రచురితం కావడంతో ప్రజల్లో చర్చకు దారితీసింది. ఇది ఇలా ఉంటే గంజాయిని అరికడుతున్నామని చెబుతూ కిలోల కొద్ది గంజాయి జాతీయరహదారి వెంట తరలిస్తున్న వారిని పట్టుకుంటున్న పోలీసులు జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి తాగి కొంతమంది రోడ్లపై చేస్తున్న అగడాలు అన్ని ఇన్ని కావు, వీటిని అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. కొత్త బస్టాండ్, ఖమ్మం ఎక్స్‌రోడ్డు, నూతన వ్యవసాయ మార్కెట్ రోడ్డులో గంజాయి బ్యాచ్ అగడాలు రోజు రోజుకు సృతిమించుతున్నాయి. వీరి అగడాలు అడ్డుకున్నవారిపై దాడులకు తెగబడి వీరంగం సృష్టిస్తున్నారు. రహదారులపై పార్కింగ్ చేసిన వాహనాలపై రాళ్లతో దాడిచేసి ధ్వంసం చేస్తున్న పరిస్థితి. గత పదిహేను రోజుల క్రితం విద్యానగర్‌కు చెందిన ఓ మాజీ కౌన్సిలర్, వస్త్ర వ్యాపారి కుమారుడి ఇంట్లో ఉండగా ఓ గంజాయి బ్యాచ్ అతన్ని బయటకు ఈడ్చుకొచ్చి రోడ్డుపై విచక్షణ రహితంగా దాడి చేశారు. అక్కడ ఉన్న చుట్టుపక్కల వారంతా ప్రతిఘటించడంతో వారు అక్కడ నుండి పరారి అయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంఘటనలు కోకొల్లలు...

పోలీస్ అధికారులు రివ్యూలు, ప్రకటనలకే పరిమితం కావడంతో నేరాలు, ఘోరాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్టేషన్‌లకే పరిమితమై ఏసిల కింద కూర్చోని సివిల్ వివాదాల్లో తలమునకలు అవుతున్నారే తప్ప, బయట ఏమీ జరుగుతుందనేది తెలుసుకునేందుకు కూడా కనీస ప్రయత్నం చేయడంలేదని చర్చ ప్రజల్లో సాగుతోంది. కొంతమంది అధికారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగించుకుంటున్నారు. గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాత్రి వేళలో గస్తీ నిర్వహించేందుకు అధికారులు బిట్లుగా విభజించి బిట్‌కు ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డును నియామకం చేశారు. వీరు రాత్రి వేళలో పొద్దుపోయేంత వరకూ గస్తీ నిర్వహించేవారు నేడు ఆ గస్తీ కొరవడిందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. దీంతో నేరాలు, ఘోరాలు పెరిగాయని అదే శాఖలో పనిచేస్తున్న కొందరు పోలీసులు చెప్పకనే చెబుతున్నారు. నేరాలు, ఘోరాలు దీంతో ప్రజలు తీవ్ర ఆందోళకు గురవుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ ఏ ఘోరం జరుగుతుందోనని ఇంట్లోనుండి రోడ్డుమీద కాలుమోపినప్పటి నుండి భయం భయంగానే బయటకు వెళ్తూ తమ పనులను చక్క పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి లాఅండ్ ఆర్డర్‌ను అదుపులో పెట్టి తమ మాన ప్రాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.




## దొంగ అరెస్ట్



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మండల పరిధిలోని కొర్రతండాలో గత వారం కొర్రపట్టి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి దొంగతనం చేసి ఒక కేజి వెండి ఆభరణాలు, రూ. లక్ష 50వేల నగదు, ఒక సెల్ ఫోన్ దొంగిలించాడు. బాధితురాలు కొర్రపట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా అదే తండాలో అనుమానాస్పదంగా ఉన్న కేతావత్ బద్యను విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. నిందితుడు బద్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తక్కువ సమయంలో కేసును చేధించినందుకు సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్‌లను ఎస్పి శరత్ చంద్ర పవార్ అభినందించి, నగదు రివార్డులను అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నానో యూరియాతో అధిక లాభాలు

ప్రజాపక్షం/డిండి; నానో యూరియా వినియోగం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, నానో యూరియా ద్రవ రూపంలో చిన్న డబ్బాలో లభిస్తుందని నిల్వతో పాటు రవాణా సులభ తరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి రెహానా అన్నారు. శుక్రవారం రైతులతో మాట్లాడుతూ నానో యూరియా వల్ల పంటలకు అవసరమైన నత్రజని సమృద్ధిగా లభిస్తుందని, పంట దిగుబడి, నాణ్యతను సాంప్రదాయ యూరియా బస్తా రూ. 266 కాగా, రూ. 225లకు వచ్చే నానో యూరియా అర లీటర్ డబ్బాతో ఎకరా పొలానిక సరిపోతుందని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు అందించే నానో యూరియా పర్యావరణానికి మేలు చేస్తుందని రైతులు నానో యూరియా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయితేజ, సీఈవో బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాష్ట్రపతితో శుభాన్షు శుక్లా



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో వ్యోమగామి శుభాన్షు శుక్లా కలిశారు. అంతరిక్షంలో తన అనుభవాలను పంచుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు ప్రయాణించిన తొలి భారతీయ వ్యోమగామి శుక్లా. ఆక్సియం మిషన్–4లో భాగంగా 20 రోజుల అంతరిక్ష పర్యటన తర్వాత ఆయన, ఇతర తోటి వ్యోమగాములతో కలిసి గత నెలలో భూమికి తిరిగి వచ్చారు. ఇస్రో చైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్, హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్‌తో కలిసి గ్రూప్ కెప్టెన్ శుక్లా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ పుణ్యశ్లోక్ బిస్వాల్ ముర్మును కలిశారని రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపింది. అతను అంతరిక్షంలో తన అనుభవాలను రాష్ట్రపతితో పంచుకున్నాడని అది పేర్కొంది. భవిష్యత్ ప్రయత్నాల కోసం, ముఖ్యంగా గగన్‌యాన్ మిషన్ కోసం మొత్తం బృందానికి రాష్ట్రపతి తన శుభాకాంక్షలు తెలిపినట్లు వెల్లడించింది.

### ఆధార్ సహా, నిర్దేశిత డాక్యుమెంట్‌తో
# దరఖాస్తుకు 'సుప్రీం' అనుమతి

బిహార్‌లో తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చుకోవాలని సుప్రీం సూచన

సెప్టెంబర్ 8నాటికి 'స్టేటస్ రిపోర్టు' దాఖలు చేయాలని పార్టీలకు సూచన



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా జారీలో తొలగించబడిన ఓటర్లు వారి క్లెయిమ్‌లను భౌతికంగా, ఆన్‌లైన్ మోడ్ ద్వారా సమర్పించడానికి అనుమతించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని (ఈసి)ని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్ మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై విచారణ చేపట్టింది. ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ మినహాయించిన పేర్ల విషయంలో ఆధార్‌కార్డు లేదా ఎస్ఐఆర్‌లో అంగీకరించిన 11 డాక్యుమెంట్లలో ఏదో ఒకదానిని సమర్పించి, పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ, పేరును తిరిగి చేర్చాలనే దరఖాస్తును ఇవ్వాలని సూచించింది. తొలగించిన 65లక్షల ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలను దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రాకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. వారిని కోర్టు ప్రొసీడింగ్స్‌లో చేర్చాలని బిహార్ ప్రధాన ఎన్నికల అధికారిని సుప్రీంకోర్టు ఆదేశించింది. మినహాయించబడిన ఓటర్లు దాఖలు చేయడానికి వారు సులభతరం చేసిన క్లెయిమ్ ఫారమ్‌పై తదుపరి విచారణ తేదీ నాటికి అన్ని రాజకీయ పార్టీలు వారి స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేయాలని సూచిస్తూ ధర్మాసనం కేసు విచారణను సెప్టెంబరు 8కి వాయిదా వేసింది. తొలగించబడిన ఓటర్ల క్లెయిమ్ ఫారాలను భౌతికంగా సమర్పించే రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు అక్నాలెడ్జ్‌మెంట్ రశీదును అందించాలని ధర్మాసనం ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘానికి (ఈసిఐ) ఎలాంటి మినహాయింపులేదని చూపించడానికి ఒక 15రోజుల గడువు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. 'రాజకీయ పార్టీలు పెద్ద యెత్తున గొడవలు చేస్తున్నాయి. పరిస్థితులు ఏమీ బాగాలేవు. మాపై నమ్మకం ఉంచి మాకు మరి కొంత సమయం ఇవ్వండి. ఎటువంటి మినహాయింపులు లేవని మేం మీకు నిరూపిస్తాం' అని న్యాయవాది రాకేశ్ ద్వివేదీ అన్నారు. బిహార్ రాష్ట్రంలోని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కింద ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 2 లక్షల మంది ఓటర్లు ముందుకు వచ్చారని, ముసాయిదా (డ్రాఫ్ట్)జాబితాలో మినహాయించబడిన దాదాపు 85,000 మంది ఓటర్లు తమ వాదనలు సమర్పించాలని ఎన్నికల సంఘం ధర్మాసనానికి నివేదించింది. ఎన్నికల సమయంలో 'పారదర్శకత'ను పెంచడానికి బిహార్‌లో డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించబడిన 65లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19నాటికి సమర్పించాలని సుప్రీంకోర్టు ఆగస్టు 14న ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ, ఐడెంటిటీ ప్రూఫ్ కోసం ఆధార్‌ను ఆమోదయోగ్యమైన డాక్యుమెంట్‌గా అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. 'కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో వాటిని చేర్చకపోవడానికి గల కారణాలను సైతం వివరాలలో చేర్చాలని ఆదేశించింది. 'పారదర్శకత ఓటరు విశ్వాసాన్ని సృష్టిస్తుంది' అని హితవు పలికింది.

# టీకాలు వేసిన తరువాతే విడిచిపెట్టండి

వీధికుక్కలపై ఉత్తర్వులు సవరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** వీధి కుక్కల అంశంలో సుప్రీంకోర్టుతన గత తీర్పును సవరించింది. వీధి కుక్కలను స్టెరిలైజ్ చేసి, వాటిని రిలీజ్ చేయాలని శుక్రవారం అత్యున్నత న్యాయ స్థానం తన తాజా తీర్పులో ఆదేశించింది. ఢిల్లీలో ఎక్కడ నుంచి తీసుకెళ్లిన కుక్కలను, స్టెరిలైజ్ చేసిన తర్వాత వాటిని అక్కడే వదిలేయాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. వీధి కుక్కలను ఉంచేందుకు శాశ్వత షెల్టర్ జోన్లను ఏర్పాటు చేయాలని ఇటీవలే ఇచ్చిన ఆదేశాల్లో ఈమేరకు సుప్రీంకోర్టు కీలక మార్పులు చేసింది. అయితే ప్రజలను కరిచే స్వభా వం కలిగిన, రేబిస్ వ్యాధిగ్రస్థ కుక్కలకు వ్యాక్సినేషన్ చేసి, షెల్టర్ జోన్లలోనే ఉంచాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాలను సమీక్షించి ఈమేరకు కొత్త ఆర్డర్స్‌ను జారీ చేసింది. 'వీధి కుక్కలను షెల్టర్ జోన్ల నుంచి విడుదల చేసే ముందు వాటికి బర్త్ కంట్రోల్ ఆపరేషన్‌తో పాటు వ్యాక్సినేషన్ చేయించాలి. నులి పురుగుల నివారణ మందులు వేయాలి. ఆ తర్వాత వాటిని ఎక్కడైతే పట్టారో, అదే ఏరియాకు తీసుకెళ్లి వదిలేయాలి. ఈ అంశాలను మున్సిపల్ అధికార వర్గాలు తప్పక పాటించాలి' అని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశించారు. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో వీధి కుక్కలకు రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ ప్రజలు ఆహారాన్ని అందించడానికి అస్సలు అనుమతించేది లేదన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలకు ఆహారాన్ని అందించేందుకు మున్సిపల్ వార్డుల పరిధిలో ఎక్కడికక్కడ ప్రత్యేక ఫీడింగ్ ఏరియాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. వార్డుల పరిధిలో ఉండే వీధి కుక్కల సంఖ్య ఆధారంగా ఎన్ని ఫీడింగ్ ఏరియాలను ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయాన్ని తీసుకోవాలని సూచించింది. 'ఇక్కడ మాత్రమే వీధి కుక్కలకు ఆహారాన్ని అందించాలి' అనే సందేశంతో ఆయా ఫీడింగ్ ఏరియాల్లో నోటీసు బోర్డులను ఏర్పాటు చేయించాలని నిర్దేశించింది. ఈ అంశంపై స్పష్టమైన జాతీయ విధానానికి దిశా నిర్దేశం చేసేందుకుగానూ దేశవ్యాప్తంగా వీధి కుక్కలకు సంబంధించి నమోదైన పిటిషన్లన్నీ సుప్రీంకోర్టుకే బదిలీ చేయాలని ధర్మాసనం కోరింది.

**ఆగస్టు 11 ఆదేశాలను 'సుప్రీం' ఎందుకు మార్చింది ?**

వీధి కుక్కలు దడ పుట్టిస్తున్నాయి. 2024 సంవత్సరంలో ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో ఏకంగా 37 లక్షల కుక్కకాటు ఘటనలు చోటుచేసుకున్నాయి. 54 మంది రేబిస్‌తో చనిపోవడానికి కుక్కలు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలోని నగరాలు, పట్టణాల్లో వీధి కుక్కల కోసం 5వేలు చొప్పున శాశ్వత షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఆగస్టు 11న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. 8 వారాల్లోగా వీధి కుక్కలను ఆయా షెల్టర్లలోకి తరలించాలని నిర్దేశించింది. ఈ ఆదేశాలిచ్చిన ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ జెబి పర్దీవాలా, ఆర్ మహదేవన్ ఉన్నారు. అయితే ఈ ఆర్డర్స్‌పై జంతు ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రముఖ సామాజిక కార్యకర్తలు, సెలబ్రిటీలు కూడా ఈ ఆదేశాలను బహిరంగంగా విమర్శించారు. వీధి కుక్కలను షెల్టర్లలో బంధించి ఉంచడం సరికాదన్నారు. మరోవైపు ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలోని స్థానిక సంస్థల ఉన్నతాధికారులు కూడా ఈనెల 11 ఆదేశాలతో షాక్‌కు గురయ్యాయి. షెల్టర్ జోన్‌ల ఏర్పాటు కానీ, వాటిలో లక్షలాది వీధి కుక్కలను పోషించేందుకు కానీ తమ వద్ద తగినన్ని నిధులు లేవని చెప్పసాగారు. ఈనేపథ్యంలో స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బిఆర్ గవాయ్ ఈనెల 11న జారీ అయిన ఆదేశాలను సమీక్షించమని మరో ధర్మాసనానికి సూచించారు. ఈ ధర్మాసనంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియా ఉన్నారు. వీరు ఈ వారం ఆరంభంలోనే 11 ఆదేశాల అమలును నిలిపివేశారు. నాటి ఆదేశాల్లో కీలక మార్పులు చేసి, తాజాగా శుక్రవారం రోజు ఆర్డర్స్‌ను జారీ చేశారు.

## బిహార్ ఎస్ఐఆర్ విషయంలో 'సుప్రీం' ఆదేశాన్ని .. 'స్వాగతించిన' కాంగ్రెస్

ఇసి క్రూరదాడి నుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని జైరామ్ రమేష్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** బిహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) విషయమై సుప్రీంకోర్టు ఆదేశాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. భారత ఎన్నికల సంఘం క్రూరమైన దాడి నుండి ప్రజాస్వామ్యం బయటపడిందని కాంగ్రెస్ సంతృప్తిని వ్యక్తంచేసింది. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిజస్వరూపం 'బహిర్గతమైందని', 'పూర్తిగా అపఖ్యాతి పాలైంది' అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలను చేర్చడం ద్వారా సవరణను మరింత కలుపుకుని పోయేలా చేయడానికి సుప్రీంకోర్టు రక్షణ కల్పించిందని, భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) విధానం ఓటర్ల ప్రయోజనాలకు ఆటంకం కలిగించేదిగా, విరుద్ధంగా ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది.ఎన్నికలు జరుగనున్న బిహార్ ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ కసరత్తులో తొలగించబడిన ఓటర్లు భౌతిక సమర్పణలు చేయడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా క్లెయిమ్‌లు సమర్పించేందుకు సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది.న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బిహార్‌లో తొలగించబడిన ఓటర్లు తిరిగి వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని అభ్యర్థిస్తూ ఆధార్ కార్డుతో, సూచించిన 11డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పిస్తూ అభ్యర్థన దరఖాస్తు చేసేందుకు అనుమతించింది. ఈమేరకు శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. 65లక్షల ఓటర్లను తొలగించడానికి సంబంధించి అభ్యంతరాలను దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రాకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కోర్టు ప్రొసీడింగ్స్‌లలో వారిని చేర్చాలని బిహార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ బిహార్ ఎస్ఐఆర్ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాన్ని స్వాగతిస్తూ 'ఎక్స్' లో పోస్టింగ్ పెట్టారు. భారత ఎన్నిక ల సంఘం క్రూరమైన దాడినుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో ఓటర్ల పేర్లు తొలగింపులకు గల కారణాలను వివరిస్తూ తొలగించబడిన వారి జాబితాను ప్రచురించాలని సుప్రీంకోర్టు మార్గనిర్దేశకం చేయడాన్ని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

## రాధాకృష్ణకు మద్దతు ఇవ్వలేం

'మహా' సిఎం ఫడ్నవీస్‌కు తేల్చి చెప్పిన శరద్ పవార్

**ముంబయి :** ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కు మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనకు ఫోన్ చేశారని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ చెప్పారు. అయితే తాను అసమర్థతను వ్యక్తం చేశానన్నారు. శుక్రవారం పవార్ ముంబయిలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారని, ఎన్‌డిఎ కంటే తమకు తక్కువ బలం ఉన్నప్పటికీ తామేమీ ఆందోళన చెందడం లేదన్నారు. ప్రతిపక్షాలు సుదర్శన్‌రెడ్డిని తమ అభ్యర్థిగా నిలబెట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించాయని పవార్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఓట్లన్నీ సుదర్శన్‌రెడ్డికే వెళ్తాయన్నారు. తమకు తమ బలం తెలుసునని, అందువల్ల ఎటువంటి ఆశ్చర్యాలను ఆశించడం లేదని స్పష్టం చేశారు.

## జైలులో ఉండి పరిపాలనా?

30 రోజులు జైలులో ఉంచితే వారిని తొలగించే చట్టాన్ని తీసుకువస్తున్నాం : ప్రధాని మోదీ



**గయాజీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఇండియా కూటమి నేతలు ఉన్నత స్థాయిలలో అవినీతిని నిర్మూలించడానికి, చొరబాటుదారుల నుండి దేశ జనాభాకు ఎదురయ్యే ముప్పును పరిష్కరించడానికి తీసుకున్న చర్యలను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025, ప్రస్తుతం బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాలను గయాజీలో శుక్రవారం జరిగిన ర్యాలీలో ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. అధికారంలో ఉన్న వ్యక్తులు జైలు నుండి ప్రభుత్వాలను నడుపుతుండడం, కటకటాల వెనుక నుండి ఫైళ్లపై సంతకం చేస్తుండడం వంటి రాజ్యాంగ మర్యాదలను దెబ్బతీసే విచారకరమైన పరిస్థితిని చూశామని పరోక్షంగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. తన 11 ఏళ్ల ప్రభుత్వంలో అవినీతి మరకలు లేవని గర్వంగా చెప్పుకుంటున్నారు. గత కాంగ్రెస్ పాలనలలో అనేక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయని, బిహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు అవినీతి ఏ మేరకు జరిగిందో వీధిలో ఉన్న వ్యక్తికి కూడా తెలుసునని ఆర్‌జెడిని విమర్శించారు. అందువల్ల అవినీతిపరుడైన ముఖ్యమంత్రిని లేదా ప్రధానమంత్రిని 30 రోజులు జైలులో ఉంచితే వారిని తొలగించే చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. తక్కువ కాలం జైలు శిక్ష అనుభవిస్తేనే గుమస్తా స్థాయి వ్యక్తిని కూడా సస్పెండ్ చేస్తారన్నారు. అయితే తాము కఠినమైన చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు, ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయని, వారు చేసిన పాపాలకు శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడుతున్నారని మోదీ ఆరోపించారు. కాగా, దేశం మరో ముప్పును ఎదుర్కొంటోందన్నారు. చొరబాటుదారుల వల్ల దేశానికి తీవ్ర ముప్పు ఉందని, ఈ విషయాన్ని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా ప్రస్తావించానన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడిలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ చొరబాటుదారులను రక్షించాలని కోరుకుంటున్నాయని మోదీ ఆరోపించారు. బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ నుండి అక్రమ వలసదారులను ఓటర్ల జాబితా నుండి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని మోదీ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారత రక్షణ విధానంలో కొత్త రేఖను గీసిందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ ఏ ప్రత్యర్థిని శిక్షించకుండా వదిలిపెట్టబోదని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని విడిచిపెట్టబోదని బలమైన సందేశాన్ని పంపిందన్నారు. పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినా, భారత్ ఎటువంటి హాని చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గయాజీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోంది. ఒకేరోజులో రూ.13,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించాం. వీటిలో ఎనర్జీ, అభివృద్ధి, ఆరోగ్యానికి సంబంధించిన అనేక ప్రధాన ప్రాజెక్టులు ఉన్నాయి. ఇది బిహార్ పరిశ్రమలకు ఊతమిస్తుంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. బిహార్ లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల కోసం ఒక ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం ప్రారంభించాం. ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు క్యాన్సర్ చికిత్స కోసం మరో సౌకర్యం లభించింది' అని మోదీ స్పష్టం చేశారు.

## పార్లమెంట్‌లో భద్రత ఉల్లంఘన

గోడ దూకిన వ్యక్తి.. పట్టుకున్న భద్రతా సిబ్బంది

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన ఘటన జరిగింది. 20 ఏళ్ల వ్యక్తి పార్లమెంటు గోడను దూకడానికి ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని భదోహికి చెందిన రామ్ కుమార్ బింద్ అనే వ్యక్తి గుజరాత్‌లోని సూరత్‌లోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని, అతని మానసిక స్థితి సరిగా లేనట్లు ఉన్నదని పోలీసులు తెలిపారు. 'శుక్రవారం ఉదయం 5.50 గంటల ప్రాంతంలో, ఒక గుర్తు తెలియని వ్యక్తి పార్లమెంట్ భవన సముదాయం వద్దకు చేరుకుని లోపలికి దూకాలనే ఉద్దేశ్యంతో ప్రహరీ గోడను ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే, సిఐఎస్ఎఫ్, ఢిల్లీ పోలీసు సిబ్బంది అప్రమత్తత కారణంగా అతన్ని పట్టుకుని తదుపరి విచారణ కోసం స్థానిక పోలీసులకు అప్పగించారు' అని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా సరిగా లేనట్లుగా కనిపిస్తున్నాడని, మరింత విచారణ, ధృవీకరణ పురోగతిలో ఉందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (న్యూఢిల్లీ) దేవేష్ మహ్లా తెలిపారు. ఆ వ్యక్తి సరిహద్దు గోడకు ఆనుకుని ఉన్న చెట్టు ఎక్కడం ద్వారా అతను పార్లమెంటులోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడని వర్గాలు తెలిపాయి. ఇంటెలిజెన్స్‌బ్యూరో (ఐబి), ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగంతో సహా అనేక కేంద్ర సంస్థలు ఆ వ్యక్తిని ప్రశ్నిస్తున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఘటన డిసెంబర్ 13, 2023న జరిగిన సంఘటనను గుర్తుకు తెస్తుంది. ఇద్దరు వ్యక్తులు సందర్శకుల గ్యాలరీ నుండి లోక్‌సభ గదిలోకి ఎక్కి పసుపు రంగు పొగ డబ్బాలను విడిచిపెట్టగా, మరో ఇద్దరు బయట ఇలాంటి చర్యకు పాల్పడ్డారు. 2001లో పార్లమెంటుపై జరిగిన ఉగ్రవాద దాడి వార్షికోత్సవంతో ఇది సమానంగా జరిగింది. తీవ్రమైన భద్రతా ప్రశ్నలను లేవనెత్తింది.

## అక్రమ బెట్టింగ్ కేసులో కర్నాటక ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఇడి సోదాలు

**బెంగళూరు :** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.సి. వీరేంద్ర 'పప్పీ', ఆయన సోదరుడు, మరికొందరిపై అక్రమ బెట్టింగ్‌తో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం పలు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. 50 ఏళ్ల వీరేంద్ర చిత్రదుర్గ అసెంబ్లీ స్థానానికి చెందిన శాసనసభ్యుడు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల చివరి రోజున జరిగిన ఇడి చర్యపై ఎమ్మెల్యే ఇంకా స్పందించలేదు. చిత్రదుర్గ జిల్లా, బెంగళూరు, కర్ణాటకలోని హుబ్బళ్లి, జోధ్‌పూర్ (రాజస్థాన్), ముంబయి, గోవాలోని కనీసం 30 ప్రదేశాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) నిబంధనల పరిధిలోకి వచ్చాయని వర్గాలు తెలిపాయి. గోవాలోని పప్పీస్ క్యాసినో గోల్డ్, ఓషన్ రివర్స్ క్యాసినో, పప్పీస్ క్యాసినో ప్రైడ్, ఓషన్ 7 క్యాసినో, బిగ్ డాడీ క్యాసినో అనే పేర్లతో కూడిన ఐదు క్యాసినోలపై కూడా దాడులు జరిగాయని వారు తెలిపారు. అక్రమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన కేసులో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఇడి వర్గాలు తెలిపాయి. వీరేంద్రపై కింగ్ 567, రాజా 567, పప్పీస్ 003, రత్నా గేమింగ్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్‌లను నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, అతని సోదరుడు కెసి తిప్పేస్వామిపై డైమాండ్ సాఫ్టెక్, టిఆర్ఎస్ టెక్నాలజీస్, ప్రైమ్ 9 టెక్నాలజీస్ అనే మూడు వ్యాపార సంస్థలు దుబాయ్ నుండి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ సంస్థలు కాల్ సెంటర్ సేవలు, వీరేంద్ర గేమింగ్ వ్యాపారానికి సంబంధితమైనవన్నారు. బెంగళూరులోని కుసుమ సోదరుడు (కాంగ్రెస్ టికెట్‌పై రాజరాజేశ్వరినగర్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి విఫలమైన) అనిల్ గౌడ అనే వ్యక్తి ప్రాంగణంలో కూడా సోదాలు చేసినట్లు ఏజెన్సీ వర్గాలు తెలిపాయి.

# బిజెపి పాలిత రాష్ట్రాల్లో పదేళ్లలో 20 తొక్కిసలాటలు..

అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఫైర్

**బెంగళూరు :** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సిబి విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది. కర్ణాటక సర్కారు వైఫల్యంవల్లే తొక్కిసలాట జరిగిందని నాటి నుంచి ఈ ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విమర్శలపై సిఎం సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీ వేదికగా స్పందించారు. గత పదేళ్లలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో 20 తొక్కిసలాట ఘటనలు జరిగాయని, వాటిపై ఆ పార్టీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2008లో హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట, అదే ఏడాది జోధ్‌పూర్ తొక్కిసలాట, 2021లో హరిద్వార్ తొక్కిసలాట, 2013లో రతన్‌గఢ్ తొక్కిసలాట, 2023లో మధ్యప్రదేశ్‌లో తొక్కిసలాట, 2024 హాత్రాస్‌లో తొక్కిసలాట ఘటనలు జరిగాయని, ఆ ఘటనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు బిజెపి నేతలు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 39 మంది ప్రాణాలు కోల్పోతే ఆ రాష్ట్ర ప్రభుత్వం మృతుల వివరాలు కూడా వెల్లడించలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. 2022లో గుజరాత్ మోర్బి వంతెన కూలి 135 మంది మరణించిన ఘటన గురించి కూడా సిఎం మాట్లాడారు. 'ఆర్‌సిబి తొలిసారి ఐపిఎల్ టైటిల్ గెలువడంతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాలకు అభిమానులు భారీ సంఖ్యలో హాజరుకావడంతో తొక్కిసలాట జరిగింది. తన 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని, తొక్కిసలాటలో 11 మంది చనిపోవడం ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ ఘటనపై తనకు తీవ్ర కలిగిందని, ఘటన రోజే తన బాధను వ్యక్తం చేశానని చెప్పారు. ఒక్కోసారి ప్రజల అభీష్టానికి తలవంచాల్సి వస్తుంది. అదే ప్రజాస్వామ్యానికి సంకేతమని' సిద్ధరామయ్య అన్నారు. ఆర్‌సిబి విజయోత్సవ వేడుకకు హాజరుకావాల్సి వచ్చిందని ఆయన అన్నారు. కాగా ఈ ఏడాది జూన్‌లో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఘటనపై దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆర్‌సిబి విజయోత్సవ ఈవెంట్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం ఉన్నట్లు గుర్తించింది. స్టేడియం లోపల కేవలం 79 మంది పోలీసులను మాత్రమే మోహరించారని, ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు లేవని తెలిపింది. పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని నివేదికలో కమిషన్ పేర్కొంది.

## అసోం పోలీసుల అరెస్ట్ నుంచి... జర్నలిస్టులు సిద్దార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు 'రక్షణ'

'సుప్రీం' ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ :** తమకు వ్యతిరేకంగా 'వార్తా కథనం' రూపొందించారన్న అభియోగంపై అసోం పోలీసులచే ఎఫ్ఐఆర్ నమోదు చేయబడ్డ 'ది వైర్' వ్యవస్థాపక ఎడిటర్ సిద్దార్థ్ వరదరాజన్, కన్సల్టింగ్ ఎడిటర్ కరణ్ థాపర్‌ల అరెస్ట్ నుంచి శుక్రవారం సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ది వైర్ యాజమాన్యం వరదరాజన్‌తో పాటు 'ది ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం' (ఎఫ్ఐజె) దాఖలు చేసిన పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. బాధిత జర్నలిస్టుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిత్యా రామక్రిష్ణన్ తన వాదనలు వినిపిస్తూ అసోం పోలీసులు కోర్టు జారీచేసిన ఆదేశాలను కూడా దాటవేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. మోరీగాం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ నుంచి మధ్యంతర రక్షణను మంజూరు చేసినప్పటికీ దానిని ఏ మాత్రం ఖాతరు చేయని పోలీసులు గుహతి క్రైమ్ బ్రాంచ్ తరపున మరొక కేసును బనాయించి సమన్లు జారీచేశారని ఆమె వాదించారు. మే నెలలో నమోదు చేసిన పాత ఎఫ్ఐఆర్‌లో వాంగ్మూలాలను రికార్డు చేయడానికి శుక్రవారం వారిని పోలీసులు అరెస్ట్ చేయవచ్చని వారు ముందస్తుగానే భావించారని నిత్యా రామక్రిష్ణన్ బెంచ్‌కు నివేదించారు. మరిన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు కావచ్చని,అరెస్ట్ చేస్తామని వారిని బెదిరించవచ్చని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకురాగా, 'మేం గమనిస్తున్నాం' అని చెప్పిన ద్విసభ్య ధర్మాసనం ఆమె భయాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. ఈ సందర్భంగా ధర్మాసనం జర్నలిస్టులను రక్షిస్తూనే, అదే సమయంలో ప్రతీ ఒక్కరూ చట్టాన్ని పాటించాలనే భావనను కలిగి ఉండాలని హితవు చెప్పింది. తదుపరి విచారణ తేదీన దర్యాప్తులో చేరి ఒక స్టేటస్ రిపోర్టును దాఖలు చేయాలని బెంచ్ జర్నలిస్టులను కోరింది. ఆపరేషన్ సిందూర్‌పై వచ్చిన కథనంపై అతనిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన ధర్మాసనం ఆగస్టు 12న వరదరాజన్‌పై అసోం పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా సుప్రీం కోర్టు రక్షణ కల్పించింది. మే 9న గువహతి క్రైమ్ బ్రాంచ్ వరదరాజన్, కరణ్‌థాపర్‌లపై భారత న్యాయ సంహిత లోని 152 సెక్షన్ కింద (భారతదేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమాధికారాన్ని ప్రమాదంలో పడేసే చర్యలకు పాల్పడ్డారని) అభియోగం మోపుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. భారతదేశం సార్వభౌమాధికారం, సమగ్రతకు వ్యతిరేకంగా 14ఇంటర్వ్యూలను, కథనాలను ప్రస్తావిస్తూ పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఆగస్టు 12 వరకూ ఈ ఎఫ్ఐఆర్‌పై ఎలాంటి తదుపరి చర్యా తీసుకోలేదు. 'ది వైర్', ఇతరులపై జులై 11న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ద్వారా పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా అత్యున్నత న్యాయస్థానం బాధిత జర్నలిస్టులకు రక్షణ కల్పించింది. ఆ తర్వాత మే 9న దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి జర్నలిస్టులను క్రైమ్ బ్రాంచ్ సమన్లు జారీచేసింది. ఈ కేసులో శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం జర్నలిస్టులకు, ఒక న్యూస్ పోర్టల్‌కు కూడా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL**

**A.R.B. No. 161 OF 2025**

Between:

**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-2 Branch.**

......**Disputant**

AND

**Sri. Nadigoti Nagaraju and Others.**

........**Opponents**

To,

**OP No. 3:** Sri Shika Venkanna, S/o Rajaiah, Age: 50 Years, Occ: Polioce Constable, Karimnagar, R/o H.No. 5-6, Kothapalle, Mdl: Bheemadevarapalli, Dist: Hanumakonda. 505497. Present R/o. H.No. 6-6-639/A1, Ambedkarnagar, Karimnagar, Dist: Karimnagar. 505002.

**OP.No. 4:** Sri Singireddy Jagan Mohan Reddy, S/o Raji Reddy, Age: 35 Years, Occ: Veterinary Asst. in Area Veterinary Hospital Mulkanoor, Mdl: Bheemadevarapalli, R/o. H.No. 10-22, Vill: Lasmakkapalli, Mdl: Veenavanka, Dist: Karimnagar. 505502.

**OP.No. 5:** Smt Kodurupaka Sujatha, D/o Mallesh (W/o Sadhan), Age: 41 Years, Occ: Junior Asst. in ERO Bheemadevarapalli, R/o H.No. 8-80, Gollawada Temple Street, Mulkanoor, Mdl; Bheemadevarapalli, Dist: Hanumakonda. 505471.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **12-09-2025** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR – WARANGAL.**



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL**

**A.R.B. No. 180 OF 2025**

Between:

**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-1 Branch.**

......**Disputant**

AND

**Sri. Moku Ananad Reddy and Others.**

........**Opponents**

To,

**OP No. 1:** Sri Moku Anand Reddy, S/o Madhusudhan Reddy, Age: 45 Years, Occ: Asst. Labour Officer, Khammam-II Circle, R/o H.No. ---, Obul Keshawapur, Dist: Warangal. Permanent H.No. 9-1-109, Medical colony, Bhadrachalam, Dist: Bhadradri Kothagudem. 507111.

**OP No. 2:** Sri Pingili Ravinder Reddy, S/o SomaReddy, Age: 45 Years, Occ: Asst. Labour Officer, Kukatpally. R/o. H.No. 1-3-183/40/46/9, Sai Nagar, Kawadiguda, Hyderabad. Present R/o H.No. 2-4-617/2/A, Ramnagar, Opp: Montissory School, Hanamkonda, Dist: Hanumakonda. 506001

**OP No. 3:** Sri Jaruplavath Devender, S/o Devoji, Age: 42 Years, Occ: Asst. Section Officer , R/o H.No. 1-52, Redya Thanda, Mondal: Urkondapeta, Dist: Mahabubnagar, Present H.No. 2-2-185/90/3, Flot No. 201, Sai Krupa Apartment, R.K.Nagar, Bagh Ambarpet, Hyderabad. 500013

**OP No. 4:** Sri Kommu Kutumba Rao, S/o Venkaiah, Age: 55 Years, Occ: Asst. Labour Officer, Manuguru. R/o. H.No. 9-1-109, Medical Colony, Bhadrachalam, Dist: Bhadhradri Kothagudem. 507111

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **12-09-2025** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR – WARANGAL.**

ప్రజాపక్షం
శనివారం, 23 ఆగస్టు

## రష్యా–చైనా–భారత్ చేదోడువాదోడు

ఈ వారంలో దౌత్యాధికారుల రెండు పర్యటనలు భారత విదేశాంగ విధానంలో మార్పులకు అత్యంత ప్రాముఖ్యత గలవి. అవి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ పర్యటన, ఆ వెను వెంటనే భారత్ విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ మాస్కో పర్యటన. సుమారు 280 కోట్ల జనాభాకు ప్రతినిధులుగా ఉన్న ఆసియా ఖండంలో రెండు అతిపెద్ద దేశాలైన చైనా, భారత్ మధ్య సంబంధాల అభివృద్ధి ఆసియాకే కాదు ప్రపంచ సుస్థిరాభివృద్ధికి కూడా ప్రధానం. అయితే 2020 లో గాల్వాన్‌లో ఇరుదేశాల సైనికుల మధ్య కుమ్ములాటలో 20మంది భారత సైనికులు చనిపోయిన దుర్ఘటన సంబంధాల వృద్ధి దిశకు గండికొట్టింది. గత ఏడాది కజాన్‌లో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ముఖాముఖీ సంభాషణల తదుపరి వివాదాస్పద ప్రాంతాల నుంచి సైన్యాల ఉపసంహరణ క్రమం ఆరంభమైంది. కాబట్టి ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్య పరిష్కారం అన్నిటికన్నా ముఖ్యం. భారత్ వ్యూహాత్మక స్వతంత్రత అంటూనే అమెరికావైపు అతిగా మొగ్గటం, చైనాకు వ్యతిరేకంగా భారత్ ను తమ శిబిరంలో నిలబెట్టుకునేందుకు అమెరికా మిలటరీ వ్యూహాలకు భారత్ అవకాశమివ్వటం (ఉదా: క్వాడ్) ఇరుదేశాల మధ్య వైమనస్యం పెరుగుదలకు మరో ముఖ్యకారణం. భారత్ బహుళపక్ష వేదికలైన బ్రిక్స్‌లో, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ)లో రష్యా, చైనాలతో సహసభ్యురాలు. జి 20లో కూడా భాగస్వాములు. ఈ మూడు ప్రధాన దేశాల మధ్య మైత్రి, సహకారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏకధ్రువ ప్రపంచంకోసం అనగా ప్రపంచదేశాలపై తమ ఆధిపత్యంకోసం అమెరికా పేరాశలకు వ్యతిరేకంగా బహుళపక్ష అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టటానికీ, భూగోళ దక్షిణ ప్రాంతానికి అనగా పేద, వర్ధమాన దేశాల వాణిగా అంతర్జాతీయ వేదికలపై ఏకస్వరంతో ప్రభావవంతమైన పాత్ర పోషించటానికీ ఈ మూడు దేశాల మైత్రి కీలకం.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య సుంకాల బ్లాక్ మెయిల్ జమానా మాస్కో, బీజింగ్, న్యూఢిల్లీలను చేరువచేయటం గమనించదగ్గ విషయం. భారత్–పాకిస్థాన్ నాల్గురోజుల యుద్ధాన్ని తానే ఆపుచేశానని ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలు (భారత్ ఆలస్యంగానైనా నిరాకరించింది), పాకిస్థాన్ సైన్యాధిపతి ఆశిం మునీర్‌కు ఓవల్ ఆఫీసులో విందుఇవ్వటం, అతడు అమెరికానుంచే భారత్‌కు అణుబాంబు హెచ్చరిక చేయటం ట్రంప్–మోదీ వ్యక్తిగత మైత్రిని భగ్నం చేసింది. భారత్ నుంచి దిగుమతులపై 25 శాతం సుంకం విధించటం, అంతేగాక, రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకునే ఆయిలుపై మరో 25శాతం (ఈనెల 27నుంచి) సుంకం విధించటం భారత్ స్వాభిమానాన్ని దెబ్బతీసింది.

ఉక్రేన్–రష్యా యుద్ధం విషయంలో ఉక్రేన్‌కు యూరప్, అమెరికాల తోడ్పాటుకు వ్యతిరేకంగా రష్యా, చైనా మైత్రి పటిష్టమైంది. యూరప్ రష్యా ఆయిలుపై ఆంక్షలు విధించినప్పటికీ అది ఇస్తున్న డిస్కౌంట్ రేటుకు భారత్ పెద్ద ఎత్తున కొంటున్నది. ఇది సహించని ట్రంప్ భారత్‌పై కన్నెర్రజేసి బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. భారత్ బనానా రిపబ్లిక్ కాదు, అమెరికా బెదిరింపులకు లొంగటానికి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ ఢిల్లీలో మూడు రోజుల సంభాషణలు ప్రాధాన్యత వహించాయి. జైశంకర్, అజిత్ దోవల్, చివరగా ప్రధాని నరేంద్రమోదీతో సంభాషణలు జరిపారు. సరిహద్దు వెంట ప్రశాంతతను కాపాడుకోవటం, సరిహద్దు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని వేగవంతం చేయటం, వాణిజ్యం, పెట్టుబడుల అభివృద్ధి, ట్రంప్ బెదిరింపులు చర్చించారు. సానుకూల నిర్ణయాలకు వచ్చారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో చైనాలోని తియాన్‌జిన్‌లో జరిగే ఎస్‌సిఒ శిఖరాగ్ర సభకు ప్రధాని మోదీకి జిన్‌పింగ్ ఆహ్వానం అందజేశారు. ప్రధాని ఈ సమావేశానికి వెళుతున్నారు. భారత్‌కు ఎరువులు, అరుదైన భూగర్భ ఖనిజాలు, టన్నెల్ బోరింగ్ యంత్రాలు ఎగుమతి చేయటానికి చైనా అంగీకరించింది. చైనా నుంచి పెట్టుబడులను కూడా భారత్ అనుమతించనుంది. ట్రంప్ బేసబబు వాణిజ్య పద్ధతులకు వ్యతిరేకంగా చైనా భారత్ వెనుక దృఢంగా నిలబడుతుందని దిల్లీలోని చైనా రాయబారి క్సు ఫీహోంగ్ గురువారం అసాధారణ సంఘీభావ ప్రకటన చేయటం మరో భరోసా.

ఇదిలాఉండగా, విదేశీ వ్యవహారాలమంత్రి జై శంకర్ గురువారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమై రష్యాతో భారత్ వ్యూహాత్మక సంబంధాల పటిష్టతపై చర్చించారు. ఈ సంవత్సరాంతంలో పుతిన్ భారత్ పర్యటన ఏర్పాట్ల గూర్చి రష్యా మంత్రి సెర్గి లెవరోవ్‌తో చర్చించారు. తమపై ట్రంప్ సుంకాలను ప్రశ్నిస్తూ జైశంకర్ ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు: ‘‘రష్యన్ ఆయిలు అతిపెద్ద కొనుగోలుదారు చైనా తప్ప భారత్ కాదు; ఎల్ఎన్‌జి అతిపెద్ద కొనుగోలుదారు ఇయు తప్ప మేము కాదు; 2022 తర్వాత రష్యాతో హెచ్చుగా వాణిజ్యం పెంచుకున్నది మేము కాదు. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరంగా ఉంచటానికి గతంలో మమ్మకోరిన ప్రతిదీ – రష్యా నుంచి ఆయిలు కొనుగోలు సహా చేశాం. అమెరికా నుంచి కూడా పెద్దమొత్తంలో ఆయిలు కొన్నాం.’’ రష్యాతో వాణిజ్య సంబంధాలను గతంలోలాగా గణనీయమైన స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జై శంకర్ మాటల్లో వ్యక్తమైంది.

ప్రపంచంలో నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన, మూడవ స్థానానికి చేరువవుతున్న భారత్‌ను ట్రంప్ బెదిరింపులు ఏమీ చేయలేవు. అమెరికాతోపాటు ప్రధానమైన దేశాలతో సంబంధాలు వృద్ధి చేసుకునే వ్యూహాత్మక విధానం మంచిదే. అయితే గత దశాబ్దంలో అమెరికాపై ఆశలు పెంచుకుని అతిగా అటుమొగ్గిన విధానాన్ని సరిదిద్దుకోవటానికి ఇదే సరైన సమయం.

## ఏ మనిషీ మరో మనిషికి వాడుకునే జంతువు కాదు


ప్రతి సంవత్సరం ఆగస్టు 23న అంతర్జాతీయ బానిస వాణిజ్య నిర్మూలన దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటాము. ఈ దినోత్సవాన్ని యునెస్కో 1998లో ప్రారంభించింది.

ఆనాడు బానిస వాణిజ్యంలో నల్ల జాతి ప్రజలను గొలుసులతో కట్టేసి, సముద్రాలు దాటించి, జంతువుల్లా కొనుగోలు చేసి అమ్మిన కాలం. మనిషి మనిషిని అమ్ముకున్న ఆ అంధకార గం అంతమైంది. 1791లో దాస్యానికి వ్యతిరేకంగా మొదలైన తిరుగుబాటు క్రమంగా హైటి విప్లవంగా రూపాంతరం చెంది ప్రపంచవ్యాప్తంగా బానిసత్వ నిర్మూలనకు దారితీసింది. దానికి గుర్తుగా ఆగస్టు 23న అంతర్జాతీయ బానిస వాణిజ్య నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకుంటాము. కానీ బానిసత్వం చట్టపరంగా రద్దయినప్పటికీ, నిజంగా అది అంతరించిపోయిందా? అని ఎవరిని అడిగిన సమాధానం కాదనే చెప్తారు. నేటి సమాజంలో బానిసత్వం కొత్త రూపాల్లో ఇంకా కొనసాగుతూనే ఉంది. గల్ఫ్ దేశాల్లో మన భారతీయ వలస కూలీల పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకొని బలవంతంగా, అయిష్టంగా వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నారు. మానవ అక్రమ రవాణా ద్వారా మహిళలు, బాలికలు లైంగిక దోపిడీకి గురవుతున్నారు.

**భారతదేశంలో ఆధునిక బానిసత్వం:** భారత దేశ రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ హక్కులను కల్పించినప్పటికీ అనేక రూపాల్లో బానిసత్వం యజమానుల మనస్సులో నుండి తొలిగిపోక ఇంకా కొనసాగుతున్నది. పేదరికంలో చిక్కుకున్న బాల కార్మికులు ఇటుకలు మోస్తూ, చాయ్ గ్లాసులు కడుగుతూ హోటల్లో కర్మాగారాలలో, చదువు మానుకొని పనిమనుషుల్లా కష్టపడుతున్నారు. బాలికలు ఉద్యోగం లేదా పెళ్లి పేరిట మోసపడి లైంగిక దాస్యానికి గురైతున్నారు. పట్టణాల్లో పనిచేసే గృహ సహాయకులు తక్కువ జీతాలు, ఎక్కువ గంటలు, గౌరవం లేకుండా పనిచేయడం బానిసత్వం యొక్క ఆధునిక రూపమే.

**తీసుకోవలసిన చర్యలు :** మన దేశం ప్రపంచానికి స్వేచ్ఛ, సమానత్వం బోధిస్తున్నా, మన ఇళ్ల చుట్టూ, మన పొలాల్లో, మన నగరాల్లోనే బానిసత్వం వేర్లు పాతుకుపోయి ఉంది. బానిసత్వాన్ని పెంచేది పేదరికం. మన సమాజపు మౌనం, నిర్లక్ష్యం మన వ్యవస్థ దానిని కాపాడుతుంటుంది. కావున ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. మానవ అక్రమ రవాణాపై కఠిన శిక్షలు అమలు చేయాలి. ప్రతి పిల్లవాడికి విద్య హక్కు కల్పించి బాల కార్మికత్వాన్ని నిర్మూలింపచేయాలి. సమాజంలో అందరూ సమానమే‘మనిషి మరొక మనిషి కోసం సహాయం చేయొచ్చు, కానీ ఎవ్వరూ ఎవరికి బానిసలు కాదు, కావలసిన అవసరం లేదు అనే స్ఫూర్తిని పెంచాలి.

# సాఫ్ట్‌వేర్ లో ముగిసిన స్వర్ణయుగం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలు కూడా ఎండమావుల్లా తయారవడంతో చదువుకున్న వారి పరిస్థితి ‘ముందు నుయ్యి, వెనుక గొయ్యి’ చందంగా మారింది. ఉద్యోగాలంటే సాఫ్ట్‌వేర్ రంగమే స్ఫురణకు రావడం సహజం. అయితే అదే సాఫ్ట్‌వేర్ రంగం అనిశ్చిత పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. టెక్ కంపెనీలు ఉద్యోగులకు లే ఆఫ్ లు, పింక్‌స్లిప్‌లతో వీడ్కోలు సందేశాలు పంపడమే ఇందుకు కారణం. అన్ని టెక్ కంపెనీలు ఇదే బాటలో పయనిస్తున్న కారణంగా ఒక కంపెనీలో ఉద్యోగం తొలగిస్తే, వేరే కంపెనీల్లో ఉద్యోగం లభిస్తుందన్న గ్యారంటీ లేదు. టెక్ హబ్‌గా పేరొందిన హైదరాబాద్‌లో కూడా అనేక కంపెనీలు ఉద్యోగులకు శ్రీముఖాలు పంపిస్తూ, సెలవంటూ చల్లగా జారుకుంటున్నాయి. ఒక ఏడాదిలోనే అమెజాన్ నాలుగు పర్యాయాలు ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ 9వేల మందికి ఉద్వాసన చెప్పాలని నిర్ణయించుకుంది. సుమారు 12వేల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు టి.సి.ఎస్ నోటీసులు పంపింది. గూగూల్, ఇంటెల్ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు సిద్ధం చేసింది. దాదాపు 20 నుండి 25 లక్షల మందికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉపాధి కల్పిస్తున్న హైదరాబాద్ టెక్ హబ్ ఉద్యోగులను యుద్ధ ప్రాతిపదికన తొలగించడానికి సంసిద్ధంగా ఉంది. ఎఐ సృష్టించిన పెను ప్రకంపనల్లో సాఫ్ట్‌వేర్ రంగం కకావికలమైపోతున్నది. ఇంకా చదువుకుంటున్న మన యువత అవగాహన లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కలలు కనడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ కల నెరవేరాలంటే అహరహం శ్రమించాలి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పట్ల శ్రద్ధ చూపాలి. గతంలో మాదిరిగా ప్రతిభ లేకున్నా ఫేక్ సర్టిఫికెట్లతో, ఫేక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఉద్యోగాలు పొందాలనుకోవడం ఇక జరగని పని. పలు దేశాల్లో ఉద్యోగుల కంటే స్వయం ఉపాధి ద్వారా అధిక సంపాదన చేస్తున్న వారెంతో మంది ఉన్నారు. మన దేశ యువత కూడా మూస ధోరణిలో పయనించకుండా, సంపాదనకున్న ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.

విద్యార్థి దశలోనే నైపుణ్యతకు సానబెట్టాలి. అత్యంత క్రమశిక్షణతో, నైపుణ్యతతో సాగిన ఒకప్పటి మన విద్యావ్యవస్థలోని అంకితభావం వర్తమానంలో అగుపించడం లేదనే విమర్శల్లో నిజం లేకపోలేదు. ఉద్యోగాల వేటలో పడిన యువత నైపుణ్యాన్ని అలవరచుకోకుండా ఇంకా డిగ్రీలను, బట్టీ చదువులను నమ్ముకోవడం వలన ఎలాంటి ప్రయోజనం చేకూరదు. విద్యావంతుల శాతం పెరుగుతున్నది. ప్రభుత్వ ఉద్యోగాలు గగనకుసుమంలా మారిపోయాయి. ప్రైవేటు సంస్థలు కూడా అందరికీ ఉద్యోగాలిచ్చే పరిస్థితుల్లో లేవు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మరింత సన్నగిల్లే అవకాశాలు కనిపించడమే కాకుండా ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకం కావచ్చు. ఒకప్పుడు భారత్‌తో సహా అనేక ప్రపంచ దేశాలు నిరుద్యోగ సమస్యతో సతమతమైన విషయాన్ని మరువలేం. పెరిగిన అవసరాలు మానవ జీవితాలను దుర్భరం చేస్తున్న దశలో అనేకమంది మేథావులు, ఆర్థిక శాస్త్రవేత్త నిపుణులు ప్రపంచ వాణిజ్యాన్ని సరళతరం చేసారు. సరళీకృత ఆర్థిక విధానాలకు అంకురార్పణ గావించారు. గ్లోబలైజేషన్ వలన వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగైనాయి. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచమంతా విస్తరించింది. ప్రపంచం ఒక కుగ్రామంగా మారింది. అనేక రంగాలు ప్రపంచంతో అనుసంధానించబడ్డాయి. వ్యవసాయ ఆధారిత దేశాలు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందాయి. వ్యవసాయమే ప్రధాన ఉపాధిగా జీవించే యువతకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. నిరుద్యోగ సమస్య తీవ్రత తగ్గింది. అవకాశాలు ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరడంతో ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరడానికి యువతకు మార్గం సుగమం కాబడింది.

విద్య, ఉద్యోగ రంగాల్లో పోటీతత్వం పెరిగిన కారణంగా ఉద్యోగాల్లో ప్రతిభ కీలకంగా మారింది. నైపుణ్యానికే అగ్రతాంబూల మిచ్చే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ప్రతిభకు అర్థం మారింది. తాము చదివిన చదువుల్లో, చేస్తున్న ఉద్యోగాల్లో నైపుణ్యత అవసరం. మారుతున్న పరిస్థితులకు, సాంకేతిక ప్రపంచంలో వెల్లువెత్తుతున్న నూతన పరిజ్ఞానానికి అనుగుణంగా యువత తమను తాము ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. కృత్రిమ మేథ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కృత్రిమ మేథ వలన ప్రస్తుతమున్న ఉపాధి అవకాశాలకు గండిపడే అవకాశాలున్నాయి. వందల సంఖ్యలో చేసే ఉద్యోగాలను కేవలం పదుల సంఖ్యలో పూర్తిచేసే సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఇక నుంచి ఉపాధి అవకాశాలు అందుకోవడం అంత సులభం కాదు. స్కిల్ డెవలప్‌మెంట్ వలనే ఉద్యోగాలు లభిస్తాయి. నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు దరికి చేరతాయి. ప్రభుత్వ ఉద్యోగాలు దొరకని నేపథ్యంలో కష్టమైనా ఇష్టంగా మలచుకుని సాఫ్ట్‌వేర్ ఆఫీసుల్లోనే పని చేయాలనే తత్వం నేటి యువతలో ప్రబలింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం అనేక ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నది. కేవలం 10–15 వేల రూపాయల నెలసరి వేతనానికైనా పనిచేయడానికి చాలామంది ఇంజనీరింగ్






యువత సంసిద్ధంగా ఉండడం గమనార్హం.

వ్యవసాయం చేసే యువత కరువైనది. చదువుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో మాదిరిగా కుటుంబంలో ఒక్కరు పనిచేస్తే, అందరూ హాయిగా జీవించే రోజులు పోయాయి. వేడి నీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్టుగా కుటుంబ సభ్యులంతా ఉపాధి అవకాశాలను అన్వేషించి, కష్టించి పనిచేస్తేనే కుటుంబాలకు, వ్యక్తులకు ఆర్థిక భద్రత చేకూరుతుంది. చదువుకున్న యువత నైపుణ్యత సంపాదిస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. కాబట్టి నైపుణ్యాల దిశగా యువతను నడిపించాలి. ప్రపంచవ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, పేదరికాన్ని నిర్మూలించి, లింగబేధం లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు కల్పించాలి. చదువుకున్న యువతలో ముఖ్యంగా 24 సంవత్సరాల లోపు వయస్సున్న యువతలో నిరుద్యోగం ప్రబలంగా ఉంది. వచ్చే దశాబ్దకాలంలో ఈ నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న జనాభాకు అదే నిష్పత్తిలో ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ప్రభుత్వాలు లేవు. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. దీనిని అధిగమించడానికి ప్రభుత్వాలు ప్రణాళికలను రూపొందించుకోవాలి. 2030వ సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని, నేటియువతలో సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు పెంపొందించాలి. నైపుణ్యత సరిగా లేకపోవడంతో ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్న మాట వాస్తవం. అందరినీ ‘విద్య’ వైపు మళ్ళించడం హర్షించదగ్గ విషయమే. కాని విద్యలో నాణ్యత కొరవడడం, కళాశాల స్థాయి దాటిన తర్వాత కూడా యువతలో సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు మందగించడం వలన ఉద్యోగాలు దొరకడం కష్టసాధ్యంగా మారింది. యువత ఉపాధికి దూరమైతే ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇప్పటికే అలాంటి సూచనలు స్పష్టంగా కానవస్తున్నాయి. ఏ దేశమైనా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ప్రతీ ఒక్కరూ చదువుకోవాలి. ఆ చదువుద్వారా నైపుణ్యాన్ని అలవరచుకోవాలి. ప్రపంచమంతా యాంత్రీకరణ దిశగా, కృత్రిమ మేథ వైపు పయనిస్తుంటే ఇంకా చాలా దేశాలలో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. అరకొర సదుపాయాలతో, విద్యాప్రమాణాల లేమితో చదువుకున్నా, చదువుకొన్నా శూన్య ఫలితాలే వస్తున్నాయి. ఐ.రా.స ఆశించిన ఫలితాలు రావాలంటే నాణ్యమైన విద్యతో పాటు, సాంకేతిక నైపుణ్యం యువతకు అందేటట్టు చూడాలి. గ్రామీణ ప్రాంత యువతలో ప్రస్తుత పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఆర్థిక అసమానత్వం వలనే యువతకు సరైన విద్య దొరకడం లేదు. ఆర్థిక స్థోమత కలవారు పట్టణాలకో, నగరాలకో వలసపోయి వృత్తిపరమైన, సాంకేతిక పరమైన నైపుణ్యాలను అలవరచుకుని ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారంతా నైపుణ్యాలకు దూరమై, చదువుకున్నా, నిరక్షరాస్యులుగానే పరిగణింపబడుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. సమాజంలో అందరికీ సరైన విద్య అందాలి. ప్రతిభ గల అందరికీ సమాన అవకాశాలు కలగాలి. ప్రతీ ఒక్కరికీ అన్ని స్థాయిల్లో ఉచితమైన, నాణ్యమైన విద్య అందాలి. బ్యాంకుల జాతీయీకరణ మాదిరిగానే విద్యను కూడా ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు జాతీయీకరణ చేయాలి. కుల,మత,లింగబేధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కలుగచేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను ఎప్పటికప్పుడు ఆధునీకరించాలి. యువతలో సాంకేతిక, విద్యా నైపుణ్యాలను సానబట్టాలి. నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వాలు కృషి చేయాలి.

యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అత్యంత బలమైన విద్యావ్యవస్థలను కలిగి ఉన్నాయి. జపాన్, స్వీడన్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ అత్యుత్తమ విద్యావ్యవస్థలతో అగ్రపథంలో కొనసాగుతున్నాయి. జపాన్ అన్ని స్థాయిల్లో అత్యుత్తమ విద్యాశ్రేణితో కొనసాగుతున్నది. లక్సెంబర్గ్ విద్యపై అధిక శాతం ఖర్చుచేసే దేశంగా తాజా నివేదికలు సూచిస్తున్నాయి. చిలీతో పాటుగా నార్వే, ఆస్ట్రేలియా, యు.కె, క్యూబా, మార్షల్స్ దీవులు, కిరిబాటి, ఇజ్రాయిల్, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్ లాండ్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఉన్నత విద్యకోసం అత్యధిక నిధులను వెచ్చిస్తున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బాల్యం నుండే విద్యార్థులకు చదువుల్లో బలమైన పునాది పడాలి. సృజనాత్మకత, సునిశిత పరిశీలన, శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక పరమైన అంశాల్లో తగిన శిక్షణ నివ్వాలి. ఉన్నత విద్యలో నైపుణ్యత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

# భారత ఆర్థిక వెలుగు : నిజాలు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496

2025 ఆగస్టు 14న స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్ అండ్ పి) గ్లోబల్ రేటింగ్స్ భారత సార్వభౌమ క్రెడిట్ రేటింగ్‌ను (బెటర్ బిజినెస్ బ్యూరో) ‘బిబిబి మైనస్’ నుంచి ‘బిబిబి’కి పెంచింది. 18 ఏండ్ల తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌లో అత్యల్ప స్థాయికి చేరిన ఈ మార్పు, భారత ఆర్థిక వ్యవస్థకు ఒక మైలురాయిగా నిలిచింది. ఈ అప్‌గ్రేడ్ గ్లోబల్ ఇన్వెస్టర్లకు భారత్‌పై విశ్వాసాన్ని పెంచుతుందని, రుణ ఖర్చులను తగ్గిస్తుందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని అధికారపక్షం బిజెపి ఆనందం ప్రకటిస్తోంది. అయితే, ఈ వెలుగులోని నీడలను పరిశీలిస్తే, ఆర్థిక వాస్తవాలు అంత సరళంగా లేవని స్పష్టమవుతుంది. డేటా సమగ్రతపై ప్రశ్నలు, నెరవేరని వాగ్దానాలు, సామాజికఆర్థిక సవాళ్లు ఈ రేటింగ్ అప్‌గ్రేడ్‌ను ఆచితూచి అంచనా వేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

ఈ రేటింగ్ మెరుగుదల భారత్‌కు గ్లోబల్ మార్కెట్లలో చౌకైన నిధులను సమకూర్చడం, రూపాయి స్థిరత్వాన్ని పెంచడం, సావరిన్ బాండ్లపై విశ్వాసాన్ని బలోపేతం చేయడం వంటి ప్రయోజనాలను తెస్తుంది. ఎస్ అండ్ పి ప్రకారం, భారత రుణ జిడిపి నిష్పత్తి 2029 నాటికి 83 శాతం నుంచి 78 శాతానికి తగ్గుతుందని, ఆర్థిక లోటు 2020–21లో 9.3 శాతం నుంచి 2025–26 నాటికి 4.4 శాతానికి తగ్గుతుందని అంచనా. ఈ గణాంకాలు బలమైన స్థూల ఆర్థిక విధానాలు, ద్రవ్య స్థిరత్వం, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులను సూచిస్తాయి. మూలధన వ్యయం 2014–15లో 1.6 శాతం నుంచి 2025–26 నాటికి 3 శాతానికి పైగా పెరిగింది, ఇది ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా మన ప్రభుత్వం చెప్పుకొంటుంది. అయితే, ఈ గణాంకాల వెనుక దాగిన సంక్లిష్టతలను విస్మరించలేము.

గత దశాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ, డేటా విశ్వసనీయతపై విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ 2012 తర్వాత జిడిపి అంచనాలు 22.5 శాతం అధికంగా చూపించారని వాదించారు. అధికారికం గా 7 శాతం సగటు జిడిపి వృద్ధి ప్రకటించబడినప్పటికీ, స్వతంత్ర అంచనాలు దానిని 5 శాతానికి దగ్గరగా ఉంటుందని సూచిస్తున్నాయి. ఈ వ్యత్యాసం ఆర్థిక విధానాలు, రాజకీయ నిర్ణయాలపై సందేహాలను రేకెత్తిస్తుంది. ఉదాహరణకు, ‘మేక్ ఇన్ ఇండియా’ కార్యక్రమం తయారీరంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 2014 లో జిడిపిలో 15శాతం ఉన్న తయారీ వాటా 2022 నాటికి 13 శాతానికి పడిపోయింది. దీర్ఘకాల ఉద్యోగ సృష్టి, ఎగుమతి వృద్ధిలో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదు. బదులుగా, సేవల రంగం, అనధికారిక ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇవి ఆర్థిక సంక్షోభ సమయంలో బలహీనతలను బహిర్గతం చేశాయి.





ఉద్యోగ సృష్టి విషయంలోనూ ఆశాజనక చిత్రం కనిపించడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, 2017–18 ఎన్ఎస్ఎస్ఒ నివేదిక ప్రకారం నిరుద్యోగ రేటు 6.1 శాతానికి చేరింది, ఇది 45 ఏండ్లలో అత్యధికం. 2011–12 నుంచి 2018 మధ్య 1.5 కోట్ల ఉద్యోగాలు కోల్పోయాయి. (2018 తర్వాత నెట్‌లో డేటా అప్‌డేట్ చేయలేదు) పిఎల్ఎఫ్ఎస్ నివేదికలు నిరుద్యోగ సమస్యను తక్కువగా చూపించే ప్రయత్నం చేసినప్పటికీ, అర్బన్ యువతలో నిరుద్యోగం ఆందోళనకరంగా ఉంది. ఈ సందర్భంలో, అధిక జనాభా ఉన్న భారత్‌లో ఉద్యోగ సృష్టి అత్యంత కీలకం, కానీ ఈ రంగంలో విజయం సాధించడం కష్టసాధ్యంగా కనిపిస్తోంది.

సామాజిక అసమానతలు మరో పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. నీతి ఆయోగ్ పేదరికం 5 శాతానికి తగ్గిందని చెప్పినప్పటికీ, వరల్డ్ బ్యాంక్, ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు దీనిని 12–15 శాతానికి దగ్గరగా అంచనా వేస్తున్నాయి. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, భారత్‌లోని 1 శాతం ధనవంతుల వద్ద 40 శాతం జాతీయ సంపద కేంద్రీకృతమైంది, ఇది 2014లో 22 శాతం నుంచి గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. ఈ అసమానతలు సంపద పంపిణీలో పెరుగుతున్న అంతరాన్ని, సామాన్యులకు ఆర్థిక పురోగతి ఫలితాలు అందకపోవడాన్ని చూపిస్తున్నాయి. ఈ సందర్భంలో, (ఎస్ అండ్ పి) రేటింగ్ అప్‌గ్రేడ్ ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తున్నప్పటికీ, సామాజిక – ఆర్థిక సమస్యలను పరిష్కరించకపోతే ఈ విజయం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.

జిఎస్‌టి ఆదాయం 2024–25లో 9.4 శాతం పెరిగినప్పటికీ, లక్ష్యాలను చేరుకోలేకపోవడం, బడ్జెట్ వెలుపలి రుణాలు, సబ్సిడీలు వంటివి ఆర్థిక లోటు గణాంకాలను మరుగున పరుస్తున్నాయని విమర్శకులు చెబుతున్నారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు భారత ఎగుమతులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు మరో సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో, రేటింగ్ అప్‌గ్రేడ్ ఒక సానుకూల సంకేతం అయినప్పటికీ, దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వం కోసం డేటా పారదర్శకత, ఉద్యోగ సృష్టి, సామాజిక సమానత్వంపై దృష్టి సారించాలి. చివరగా, భారత ఆర్థిక వృద్ధి కథ రెండు ముఖాలను కలిగి ఉంది. ఒకవైపు గ్లోబల్ ప్రభావాలు, ముఖ్యంగా అమెరికా టారిఫ్‌ల ప్రభావం, మరోవైపు దేశీయ సవాళ్లు. (ఎస్ అండ్ పి) రేటింగ్ అప్‌గ్రేడ్ ఒక అవకాశంగా భావించాలి, కానీ దాని ని సామాన్యుల జీవనోపాధికి, సమగ్రమైన వృద్ధికి అనుసంధానం చేయకపోతే, ఈ వెలుగు కేవలం గణాంకాల గారడీగానే మిగిలిపోతుంది.

# అంతరిక్ష పరిశోధనలో నవ శకం



సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారత్ నవ నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతుంది. ఈ క్రమంలో నేడు రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటోంది.

ఆగస్టు 23, 2023 రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్3 లోని విక్రమ్ ల్యాండర్ ‘శివశక్తి’ అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ మిషన్ విజయం అంతరిక్షరంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయి. భారత దేశం చంద్రునిపై విజయవంతంగా అడుగుపెట్టిన నాల్గవ దేశంగా, దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరుకున్న మొదటి దేశంగా అవతరించింది. ఈ దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన, విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదిక కానుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (STEM)లో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనుంది. ఈ యేడు ఆర్యభట్ట నుండి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకొంటున్నాం. ఇది ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట కాలం అనంతరం మిగిలిపోయిన ఖగోళ విజ్ఞాన అన్వేషణతో భవిష్యత్తు అంతరిక్ష కార్యక్రమాలలో దూసుకుపోవాలని నొక్కి చెబుతుంది.

**చంద్రునిపై భారత ప్రణాళికలు**

భారతదేశం అంతరిక్ష రంగంలో నవ శకానికి నాంది పలకడానికి సిద్ధమైంది. 2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్ యాన్ మిషన్ కీలకం కానుంది. ఇందులో భూమికి దగ్గరగా 400 కిలోమీటర్ల దూరంలో భూకక్ష్యలోకి పంపి, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం ఈ మిషన్ తొలి లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2026 నాటికి వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. అనంతరం 2027 లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్ మిషన్ చేపట్టనున్నారు. మరోవైపు మానవ సహిత చంద్రుడియాత్రకు ముందు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అనంతరం మానవ సహిత చంద్రుడియాత్రకు సిద్ధం కానుంది. చంద్రయాన్ 4 లో చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఎల్వీఎం అనే పెద్ద రాకెట్లతో డాకింగ్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ సాంకేతికత భవిష్యత్తులో మానవ సహిత యాత్రలకు, అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి చాలా అవసరం. ఇటీవల భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా యాక్సియం4 మిషన్‌లో ముగ్గురు వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించి తిరిగి వచ్చాడు. భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసిలో విహరించిన నాలుగు దశాబ్దాల తర్వాత మరో భారతీయుడు అంతరిక్షంలోకి దూసుకెళ్లాడు. ఇదీ భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే మానవసహిత యాత్రలకు నాంది అని పలువురు అభివర్ణించారు. చంద్రయాన్3 విజయవంతం అయిన తర్వాత, జపాన్ స్వయంగా భారత్ సహకారం కోరింది. దీనితో ఇస్రో, జపాన్ అంతరిక్ష సంస్థ జాక్స(JAXA) కలిసి చంద్రయాన్5/LUPEX మిషన్ కోసం పని చేయాలని నిర్ణయించారు.




**అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం**

భారత అంతరిక్ష కార్యక్రమాలు ఆధునికంగా ముందుకెళ్లడానికి, ప్రజల దైనందిన జీవితాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతున్నాయి. అంతరిక్ష ప్రయోగాలకు కేంద్రమైన ఇస్రో సౌండింగ్ రాకెట్ తో మొదలు పెట్టి నేడు పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి, ఎల్వీఎం లాంటి రాకెట్లతో బారి ఉపగ్రహాలను ప్రయోగిస్తుంది. అత్యంత ఖచ్చితత్వంతో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలు ప్రయోగిస్తున్నది. మరోవైపు వాణిజ్య ఉపగ్రహాలతో విదేశీ మారకద్రవ్యాన్ని అర్జిస్తుంది. ఇస్రో ప్రయోగించే ఉపగ్రహాలతో వాతావరణ సూచన, సమాచార మార్పిడి (టీవీ, ఇంటర్నెట్), నావిగేషన్ (GPS), భూమి పరిశీలన (పర్యావరణ మార్పులు, విపత్తులు), శాస్త్రీయ పరిశోధన,రక్షణ వంటి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. మరోవైపు ఇస్రో పునర్వినియోగ రాకెట్ల(పుష్పక్) తయారీ, చిన్న రాకెట్ల ప్రయోగ వేదికను సిద్ధం చేస్తుంది. వీటితో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాల ప్రయోగం మరియు చిన్న ఉపగ్రహాల సత్వర ప్రయోగానికి బీజం పడనుంది. భారత ప్రభుత్వం భారత అంతరిక్ష విధానం–2023ను తీసుకువచ్చింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం. ఈ విధానం ద్వారా అంతరిక్ష సంబంధిత కార్యకలాపాల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం, పరిశోధన, అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**పరిశోధనకు బడ్జెట్ కేటాయించాలి :** అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష ప్రయోగాలు కొనసాగుతున్నప్పటికీ...భారతదేశం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2 శాతం మాత్రమే కలిగి ఉంది. దీన్ని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తిని పెంచాలి. వీటిపై మక్కువ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఇస్రో యువిక (యంగ్ సైంటిస్ట్) 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నది. ఉన్నత విద్య, పరిశోధనలో యువ భాగస్వామ్యాన్ని పెంచాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే మన విద్య వ్యవస్థలో నాణ్యత చాలా తక్కువ. మంచి విద్య, ఉద్యోగాల కోసం అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలకు మన మేథో వలసలు జరుగుతున్నాయి. మరోవైపు, భారత్లో ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య 28 శాతమే. దీన్ని 2035 కల్లా 50 శాతానికి పెంచాలనీ, మన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలని 2020 నూత న విద్య విధానం లక్షిస్తోంది. దీనికి అనుగుణంగానే విదేశీ వర్సిటీలకు భారత్ స్వాగతం పలికారు.

## గణేష్ ఉత్సవాలకు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ వార్షిక తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, పోలీస్ సిబ్బందితో కిట్ ఇన్స్పెక్షన్, పరేడ్, లాఠీ డ్రిల్ చేయించడం జరిగింది. పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఇంకుడు గుంతను ఏర్పాటుచేసినందుకు, లాన్ గ్రాస్ గార్డెన్‌ను ఏర్పాటుచేయించినందుకు సీఐ జానకిరామ్ రెడ్డిని, ఎస్ఐ పవన్‌కుమార్‌ను డీసీపీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ సిబ్బంది తమ యొక్క విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాబోయే గణేష్ నవరాత్రులు ఎటువంటి గొడవలు జరుగకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, పాలకుర్తి సీఐ జానకీ రామ్‌రెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కార్మికుల హక్కుల కోసం పోరాటం

ప్రజాపక్షం/ వరంగల్ : తెలంగాణ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఉపాధ్యక్షులు మాలోత్ సాగర్ అన్నారు. వరంగల్ ఎంజీఎం సెంటర్‌లో మహబూబ్ పాషా ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నూతన బోర్డును ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మిక హక్కుల కోసం నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడం కోసం బిజెపి ప్రభుత్వం ప్రయత్నం కొనసాగుతుందన్నారు. మహాలక్ష్మి ద్వారా నష్టపోతున్న ఆటోడ్రైవర్లకు నెలకు రూ. 4500 పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ నెల 23న జరిగే ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ మొదటి మహాసభ వరంగల్ చార్‌బౌలి నోబుల్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందన్నారు. ఎస్ కే లతీఫ్, ఎస్ కే దస్తగిరి,ఎంఏ సలాం, ఎస్ శ్రీను, ఎంఏ గఫూర్, రాజు, హుస్సేన్, యూసఫ్, కిన్నెర స్వామి పాల్గొన్నారు.



## మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో మానుకోట సిపిఐ బృందం



ప్రజాపక్షం/మహబూబాబాద్ : మేడ్చల్ లో జరుగుతున్న సిపిఐ నాల్గవ రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా సిపిఐ బృందం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్యూనిస్టు మేధావి మాజీ ఎంపి డి. రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్ పలువురు సిపిఐ ప్రతినిధి బృందం పాల్గొన్నారు.

## సమర్థవంతంగా పనిచేయాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : పోలీస్ అధికారులకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సింగ్ తెలియజేశారు. హెడ్ కానిస్టేబుల్ నుండి అసిస్టెంట్ సబ్ ఇన్స్‌స్పెక్టర్లు పదోన్నతి పొందిన రమేష్, కుమార్ స్వామి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్ర చిహ్నాలు అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల నమ్మకానికి తగ్గట్లుగా పనిచేసి ప్రజల అభిమానాన్ని పొందాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి. సి. ఆర్. బి ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిత్యం అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ జిల్లా గంగారాం, కొత్తగూడ పోలీస్ స్టేషన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌ల పరిసర ప్రాంతాలను, రిసెప్షన్ రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూఅధికారులు సిబ్బంది అప్రమత్తంగాఉండివిధులు నిర్వహించాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా సంబంధిత వీపిఓ లు గ్రామాలకు వెళ్లి ఎన్ని వినాయక మండపాలు ఉన్నాయి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఇసుక,జూదం, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని సూచించారు. గంగారం ఎస్సై బి. రవికుమార్,పోలీసు స్టేషన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో వసతులపై సమీక్ష

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




ప్రజాపక్షం / వరంగల్ : దసరా వరకు కళాశాలల మౌలిక వసతులు పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధిపై ప్రిన్సిపల్స్, కమిటి చైర్మన్ లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జడ్పీ సీఈవో, ఇంచార్జ్ డిఆర్డిఓ రాంరెడ్డి, ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి శ్రీధర్, సుమన్ పాల్గొని పాఠశాలల మౌలిక వసతుల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి మౌలిక వసతుల ఏర్పాట్లు తదితర మౌలిక వసతుల పూర్తి కి ఇంజనీరింగ్ అధికారుల తో ముందస్తు ప్రణాళి కల ఆమోదం తో దసరా వరకు కళాశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ ను పాల్గొన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఏమైంది?

ప్రజాపక్షం/హనుమకొండటౌన్ : బీసీలకు అన్ని రంగాలలో మేలు చేస్తామని చెప్పి, కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ లోని అంశాలు ఏమయ్యాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గౌడ కల్లు గీతా వృత్తిదారుల ఉపాధిని పెంచే విధంగా నూతన మద్యం పాలసీని పునసమీక్షించాలని ఆయన కోరారు. గౌడ్ లకు 25 శాతం వైన్ షాపుల్లో రిజర్వేషన్లు ఇచ్చి, కామారెడ్డి డిక్లరేషన్ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కల్లుగీతా కార్మికులకు వైన్ షాపులు ఇవ్వాలని, మద్యం షాపుల వల్ల గీతా కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, అందుకే గౌడన్నలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పాత పద్ధతిలోనే టెండర్లను నిర్వహిస్తే గౌడ కులస్తులమంతా మద్యం టెండర్ల ప్రక్రియను అడ్డుకుంటామని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ హెచ్చరించారు.

## విద్యా ప్రమాణాలు బాగుండాలి

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రజాపక్షం / హనుమకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే విద్యా ప్రమాణాలు బాగుండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉపాధ్యాయులకు సూచించారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి గదిలో సాంఘిక శాస్త్రంలోని జాతియోద్యమ పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయుడు బోధిస్తుండగా పాఠ్యాంశంలో ఉన్నట్లుగా దేశ పటాన్ని చూపిస్తూ ఆనాటి ప్రాంతాలను విద్యార్థులు గుర్తించాలని కలెక్టర్ కోరగా విద్యార్థులు గుర్తించారు. అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

# అర్హులకే కొత్త రేషన్ కార్డులు

### మంత్రి సీతక్క



ప్రజాపక్షం/మహబూబాబాద్/ గూడూరు: రాష్ట్ర వ్యాప్తంగా పనుల జాతర–25 కార్య క్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని, గ్రా మాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పనుల జాతరలో భాగంగా పనులప్రారంభోత్సవాలు,కొత్తగా చేపట్టే పనుల భూమి పూజా కార్యక్రమాలు, శుక్రవారం కొత్తగూడ, గంగారం మండల కేంద్రలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, చేసి హరితహారం కార్యక్రమంలో మొక్క నాటారు. అనంతరం గంగారం రైతు వేదికలో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కొత్తగూడ మండల కేంద్రంలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. తిరుమలగండి పూట్టల భూపతి గ్రామాల మధ్య ఒక కోటి 60 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గంగారం హాస్టల్ గుంపు, ఎంపిడిఓ కార్యాలయంలో మొక్క నాటారు. ఒక కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న గంగారం మండలం ప్రజా పరిషత్ కార్యాలయ నూతన భవన్ కోసం శంకుస్థాపన చేశారు. గంగారం కేంద్రంలోనీ రైతు వేదికలో మండలానికి చెందిన (825) లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసారు. మంత్రి మాట్లాడుతూ గంగారం మండలంలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సోలార్ ఉత్పత్తి, కోళ్ళ ఫారమ్, హార్టికల్చర్, వ్యవసాయ, సహకార, గ్రామీణ ఉత్పత్తుల వినియోగం, తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యూరియా పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కొరత నివారణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, రెవెన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు,జెడ్పిసీఈవోపురుషోత్తం ఉన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

### రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హనుమకొండ: వివిధ రకాల అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకే పను ల జాతరకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించే అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన, వీర్లగడ్డ తండాలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో స్వామివార్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీర్లగడ్డ తండా గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ రోజు పనుల జాతర పేరుతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకునే కార్యక్రమంశ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు 46 పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రాంత ప్రజలకు గౌరవెల్లి ప్రాజెక్టు గుండెకాయ లాంటిది అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరా రు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు వచ్చినట్లయితే అందరికీ భూముల విలువ పె రుగుతుందని, తద్వారాఆదాయం పెరుగుతుందన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ డైరెక్టర్ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, భీమదేవరపల్లి తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## జనగామ చెరువులకు జలకళ



ప్రజాపక్షం/జనగామ : జనగామ మండలంలోని పలు గ్రామాల చెరువులకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. బొమ్మకూర్ రిజర్వాయర్ నుండి జనగామ మార్కెట్ కమిటి ఛైర్మన్‌తో పాటు నీటి పారుదల శాఖ అధికారులు నీటి విడుదల చేసి చెరువులకు మళ్లించారు. ఈ సందర్భంగా జనగామ మార్కెట్ కమిటి ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామ మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువుల్ని నీటితో నింపాలనే ఉద్దేశ్యంలో బొమ్మకూర్ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. రైతులకు ఎ లాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో చెరువులు నింపడం జరుగుతుందని, పంటలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు నీటిని వృధా చేయకుండా రైతులు వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఏఈ కమలాకర్, కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ బానోతు బన్సినాయక్; మాజీ ఎంపిటిసి తుపాకుల రాములు, ఓబుల్ కేశ్వాపూర్ గ్రామఅధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, పిడుగు రమేష్, నికిల్, జయరాం, రమేష్, శ్రీను, బీరయ్య, కొమురెల్లి పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజాకు వినతి



ప్రజాపక్షం / వరంగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన 42శాతం స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే 9వ షెడ్యూల్ లో చేర్చి ఆమోదించడానికి కావాల్సిన ఒత్తిడిని కేంద్ర ప్రభుత్వం మీద పెంచాలని బిసి సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి వినతి పత్రం అందించారు. మేడ్చల్ గాజుల రామారంలో జరుగుతున్న సిపిఐ 4వరాష్ట్ర మహాసభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజాకు వినతిపత్రం అందించారు. కుమారస్వామి మాట్లాడుతూకుల, జనగణన చేపట్టడానికి, కేంద్రం వివిధ రాష్ట్రాలే కుల, జన గణన చేపట్టే విధంగా ఆదేశాలు ఇచ్చిన ఎడల అనతి కాలంలోనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాల చేత ఆయా రాష్ట్రాలలో కుల జనగణన చేపట్టడం ద్వారా త్వరగా దేశవ్యాప్తంగా కులజన గణన పూర్తవుతుందన్నారు. ఈ సర్వే ఆధారంగా దేశవ్యాప్తంగా చట్టసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో బీసీల వాటా బీసీకి ఇచ్చే విధంగా పార్లమెంటులో బిల్లు తేవచ్చన్నారు. అలా కాకుండా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులజన గణన చేపట్టాలంటే 2028 వరకు పూర్తి చేస్తామని దాటవేత వైఖరిని ప్రదర్శించడమే కాకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం బీసీలను వాడుకొనే దురుద్దేశంతో ఉన్నట్టు కనపడుతుందన్నారు. సకల రంగాల్లో బీసీల వాటా కోసం సిపిఐ మరింత తగిన చొరవ చూపాలన్నారు. రాజా స్పందిస్తూ సెప్టెంబర్ లో చండీఘర్ లో జరగబోయే ఆల్ ఇండియా మహాసభలో చర్చించి తగిన కార్యాచరణ తప్పకుండా రూపొందిస్తామని కేంద్ర ప్రభు త్వం మీద ఒత్తిడి పెంచుతామని తెలిపారన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలు మురిసేలా పనుల జాతర

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజాపక్షం/టేకుమట్లః గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు అన్నారు. మండలంలోని మందరోనిపల్లి గ్రామంలో 20 లక్షలతో ఉపాధిహామి పథకం నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయితి భవనాన్ని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు ప్రారంభించారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ పంచాయితీరాజ్ ,గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం, స్వచ్ఛ భారత్ మీషన్, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్,గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల ద్వారా చేపట్టబోయే కొత్త పనులను ఏకకాలంలో ప్రారంభం చేయడానికి పనుల జాతర శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో పూర్తయిన పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు.కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు బాటలు పడనున్నాయని ,ఉపాధిహామి కూలీలు స్వయం ఉపాధి పొందేవారికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 1075 ప నులను చేపట్టినట్లు తెలిపారు.ఇందు కోసం రూ.3.93 కోట్ల అంచనా తయారు చేసినట్లు తెలిపారు.అలాగే స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీన్‌లో 375 పనులు చేపట్టినట్లు తెలిపారు. స్థాని క సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ,డిఆర్డివో బాలకృష్ణ,డిపిఓ శ్రీలత,పీఆర్ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపిడివో అనిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొటగిరి సతీష్‌గౌడ్,మాజీ జెడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి పాల్గోన్నారు.

## అభివృద్ధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ములుగుః వివిధ రకాల అభివృద్ధి పనులను చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాతత్మకంగా చేపట్టిన కార్యక్రమం పనుల జాతర కార్యక్రమమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీలో పనుల జాతరను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకానికి సంబంధించి మొత్తం 266 పనులు చేపట్టబడి ఉన్నాయని, వాటిని గ్రామ ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు రోజుకు రూ.307 లబ్ది పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్న బోయినపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన, ఇంకుడుగుంతల నిర్మానం, నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. అదేవిధంగా వ్యక్తిగత పనుల క్రింద పౌల్ట్రీ షెడ్లు, నాడెపు కంపోస్ట్ పిట్లు, అజోల్ల పెంపకం, ల్యాండ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర ప్లాంటేషన్, టాయిలెట్ నిర్మాణాలు మొదలైన కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి చెందిన సభ్యులు జాబ్ కార్డు వినియోగించుకొని ఉపాధిహామీ పథకం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కొత్తగా ఎవరికైనా పనులు కావాల్సిన సందర్భంలో, సంబంధిత అధికారులు అవసరమైన సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో అత్యుత్తమంగా పనిచేసిన కార్మికులు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకానికి సేవలందించిన వారు, పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న దివ్యాంగులు తదితరులకు కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ, ఏపిఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి




ప్రజాపక్షం/పరకాల : గ్రామాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యక్తిగత అభివృద్ధికి పాటు పడే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల, నడికూడా మండలాలలోని వివిధ గ్రామాలలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. పరకాల మండలంలోని నాగారంలో రూ.12 లక్షలతో అంగన్వాడీ నూత న భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులపాలు చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. గత పాలకులు చేసిన పాపం వలన తెలంగాణ ప్రజలు ఎంతో నష్టపోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆ దుస్థితి నుండి బయటపడడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రతినెల 6000 కోట్ల రూపాయల అప్పులను కట్టడానికి మిత్తిగా చెల్లించడం జరుగుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, నాగారం గ్రామపంచాయతీ అధ్యక్షుడు, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు దాసరి బిక్షపతి పాల్గొన్నారు.

## గ్రామాల ప్రజలకు సకల సౌకర్యాలు

ప్రజాపక్షం/పాలకుర్తి: గ్రామాల అభివృద్ధే ప్రజాప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మైలారంవిస్నూర్,పాలకుర్తి, వల్మిడీ, ముత్తారంలలో పంచాయితిరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతరలో మైలారం నుండి లావుడ్య తండాకు బీటీ రోడ్డు, మండల కేంద్రంలోని మహిళా శక్తి భవనం ప్రారంభం, విస్నూర్ ముత్తారం గ్రామాలలో సబ్ సెంటర్లు బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం వల్మిడి నుండి తీగారం వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, తదితరులు ఉన్నారు.

# నిజాం నిరంకుశత్వంపై ఎత్తిన అక్షర కరవాలం షోయబుల్లాఖాన్

### జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు



ప్రజాపక్షం/మహబూబాబాద్ : నిజాం నిరంకుశత్వంపై ఎత్తిన అక్షర కరవాలం షోయబుల్లాఖాన్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నాడు. షోయబుల్లాఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. టిఎస్‌జెయు జిల్లా అధ్యక్షుడు చిర్రగోని ఉదయ్ ధీర్ అధ్యక్షతన టియుడబ్ల్యుజె (143) పట్టణాధ్యక్షులు బొల్లెపల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.శంతన్ రామరాజు మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వంపై తన కలంతో అగ్నిధార కురిపించిన అక్షర సేనాని షోయబుల్లా ఖాన్ అని కొనియాడాడు. 1920, అక్టోబర్ 17న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో షోయ బ్ జన్మించాడన్నాడు. ఉత్తరప్రదేశ్ నుండి తెలంగాణకు వలసవచ్చిన షోయబ్ తండ్రి రైల్వే ఉద్యోగిగా స్థిరపడ్డాడని అన్నాడు. షోయబ్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి జర్నలిజం పట్టా తీసుకొని తాజ్వీ పత్రికద్వారా నాటి నిజాం నిరంకుశత్వాన్ని, ఖాసీం రజ్వీ దురాగతాలను ఎండగట్టాడన్నారు. ప్రభుత్వం ఆ పత్రికను నిషేదించడంతో ఇమ్రోజు పత్రికద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను, పాలకుల లోపాలను ఎత్తిచూపు తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మద్దతుగా నిలిచాడన్నారు. పాకిస్థాన్‌కు దన సహాయంతో పాటు తెలంగాణను విలీనం చేసే కుట్రలను నాటి ప్రభుత్వంలోని ఏడుగురు పెద్దలు లేఖల ద్వారా బయటి ప్రపంచానికి తెలియబర్చడంతో ఆలేఖలను యథాతథంగా షోయబుల్లాఖాన్ తన పత్రికలో ప్రచురించాడన్నాడు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకుపోతుందనే భయంతో షోయబుల్లాఖాన్‌పై నిజాం సర్కార్ కక్ష కట్టిందన్నాడు. పత్రిక విధులు ము గించుకొని రాత్రి సమయంలో ఇం టికి వెళ్తున్న షోయబుల్లాఖాన్ హత్య కు గురవడం విచారకరమన్నారు. మహబూబాబాద్‌లో ఆయన పేరుమీద ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నేటి పత్రికా రంగానికి షోయబుల్లాఖాన్ జీవిత చరిత్ర కరదీపిక అని అన్నారు. కమ్మగాని కృష్ణమూర్తి, సిరిపురం వీరన్న, రామరాజు ఉపేందర్, గంగాదరి బాలరాజు, వన ప్రేమికుడు ధైద వెంకన్న, ధరంసోత్ నారాయణ్ సింగ్ తో పాటు పాత్రికేయులు వర్మ, కుమార్, గుండెల రాజు, గాండ్ల కిరణ్, లక్ష్మణ్, అంబాల కుమార్, తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, రాచకొండ ప్రవీణ్, యాకన్న, సురేష్, కొండి సాయి కిరణ్ నేత, గోనె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు కడియం శ్రీహరి పరామర్శ

ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండలంలోని తీగారం గ్రామానికి చెందిన జిట్టబోయిన మల్లయ్య ఇటీవల మృతిచెందగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం తమ్మడపల్లి జి గ్రామానికి చెందిన స్టేషన్‌ఘనపూర్ ఎన్టీవీ రిపోర్టర్ కొత్త రంజిత్ తండ్రి కొత్త వెంకటేశ్వర్లు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడంతో వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వేల్పుల సోమనర్సమ్మ, గాజుల సంపత్, ఎల్లయ్య, సోమయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం - యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి/కొత్తగూడెం టౌన్ :** లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారుచెలక గ్రామపంచాయతీ పరిధిలోని పాత బంగారుచెలక గ్రామానికి చెందిన కోడి రెక్కల సుధీర్ (24) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాత బంగారుచెలక గ్రామంలో ఓ అక్రమ సంబంధం విషయం సుధీర్‌కి అదే గ్రామానికి చెందిన మరో నలుగురు వ్యక్తులు సుధీర్ పై తరచూ అసత్య ప్రచారం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బెదిరింపులకు పాల్పడిన వారి పేర్లను సూసైడ్ నోట్లో రాసి మరి సుధీర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నా చావుకు కారణం వీరేనని సూసైడ్ లేఖలో రాశాడు. దీంతో మృతుని తండ్రి లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తము కొత్తగూడెం లోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ఈ సంఘటనపై లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుధీర్

## సర్వేయర్లతో భూ సమస్యలకు పరిష్కారం

**ప్రజాపక్షం/కల్లూరు :** సర్వేయర్లతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ పులి సాంబశివుడు, సర్వేయర్ యాకూబిలు తెలిపారు. కల్లూరులోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతిని తీసుకొచ్చిందని, మండలంలో 20 మంది సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గ్రామాల్లో ఉదాహరణగా ఉన్న కొన్ని పెండింగ్ భూ సమస్యలు సరిహద్దులు వివరాల సర్వేలను వారికి వస్తున్న సమస్యలు సర్వేలో వస్తున్న ఇబ్బందులు క్లిష్టపరంగా ఉన్న సమస్యలను పరిష్కారమయ్యే విధంగా శిక్షణను కల్లూరులోని కొన్ని గ్రామాల కు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఐకెపి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
రైతులు భూభారతిలో పెట్టుకున్న దరఖాస్తులను వారి సమస్యలను పరిష్కరించేందుకు ఈ శిక్షణ కార్యక్రమంలో నూతన సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 40 రోజులు పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని కల్లూరు మండలంలో నిర్వహించి పలు గ్రామాలలో ఉన్న కొన్ని సమస్యలు పరిష్కారంగా వారికి అర్థమయ్యే విధంగా సర్వేయర్ శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

## మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిద్దాం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆదినారాయణ పిలుపు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** దేశంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని, కులం, మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టి మోదీ ప్రయత్నాలను ఎండగడుతూ రానున్న ఎన్నికల్లో బిజెపి ఓటమే లక్ష్యంగా పనిచేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర మహాసభలు 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో నిర్వహించారు. ఈ మహాసభలకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులందరు హాజరయ్యారు. సత్తుపల్లి నుండి ప్రతినిధిగా దండు హాజరయ్యారు. మహాసభలకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపి అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాగం హేమంతరావులు పాల్గొన్నారు. ఈ మహాసభలకు సత్తుపల్లి నియోజకవర్గం నుండి నిమ్మటూరు రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా నాయకులు షేక్ రంజాన్ బి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నట్లు దండు ఆదినారాయణ తెలిపారు.




## చలో హైదరాబాద్ గోడప్రతుల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పిఆర్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నా గోడ ప్రతులను ఆవిష్కరించారు. శుక్రవారం పిఆర్‌టియు రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహాధర్నా గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినం పురస్కరించుకుని హైదరాబాద్‌లో పిఆర్‌టియు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లెల వెంకటేశ్వరరావు, పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌హెచ్ రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర సోమ్లా, లింగం సతీష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం కేశవరావు, తూమాటి సైదుబాబు, జిల్లా బాధ్యులు వినోద్, నర్సయ్య, ఆంజనేయులు, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శాంతిస్తున్న గోదావరి



కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం వద్ద గోదావరి శాంతిస్తోంది. శుక్రవారం రాత్రి కడపటి వార్తలు అందే సమయానికి 43.09 అడుగుల వద్దకు చేరింది. గురువారం రాత్రి 51.07 అడుగులకు చేరుకున్న నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు 47.09 అడుగులకు దిగువకు వరద నీరు చేరుకోవటంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతితో పాటు ఎగువన ప్రాజెక్టులు, వాగులు, వంకలు తాలిపేరు నుండి దిగువకు నీరు విడుదల కాకపోవటంతో వరద తాకిడి ప్రమాదం తప్పింది. అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. శనివారం నాటికి మరికొంత వరకు తగ్గి మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు దిగువకు ప్రవహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర జలవనరుల సంఘం అధికారులు తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

ఖమ్మం సిపి సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** శాంతియుతవాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. కమిషరేట్ పరిధిలో గణేష్‌మండపాల నిర్వహణకోసం పోలీసుశాఖ రూపొందించిన పోర్టల్‌లో ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఉత్సవకమిటీలు, నిర్వహకులకు సుచించారు. అవసరమైన చోట కమిటీ అభ్యర్థన మేరకు మండపాలవద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీసుల అనుమతి పొందిన తరువాతే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతిలేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే సదరు నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిబంధనలు, ధరఖాస్తూ విదానం తదితర పూర్తి వివరాల కోసం https:// policeportal.tspolice.gov.in/ను పరిశీలించాలన్నారు.

**పాటించవలసిన నిబంధనలు :**

విగ్రహా ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే సంబంధిత వ్యక్తుల నుంచి నోఅబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాలి.

మండపాల నిర్వహణకు అవసరమైన విద్యుత్‌కోసం ఆశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవవించకుండా ఉండేందుకు నాణ్యమైన విద్యుత్ తీగలు, పరికరాలు ఉపయోగించాలి.

ప్రజారవాణ, అత్యవస వాహనాలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మండపం ఏర్పాటు చేసుకోవాలి.

పశువులు, కోతులు తదితర జీవాలు మండపాల వద్దకు రాకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలి.

ఉత్సవ కమిటీ, నిర్వాహకుల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు మండపాల్లో పొందపరచాలి.

# సామాజిక, వ్యక్తిగత ఆస్తులను సృష్టించాలి

ఉపాధి హామీ పని చట్టరీత్యా కల్పించిన హక్కు

పనుల జాతరను ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఉపాధి హామీ పనుల కింద సమాజానికి, వ్యక్తులకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యటించి పనుల జాతర 2025 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధి హామీ కింద మూడు లక్షల వ్యయంతో లబ్ధిదారు అంగడాల నాగమణికి చెందిన పౌల్ట్రీషెడ్, లక్ష రూపాయల వ్యయంతో లబ్ధిదారుడు కేతినేని ద్రౌపదికి చెందిన క్యాటిల్ షెడ్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఎంత మేర వ్యవసాయ భూమి ఉన్నది, ఏఏ పంటలు పండిస్తున్నది, రైతు భరోసా ఖాతాలో జమ అయిన వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంతో పాటు పశు సంపదను పెంచితే అదనపు ఆదాయంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కలెక్టర్ తెలిపారు. అనంతరం బూడిదంపాడు గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులలో పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపనలు, పనుల జాతర 2025 కార్యక్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పూర్తయిన పౌల్ట్రీ, క్యాటిల్ షెడ్లకు ప్రారంభోత్సవం చేశామన్నారు. ఉపాధి హామీ అనేది పని కల్పనకు చట్టరీత్యా ఉన్న హక్కు అని కలెక్టర్ తెలిపారు. ఇంతకు ముందు పూడికతీత తదితర పనులు ఉపాధి హామీ ద్వారా చేపట్టేవారని కాల క్రమేణ సమాజానికి గ్రామస్తులందరికీ ఉపయోగపడే పనులు చేపడుతున్నామన్నారు. ప్లాంటేషన్, పామాయిల్ తోటల పెంపకం, సామాజిక, వ్యక్తిగత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా 262 రకాల పనులు పూర్తి ఉచితంగా పూర్తి చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, ప్లాంటేషన్, తోటల పెంపకం, రహదారులు, పౌల్ట్రీ, గేదెలు, మేకలు, గొర్రెల షెడ్లు, సామాజిక, వ్యక్తిగత ఆస్తుల కల్పన తదితరాలు ఉన్నాయన్నారు. మెటీరియల్, వెజ్ కాంపోనెంట్‌ల ద్వారా వంద రోజుల పని కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం రూ. 67 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామానికి సంబంధించిన అవసరమైన పనులు గ్రామసభ తీర్మానంతో చేపడతామన్నారు. గ్రామసభలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో బూడిదంపాడు గ్రామం ఆదర్శంగా నిలవాలని చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వంద రోజుల ఉపాధి హామీ పని పూర్తి చేసిన వారిని, దివ్యాంగ ఉపాధి హామీ కూలీ పేరం రమాదేవిని ఈ సందర్భంగా కలెక్టర్ సన్మానించారు. పౌల్ట్రీ, క్యాటిల్ షెడ్ల లబ్ధిదారులు అంగడాల నాగమణి, కేతినేని ద్రౌపదిలకు యూనిట్‌కు సంబంధించిన చెక్కులను కలెక్టర్ అందజేశారు. గ్రామంలో సమస్యలు, పారిశుధ్యం గురించి సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ ఎన్.సన్యాసయ్య, డిఎల్‌పివో రాంబాబు, ఎంపిడిఒ అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, ఎంపిఒ శ్రీనివాసరెడ్డి, ఎపిఒ పద్మయ్య నాయుడు, ఆత్మ కమిటి చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులు కొనుగోలు

బీమా సౌకర్యం కల్పించాలి

పాడి పశువుల కొనుగోలుపై అదనపు కలెక్టర్ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులను కొనుగోలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ పాడి పశువుల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ప్రస్తుతం మొదటి విడతలో 125 మంది సభ్యులకు రెండు పశువుల చొప్పున పాడి పశువులను కొనుగోలు చేస్తున్నామన్నారు. పాడి పశువుల కొనుగోలు కోసం కొనుగోలు కమిటీ లబ్ధిదారులతో కలిసి వెళ్లాలని, అక్కడ రెండు నుంచి మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉన్నందున వసతి కోసం ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. పాడి పశువులను ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నాం, ఎంతకు కొనుగోలు చేస్తాం, రవాణాకు అయ్యే ఖర్చు, బీమా వంటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ఒక్కో లబ్ధిదారునికి రెండు పాడి పశువుల చొప్పున పంపిణీ చేయాలని, దీనికి అనుగుణంగా పాడి పశువుల కొనుగోలు ప్రాంతాలను గుర్తించాలన్నారు. జిల్లాలో ఉన్న వాతావరణానికి అలవాటు పడే పశువులను కొనుగోలు చేయాలని,పాడి పశువుల కొనుగోలులో నిర్దేశిత నిబంధనలను అధికారులు తూచ తప్పకుండా పాటించాలన్నారు. రవాణా కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ సన్యాసయ్య, ఇడి ఎస్‌సి కార్పొరేషన్ కె.నవీన్ బాబు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖాధికారులు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మణుగూరు :** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం మణుగూరులోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల, తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్, బాలుర పాఠశాల, వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ తనిఖీ సమయంలో విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించి, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, త్రాగునీరు, మంచం, దుప్పట్లు, స్నానాల గదులు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థుల చదువుపై ఆసక్తి, ఉపాధ్యాయుల బోధన నాణ్యత, అభ్యాస స్థాయి పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ప్రభుత్వమందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠ్యబోధనతో పాటు పోటీ పరీక్షల శిక్షణను కూడా అందించాలని ఆయన గైడ్ చేశారు. భోజనశాల పరిశీలనలో,ఆహార పదార్థాల నిల్వ, వంటశాల శుభ్రత, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను కలెక్టర్ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. తాజా పదార్థాలతోనే వంట చేయాలని, ఆహారం పోషకాహారంతోనూ, రుచికరంగానూ ఉండేలా జాగ్రత్త పడాలని సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదు అని, వసతి, భోజనం, శుభ్రత, భద్రతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి అని ఆదేశించారు. విద్యార్థులు పుస్తకాలతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ప్రతిభ కనబరచేలా అవకాశాలు కల్పించాలి అన్నారు. పాఠశాలల నెలకొన్న సమస్యలపై నివేదికలు అందించాలని తక్షణమే పరిష్కారం చూద్దామని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ తెలిపారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్, 22వ డివిజన్‌లకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పట్టాలను ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ కమర్తపు మురళిలు పంపిణీ చేశారు. యుగంధర్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామన్నారు. విడతల వారీగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా అశోక్, టి. కృష్ణమోహన్, పర్వత శ్రీను, కె.రమేష్, ఝాన్సీ, లక్ష్మీనారాయణ, చింతల ఉపేందర్, ఫరీద్ ఖాదర్, రమాదేవి, సాయి, కోటంరాజు, పుల్లయ్య, నరేష్, బిక్షం, రామారావు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మధిర, చిలుకూరు, దెందుకూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క చొరవతో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. మండల కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, బిసిసెల్ మండల అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పాటిబండ్ల సత్యంబాబు, షేక్.జహంగీర్, తలుపుల వెంకటేశ్వర్లు, బండారు నర్సింహారావు పాల్గొన్నారు.

# యూరియా కొరతకు ప్రధాని మోదీనే బాధ్యత

ఎస్‌కెఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రధాని మోదీ అనాలోచిత నిర్ణయం వల్ల దేశంలో యూరియా కొరత ఏర్పడిందని దానికి ప్రధాని మోడీయే బాధ్యత వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అగ్రి, హార్టికల్చర్ సొసైటీ ప్రధాన సలహాదారుడు నల్లమల వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రైతులు అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, యూరి యా వాడకాన్ని తగ్గించాలని కోరుతూ ప్రధాని మోడీ కేవలం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారన్నారు. రైతులకు యూరియా వాడకం పట్ల ఎలాంటి అవగాహన కల్పించకుండా రాష్ట్రాలకు కేటాయించిన కేటాయింపుల్లో 30 శాతం తగ్గించి సరఫరా చేయడం వల్లే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని దీనితో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తూ రైతులకు అండగా నిలవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో రుతుపవనాలు ముందుగా రావడం వల్ల రైతులు సాగును కూడా ముందుగానే ప్రారంభించడం జరిగిందన్నారు. వర్షాలు కూడా సమృద్ధిగా కురవడంతో యూరియా వినియోగం కూడా అధికంగా ఉందన్నారు. యూరియా కొరతను సాకుగా చూపి రాజకీయ ప్రయోజనాలకు రైతులను వాడుకునే ప్రయత్నం చేస్తూ రైతులను మరింత ఆందోళనకు గురి చేయవద్దన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మన రాష్ట్రానికి కేటాయించిన యూరియాను తెప్పించేందుకు ఢిల్లీలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎంపిలకు మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు మద్దతు తెలిపి రాష్ట్రానికి 62వేల టన్నుల యూరియాను సరఫరా చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# ఖమ్మం రూరల్‌లో 'రేషన్ బియ్యం' దందా!

ఆంధ్ర నుంచి అక్రమ పద్ధతిలో రవాణా

ఇక్కడ రీస్లైక్లింగై తెల్లారేసరికి తరలింపు

మామూళ్ల మత్తులో.. అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఓ రైస్‌మిల్‌లో అక్రమ భాగోతాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. నిర్వాసితుల సాక్షిగా...వెలుగులోకి వచ్చిన వ్యవహారాలు నిర్వాహకుడి దోపిడీ పర్వానికి అద్దం పడుతున్నాయి.మూడు నెలలుగా రైస్‌మిల్ మూతబడిందని చేసుకుంటున్న ప్రచారం తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని వెనుక భారీ స్కెచ్ వేసి ఆంధ్రా నుంచి రాత్రిపూట రేషన్ బియ్యం ఇక్కడకు అక్రమ పద్ధతిలో రవాణా చేసుకొని, రీస్లైక్లింగ్ చేసి తెల్లారేసరికి తరలింపైతున్నట్లు సమాచారం. ఇదే రైస్‌మిల్‌లో గతంలో పెద్ద ఎత్తున్న రేషన్ బియ్యం సైతం లభ్యమైన ఉదాంతం సైతం ఉంది.

**రైస్‌మిల్ మాటున అక్రమ దందా...**

రైస్‌మిల్ ఏర్పాటు నుంచి సదరు నిర్వాహకుడు అక్రమ దందాలకు తెరలేపినట్లు తెలిసింది. ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేస్తున్నాననే పేరుతో రేషన్ బియ్యం దందాకు పాల్పడినట్లు తెలిసింది. డీలర్ల ద్వారా రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని, వాటిని సంచుల్లో నింపి తిరిగి ప్రభుత్వానికి ఎక్కువరేటుకు ఇచ్చి లక్షలాది రూపాయలు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి. తన అడుగులకు మడుగులొత్తే పౌరసరఫరాతో పాటు ఇతర అధికారులను మచ్చిక చేసుకుని నడిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బేరగాళ్ల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి, వాటిని రీస్లైక్లింగ్ చేసి, షాపులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు వినికిడి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తుండటంతో తన రేషన్ దందాను ఆంధ్రా నుంచి చేస్తున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వినపడుతున్నాయి. ఆయనకు వత్తాసుగా కొందరు బేరగాళ్లు సాఫీగా పని జరిగేలా సహకరించాలని, కొందరిని కోరడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇక్కడకు వచ్చిన బియ్యాన్ని అక్రమ పద్ధతిలో రవాణా చేసుకుని, రీస్లైక్లింగ్ చేసి తెల్లారేసరికి తరలిస్తున్నట్లు తెలిసింది.

**చోద్యం చూస్తున్న అధి-కారులు...**

రైస్‌మిల్లులు, రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నామ మాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. ఒక వేళ తనిఖీ చేసినా పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రైస్‌మిల్లు కేంద్రంగా ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. పౌరసరఫరాలో ఓ అధికారి కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తనకు కావాల్సిన నెలవారిని పుచ్చుకుంటూ పేదల బియ్యం పక్కదారి పట్టించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీనిపై సైతం ఉన్నతస్థాయి అధికారులు పరిశీలన చేయడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ తతంగంపై అధికారులు ఇప్పటికైన తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## మధిర ప్రెస్‌క్లబ్‌కు నూతన కమిటీ

**ప్రజాపక్షం/ మధిర :** మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక స్థానిక సీతార హోటల్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పార్శపు అరుణ్‌కుమార్‌ను ఎన్నుకోగా గౌరవాధ్యక్షులుగా నాళ్లశ్రీనివాసరావు, గౌరవ సలహాదారునిగా శ్రీరామోజు యోగేష్, ఉపాధ్యక్షులుగా వంగూరి గోపి, కోశాధికారిగా కాకరపర్తి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా ఎ.అర్జున్, వి.శ్రీనివాసరావు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు, చారుగుండ్ల నరర్సింహామూర్తి, సుధీర్‌ను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పార్శపు అరుణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మధిరలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంతవరకు ఇండ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వలేదని, ఇప్పటికైనా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, మధిరలో ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ కమిటీ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడ

# వరల్డ్ కప్‌లో ఆడటం ఖాయం!

## మహిళల వన్డే వరల్డ్ కప్ కొత్త షెడ్యూల్ రిలీజ్



మహిళల వన్డే వరల్డ్ కప్‌కు చెందిన కొత్త షెడ్యూల్‌ను శుక్రవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి రిలీజ్ చేసింది. బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియం అందుబాటులో లేని కారణంగా.. అక్కడ జరిగే మ్యాచ్‌లను నవీ ముంబై స్టేడియానికి మార్చేశారు. దీంతో జరిగిన మ్యాచ్‌ల షెడ్యూల్ మార్పును శుక్రవారం ప్రకటించారు. సెప్టెంబర్‌లో ప్రారంభం అయ్యే వన్డే వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను ఇండియా, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో మొత్తం ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. దీంట్లో మూడు లీగ్ మ్యాచ్‌లు, ఓ సెమీ ఫైనల్, ఆ తర్వాత నవంబర్ 2వ తేదీన ఫైనల్ మ్యాచ్ కూడా జరగనున్నది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు జరిగే టోర్నీ తేదీల్లో మార్పు లేదు. కానీ వేదికలు, మ్యాచ్‌ల తేదీలను మాత్రం మార్చేశారు. గౌహతిలోని ఏసీఏ స్టేడియం, ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం, విశాఖపట్టణంలోని వీడీసీఏ స్టేడియం, కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో మహిళా వరల్డ్ కప్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్‌కు నవీ ముంబై వేదిక ఆదర్శవంతంగా ఉంటుందని ఐసీసీ చైర్మన్ జేషా తెలిపారు. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను నవంబర్ 2వ తేదీన కొలంబో లేదా నవీ ముంబైలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. తొలి సెమీస్‌ను గౌహతి లేదా కొలంబో, రెండో సెమీస్‌ను నవీ ముంబైలో నిర్వహించనున్నారు. ఫస్ట్ సెమీస్ అక్టోబర్ 29, రెండో సెమీస్‌ను అక్టోబర్ 30న నిర్వహించనున్నారు.

### సూపర్ ఫిట్‌గా కోహ్లీ, రోహిత్..



టీమిండియా స్టార్ ద్వయంగా పేరొందిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్లీ బ్లూ జెర్సీతో మైదానంలోకి దిగితే చూడాలనుకుంటున్నారు అభిమానులు. టీ20, టెస్టులు.. ఈ రెండు ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ వన్డేల్లో చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. అయినా సరే ఈ ఇద్దరికీ వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో చోటు దక్కడంపై సందేహాలు వెలిబుచ్చుతున్నారు కొందరు. కుర్రాళ్లు దూసుకొస్తున్న వేళ్ళల్లో మెగా టోర్నీలో 'రోకో'కు ఛాన్స్ కష్టమే అని మాజీలు సైతం అభిప్రాయ పడుతున్నారు. కానీ.. అనుభవజ్ఞులైన కోహ్లీ, హిట్‌మ్యాన్ వరల్డ్ కప్‌లో ఆడితే టీమిండియాకు తిరుగుండదని అంటున్నారు రాస్ టేలర్. 'కోహ్లీ, రోహిత్‌లను చూడండి.. ఇప్పటికీ చాలా ఫిట్‌గా ఉన్నారు. వయసు పైబడుతున్నా తమ బ్యాటింగ్ పవర్ చూపిస్తూ పరుగులు సాధిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో రికార్డుల బద్దలు కొట్టిన ఈ ఇద్దరు ఇంకా ఏం కోరుకుంటున్నారో వాళ్లకు మాత్రమే తెలుసు. ఇద్దరూ తండ్రులయ్యారు. క్రికెట్ కోసం కుటుంబం, పిల్లలకు చాలారోజులు దూరంగా ఉంటున్నారు. ఆటపట్ల వాళ్లకున్న చిత్తశుద్ధి ప్రపంచానికి తెలుసు. భారత క్రికెట్‌కు కూడా విరాట్, రోహిత్ చాల సేవ చేశారు. అందుకే ఈ దిగ్గజ ఆటగాళ్లు 2027 వన్డే వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉండాలని కోరుకుంటున్నా' అని న్యూజిలాండ్ వెటరన్ వెల్లడించాడు.

**ఏడాది వరకూ ఫిట్‌గా ఉంటారా?**

నిరుడు పొట్టి వరల్డ్ కప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకమైన రోహిత్, కోహ్లీలు సంయుక్తంగా వన్డే వరల్డ్ కప్ మాత్రం గెలవలేదు. 2011లో వన్డే వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో కోహ్లీ సభ్యుడు కాగా.. రోహిత్ మాత్రం మిస్ అయ్యాడు. రెండేళ్ల క్రితం అతడి సారథ్యంలో భారత్ ఫైనల్ చేరినా ట్రోఫీని అందుకోలేకపోయింది. ఆస్ట్రేలియా బౌల్డ్ విజృంభణతో ఆదిలో తడబడిన రోహిత్ సేన భారీ స్కోర్ చేసినా.. ట్రావిస్ హెడ్ మెరుపు సెంచరీతో ఆసీస్ ఆరోసారి విశ్వ విజేతగా నిలిచింది. సో.. 2027లో వన్డే ప్రపంచ కప్‌తో కెరీర్ ముగించే ఆలోచనతో ఉన్నారిద్దరూ. కానీ.. మరో ఏడాది వరకూ ఫిట్‌గా ఉంటారా? సెలెక్టర్లు వీళ్లకు చాన్స్ ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

## సెలక్షన్ కమిటీలోకి కొత్త సభ్యులు.. దరఖాస్తులు ఆహ్వానించిన బిసిసిఐ!

భారత క్రికెట్ నియంత్రణ మండలి శుక్రవారం మెన్స్, వుమెన్స్ జాతీయ సెలక్షన్ కమిటీల్లోని ఖాళీగా ఉన్న సభ్యుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. సీనియర్ పురుషుల సెలక్షన్ కమిటీలో ఇద్దరు సభ్యులు, మహిళల సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులను భర్తీ చేయనున్నది. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని బిసిసిఐ కోరింది. గతంలో ఉన్న అర్హత ప్రమాణాలు ఉంటాయని బీసీసీఐ స్పష్టం చేసింది. కనీసం ఏడు టెస్టు మ్యాచ్‌లు.. లేకపోతే 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడిన అనుభవం ఉండాలని పేర్కొంది. ప్రత్యామ్నాయంగా కనీసం పది వన్డే ఇంటర్నేషనల్స్, లేకపోతే 20 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎంపికైన సెలక్టర్ల ఒప్పందం ప్రతి సంవత్సరం పునరుద్ధరించనున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఉన్న సెలెక్టర్లలో ఎవరిని భర్తీ చేయాలో ఇంకా నిర్ణయించలేదని.. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఓ బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ఇటీవల ఆసియా కప్ కోసం జట్టును ఎంపిక చేసిన ప్రస్తుత పురుషుల సెలక్షన్ కమిటీకి మాజీ ఫాస్ట్ బౌలర్ అజిత్ అగార్కర్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయనతో పాటు కమిటీలో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్ శరత్ సభ్యులుగా ఉన్నారు. అలాగే, పురుషుల జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో ఒక సభ్యుడి కోసం బిసిసిఐ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ కమిటీ అండర్22 వరకు వయస్సు గల జట్లకు క్యాంపులు, పర్యటనలు, టోర్నమెంట్లను టీమ్‌ను ఎంపిక చేస్తుంది. మహిళల జాతీయ సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రస్తుత మహిళా ప్యానెల్‌కు నీతు డేవిడ్ నేతృత్వం వహిస్తున్నారు. ఆమెతో పాటు రేణు మార్గరెట్, ఆర్తి వైద్య, కల్పనా వెంకటాచర్, శ్యామా డీ షా ఉన్నారు. ఈ కమిటీ ఇటీవల స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ కోసం భారత మహిళా జట్టును కూడా ఎంపిక చేసింది. అయితే, ఇటీవల పలు నివేదికలు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలని బిసిసిఐ నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. భారత జట్టు సాధించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది.

# సైన్స్ ఫోకస్



## జీనోమిక్ పరిశోధనలో విప్లవాత్మక ఆవిష్కారం

బార్సిలోనాలోని సెంటర్ ఫర్ జీనోమిక్ రెగ్యులేషన్ (సిఆర్‌జి) సహా అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ఇటీవల భారీ మానవ జీనోమ్ రీఃరెడింగ్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి 1,67,000కి పైగా కొత్త జన్యు భిన్నాలను గుర్తించింది. 'నేచర్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయన వ్యాసం ప్రకారం, ఇప్పటివరకు తెలిసిన నిర్మాణాత్మక భిన్నాల సంఖ్య దాదాపుగా రెట్టింపైంది. డిఎన్ఎలో తొలగింపులు, నకిలీలు, చొప్పింపులు, తలకిందులు కావడం వంటి మార్పులు లక్షల కొద్దీ జెనెటిక్ అక్షరాలను ప్రభావితం చేస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. 1,019 మందికి చెందిన జన్యు నమూనాల పరిశీలనలో, వ్యక్తుల మధ్య డిఎన్ఎలో సగటు 7.5 మిలియన్ తేడాలు బయటపడ్డాయి. ప్రకృతి తనకు తానే ఎంత విస్తృతమైన జన్యు మార్పులు చేస్తుందో ఈ అధ్యయనం నిరూపిస్తున్నదని పరిశోధకులు అన్నారు. ఈ కొత్త పాన్జీనోమ్ ద్వారా వ్యక్తిగత వైద్యపద్ధతులు, అరుదైన జన్యు వ్యాధుల నిర్ధారణ, కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలకు చికిత్సా పరిశోధన మరింత ఖచ్చితంగా చేసుకునే అవకాశం కలుగుతుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రామాణిక మానవ జీనోమ్‌గా ఒక్క వ్యక్తి డిఎన్ఎ శ్రేణినే అధ్యయనం చేసేవారు. అయితే ఇది ప్రపంచవ్యాప్త జనాభా వైవిధ్యాన్ని ప్రతిబింబించలేదు. ఈ లోటును అధిగమించేందుకు తాజా మానవ పాన్జీనోమ్ ప్రాజెక్ట్ ముందుకు వచ్చింది. ఈ పరిశోధన 1,67,000 కొత్త నిర్మాణాత్మక భిన్నాలను గుర్తించింది. ఇప్పటి వరకు యూరోపియన్ మూలాల జన్యు నమూనాలుకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల నిర్లక్ష్యానికి గురైన ఇతర జనాభాల్లో గణనీయమైన దాగి ఉన్న వైవిధ్యం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విభాగంలో ప్రధాన కదలిక లాంగ్ రీడ్ సీక్వెన్సింగ్ వాడకంలో ఉంది. ఇది వేల నుండి లక్షల్లో డిఎన్ఎ అక్షరాలను ఒకేసారి చదివే సాంకేతికత, దీని ద్వారా పెద్ద డిఎన్ఎ మార్పులను ఖచ్చితంగా గుర్తించే అవకాశం లభించింది. దీని వల్ల అరుదైన జన్యు వ్యాధులను తక్కువ సమయంలో గుర్తించడం సాధ్యమవుతుంది. అనుమానిత మ్యూటేషన్ల సంఖ్యను వేలలో నుంచి వందల్లోకి తగ్గించే అవకాశం ఉంటుంది. కేన్సర్‌సహా అనేక వ్యాధుల నిర్ధారణలో వేగవంతమైన ఖచ్చితత్వం సాధించడం కూడా ఈ ప్రయోగ లక్ష్యాల్లో ఒకటి. సమగ్రంగా చూస్తే, ఈ పాన్జీనోమ్ పరిశోధనను జన్యు శాస్త్రంలోని అత్యంత విప్లవాత్మక దశగా పేర్కోవచ్చు. ఇది వైద్యరంగంలో వ్యక్తిగతీకరించిన చికిత్సలకు దారితీసే ప్రపంచ వ్యాప్త జీనోమ్ పటంగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఐస్ కోర్స్‌పై విస్తృత అధ్యయనం




అంటార్కిటికాలో సేకరించిన ఐస్‌కోర్స్ (ఐస్‌తో నిండిన ప్రాంతాల్లో లోతుగా తవ్వి, అక్కడి నుంచి సేకరించిన నమూనాలు)ను విస్తృతంగా అధ్యయనం చేస్తున్నారు. బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే తాజా ప్రకటనను అనుసరించి, అంటార్కిటికాలో 1.5 మిలియన్ సంవత్సరాల పురాతన ఐస్ కోర్స్‌ను తీసుకొని యుకెకి పంపారు. ఈ ఐస్ కోర్స్‌లను లిటిల్ డోమ్ 'సి' ప్రాంతం నుండి 2,800 మీటర్ల లోతులో డ్రిలింగ్ ద్వారా సేకరించారు. ఈ ప్రాచీన ఐస్ కోర్స్‌లో భవిష్యత్తు వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడానికి అనువుగా ఉన్న అత్యంత పురాతన వాతావరణ సమాచారాన్ని పొందగలిగే అవకాశం ఉంది. వీటిని శాస్త్రీయ విధానంలో కరగబెట్టి చేసి, ఆ సమయంలో వాతావరణంలో ఉన్న గ్యాసులు, వాయువులు, మైక్రోస్కోపిక్ సముద్ర అల్గేల ద్రవ్యాలు తదితర వివరాలను ల్యాబ్‌లలో విశ్లేషిస్తారు. ఈ డేటా 1.5 మిలియన్ సంవత్సరాల కాలవ్యవధిలో వాతావరణం ఎలా మారిందో, గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయి ఎలా ఉన్నదో చెప్పగలుగుతుంది. ఇలాంటి శాఖల సహాయంతో గ్లోబల్ క్లైమెట్ మార్పుల తీరుతెన్నులను వాటి సంభవానికి ముందుగానే అర్థం చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాల్లో ఇది ముందడుగుగా బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే పేర్కొంది. ముఖ్యంగా, సుమారు 1 మిలియన్ సంవత్సరాల క్రితం గ్లేషియల్‌ఇంటర్‌గ్లేషియల్ ఆవృతిలో జరిగిన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా అనేకానేక పర్యావరణ సమస్యలకు పరిష్కారం కనుగొనే అవకాశాలు ఉన్నాయి. 41,000 సంవత్సరాల సైకిల్ నుండి 100,000 సంవత్సరాల సైకిల్‌కు గ్లేషియల్ ఇంటర్‌గ్లేషియల్ ఆవృతులు మారాయన్న ప్రధాన శాస్త్రీయ ప్రశ్నకు సమాధానం కనిపించవచ్చని భావిస్తున్నారు. ఈ పురాతన ఐస్ కోర్స్ ద్వారా భూగోళ వాతావరణ సమాచారంలో అనేక విప్లవాత్మక వివరాలు వెలుగులోకి రానున్నాయి. ఇవి భవిష్యత్ వాతావరణ మార్పులను అంచనా వేయడంలో కీలకం అవుతాయి.



# రీల్

## 'భద్రకాళి' నుంచి లవ్ సాంగ్ రిలీజ్



విజయ్ ఆంటోనీ మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి' వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ మారెనా ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. విజయ్ ఆంటోని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన లిరిక్స్ హత్తుకునేలా వున్నాయి. అభిజిత్ అనిల్‌కుమార్ వోకల్స్ మరింత ఎమోషన్ ని యాడ్ చేశాయి. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది.

## మిస్టర్ రోమియో టీజర్ విడుదల

శ్రీలక్ష్మి ఆర్ట్స్, మీడియా 9 క్రియేషన్స్ బ్యానర్ పై నేతి శ్యామ్ సుందర్ నిర్మాతగా మనోజ్ కుమార్ కటోకర్ దర్శకత్వం వహించిన మ్యూజికల్ ఫిలిం మిస్టర్ రోమియో. ఏ రీల్ లైఫ్ స్టోరీ అనే ట్యాగ్ లైన్ తో రూపొందించారు. గురు చరణ్ నేతి, జుహీ భట్, అమిషి రాఘవ్ హీరో హీరోయిన్స్‌గా నటించారు. ఎస్‌కే ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్ పురోహిత్ ముఖ్య పాత్రల్లో నటించారు. చైతన్య గరికిన స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. ప్రజ్వల్ క్రిష్ సంగీతం సమకూర్చారు. ఈ మూవీ టీజర్ రిలీజ్ చేసిన హీరోయిన్ శ్రియా శరణ్ టీమ్ కు బెస్ట్ విషెస్ చెప్పారు. టీజర్ చాలా బాగుంది. మూవీ కూడా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గురు చరణ్ అద్భుతంగా నటించారు. తనలో మంచి నటుడు ఉన్నాడు. టీజర్ లో కార్తీక్‌గా కనిపించిన చరణ్ నటన బాగుంది. 'నాకు రియల్ లవ్ కావాలి. రీల్స్ లవ్ కాదు' అని చరణ్ చెప్పే డైలాగ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. హీరోగా తను మరిన్ని సినిమాలు తీయాలని కోరుతూ ఆల్ ది బెస్ట్. డైరెక్టర్ అని శ్రియా చెప్పారు.





## సమంత సరికొత్త అవతారం..



టాలీవుడ్, కోలీవుడ్ పరిశ్రమల్లో స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటిన సమంత ఇప్పుడు మరో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతుందని టాక్. ఇప్పటికే నటిగా తన టాలెంట్ నిరూపించుకున్న సమంత, తాజాగా దర్శకురాలిగా మారే ఆలోచనలో ఉన్నారు అనే వార్తలు సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. సమంత ప్రస్తుతం ఓ క్యూట్ లవ్ స్టోరీ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసిందని, కథకు తానే డైరెక్షన్ వహించాలనుకుంటోందని సమాచారం. ఇప్పటికే కొన్ని యంగ్ అప్‌కమింగ్ ఆర్టిస్టులతో డిస్కషన్స్ జరిపిందని టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కూడా తన సొంత బ్యానర్‌లోనే నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు టాక్ ఇప్పటికే సమంత 'శుభం' అనే హర్రర్‌కామెడీ సినిమాతో ప్రొడ్యూసర్‌గా అడుగుపెట్టి, తన కెరీర్‌లో ఓ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు డైరెక్షన్ వైపు అడుగులేస్తోంది అంటే, నటనతో పాటు ఫిల్మ్‌మేకింగ్‌పై ఉన్న ఆమె ప్యాషన్ స్పష్టంగా తెలుస్తోంది. 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్', 'హనీ బన్నీ' వంటి ఇంటర్నేషనల్ ప్రాజెక్టుల్లో సమంత నటనతో ఆకట్టుకుంది. యాక్షన్ రోల్స్‌లో తన స్థాయిని పెంచుకున్న సమంత, ఇప్పుడు దర్శకురాలిగా ఎలాంటి నూతన కోణాన్ని చూపిస్తుందో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కానీ సమంత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఆమె అభిమానులు మాత్రం ఈ వార్తలపై ఉత్సాహంగా స్పందిస్తున్నారు. డైరెక్టర్ సమంత ఏ విధంగా తన టాలెంట్‌ను చూపుతుందో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నటిగా, నిర్మాతగా, ఇప్పుడు దర్శకురాలిగా కూడా సమంత తన టాలెంట్‌ను పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోందంటే ఆమె కెరీర్ మరో కీలక మలుపు తిరగబోతోందన్నమాట . మరి ఇది గాసిపో, నిజమా అనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది. మరోవైపు సమంతా రక్త్ బ్రహ్మాండ అనే వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. రాజ్ అండ్ డికె పర్యవేక్షణలో ఇది రూపొందుతుండగా , ఏవో ఆర్థిక కారణాల వల్ల ఆగిపోయిందనే ప్రచారం జరిగింది కానీ అలాంటిదేమి లేదని ఇటీవలే ప్రొడ్యూసర్లు క్లారిటీ ఇచ్చారు. అయితే షూట్ తిరిగి మొదలయ్యింది లేనిది అనే దానిపై క్లారిటీ లేదు. మరో వైపు మా ఇంటి బంగారం అనే సినిమాని సామ్ గతంలోనే ప్రకటించింది. దీనికి నందినిరెడ్డి దర్శకత్వం వహించే ఛాన్స్ ఉంది.

## ఆయనతో నటించడం అదృష్టంగా భావిస్తా.. ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. జాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ ఒక వ్యక్తి కాదు ఓ శక్తి. ఆయన ఒరిజినల్‌గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్యబోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, 'బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం'' అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ''ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్యబోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, 'విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

## 'మన శంకరవరప్రసాద్ గారు' గ్లింప్స్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి, దర్శకత్వంలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మాతలుగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ మూవీకి 'మన శంకరవరప్రసాద్ గారు', అనే టైటిల్ ఖరారు చేశారు. చిరంజీవి జన్మదినం సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. చిరంజీవి కెరీర్‌లో ఇది 157వ సినిమా. ఈ చిత్రానికి 'మన శంకరవరప్రసాద్ గారు' అనే టైటిల్ పెట్టి 'పండగకి వస్తున్నారు' అనేది ట్యాగ్‌లైన్ పెట్టారు. చిరంజీవి కారులో పవర్ ఫుల్ ఎంట్రీ ఇస్తూ, సిగరెట్ వెలిగిస్తూ, తన ట్రేడ్ మార్క్ స్వాగ్‌లో కమాండోల పక్కన నడుస్తుండగా గ్లింప్స్ ప్రారంభమవుతుంది. సిగరెట్ విసిరేస్తున్నప్పుడు టైటిల్ రివిల్ అవుతుంది. విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్ ఫ్యాన్స్‌ని మరింత సర్ ప్రైజ్ చేసింది. డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిరంజీవి ఎవర్ గ్రీన్ చరిస్మాని, స్టయిల్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ మెగా చరిస్మా అదిరిపోయింది. చివర్లో వచ్చే గుర్రం సీన్ అయితే మైండ్‌బ్లోయింగ్. ఆ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే బాస్.. బాస్ చాంట్స్ క్యారెక్టర్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లాయి. అందులోనే మరో సర్‌ప్రైజ్ రౌడీ అల్లుడులోని కల్ట్ సాంగ్ లవ్ మీ మై హీరోను భీమ్స్ సిసిరోలియో కొత్తగా రీమిక్స్ చేయడం విశేషం.

సినిమాటోగ్రాఫర్ సమీర్ రెడ్డి కెమెరా వర్క్ అదిరిపోయింది. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌ని హీరోయిజంతో ఎలివేట్ చేస్తూ టాప్ లుక్ ఇచ్చారు.. మెగా ఫ్యాన్స్‌కి, సినిమా లవర్స్‌కి ఈ గ్లింప్స్ పర్ఫెక్ట్ బర్త్‌డే గిఫ్ట్. మెగాస్టార్ ఇంత యంగ్, చార్మింగ్ లుక్‌లో కనిపించడం సెలబ్రేషన్‌లా మారిపోయింది. అంతే కాదు వెంకటేశ్ వాయిస్ ఓవర్ కూడా మరింత స్టార్ అట్రాక్షన్ ఇచ్చింది. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి తమ్మిరాజు ఎడిటర్‌గా, ఏ.ఎస్. ప్రకాశ్ ఆర్ట్ డైరెక్టర్. ఎస్. కృష్ణ, జి.ఆది నారాయణ కోరైటర్స్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తారు.

ఈవెంట్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ. చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు. చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఆయన లుక్ పరిచయం చేయాలనుకున్నాం. గ్లింప్స్‌కి రెస్పాన్స్ అదిరిపోయింది. చిరంజీవి గారి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన కం బ్యాక్ తర్వాత మెగా స్వాగ్ చూడాలని ఒక కోరిక ఉండేది. నాకు ఎప్పుడు ఆ అవకాశం వస్తుందని ఎదురు చూశాను. ఫైనల్‌గా ఆ అవకాశం వచ్చింది. చిరంజీవిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, ఎంటర్టైన్మెంట్ అన్ని అద్భుతంగా కుదిరాయి. చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్ లో నుంచి మేము శంకర వరప్రసాద్ తీసుకుని ఈ సినిమాలో క్యారెక్టర్‌కి పెట్టడం జరిగింది. దాన్నే.. మన శంకరవరప్రసాద్ గారు'గా చేసి సినిమాకి టైటిల్‌గా పెట్టాం. క్యాప్షన్ పండగకి వస్తున్నారు. గింప్స్‌కి విక్టరీ వెంకటేష్ వాయిస్ ఇచ్చారు. ఈ సందర్భంగా విక్టరీ వెంకటేష్‌కి థాంక్యూ. ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. వెరీ సూన్ ఎంట్రీ కూడా ఇవ్వబోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కాంబో ఎలా ఉంటుందో ఈసారి పండక్కి చూస్తారు అని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను ఇక్కడికి వచ్చినందుకు చాలా గర్వపడుతున్నాను. అనిల్ రావిపూడికి జీవితాంతం కృతజ్ఞతతో ఉంటాను అని అన్నారు.

## సినిమా రైట్స్ దోపిడీ..
### నిర్మాతల ఆవేదన



'ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు' సినిమా నిర్మాణంలో నిర్మాతలు కే.మురళి (శరత్ వర్మ), బి.ఆనంద బాబు తమపై పెద్ద మోసం జరిగిందని మీడియా ముందుకు వచ్చారు. 'సినిమా కోసం మేము రూ.2 కోట్లు పెట్టుబడిగా పెట్టాం. మొత్తం ఖర్చు మేమే భరించాం. తిరిగి ఇవ్వలేకపోవడంతో సంబంధిత వ్యక్తి 2024 సెప్టెంబర్ 12న మా పేర్లపైకి సినిమా రైట్స్, కాపీరైట్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీస్ అన్నీ ఇష్టపూర్వకంగా ఇచ్చాడు. ప్రస్తుతం సినిమా రిలీజ్ పనులు కొనసాగుతున్నాయి. కానీ సహకరించాల్సిన రామకృష్ణ తోట మాపై విశ్వాస ఘాతుకం చేశాడు. సినిమా తనదేనని ప్రకటించి, అనుమతి లేకుండా టైటిల్, పోస్టర్లను పత్రికల్లో ప్రచురించాడు. ఇది మా హక్కులపై దాడి, మోసం. ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా ప్రతిష్ట కూడా దెబ్బతిన్నది' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'రామకృష్ణ తోటపై ఐపిసి 406, 420 (మోసం, విశ్వాస ఘాతుకం) సెక్షన్ల కింద, అలాగే కాపీరైట్ చట్టం 1957 ప్రకారం కేసులు నమోదు చేస్తాం. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం' అని నిర్మాతలు చెప్పారన్నారు. నిర్మాత మండలి మాకు న్యాయం చేయాలని కోరారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఇల్లందకుంటలో పనుల జాతర షురూ



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని 18 గ్రామపంచాయతీలలో పనుల జాతర 2025 కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి, ఎంపిడిఒ రాజేశ్వర్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గ్రామాలలో రూ.1.16 లక్షల అంచనాతో వివిధ పనులకు భూమిపూజ చేయడం జరిగిందని తెలిపారు. 10 గ్రామాల్లో రూ.7.22 లక్షలతో పూర్తయిన పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో వికలాంగులైన ఉపాధికూలీలు, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంటలతో పాటు తదితరులున్నారు.


## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతాం :ఎమ్మెల్యే సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** పనుల జాతరలో భాగంగా గంగాధర మండలం గర్శకుర్తిలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం గంగాధర మండలం ఉప్పర మల్యాలలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పౌల్ట్రీ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. జెండా పండుగలో భాగంగా గర్శకుర్తిలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీలో నూతన భవనాలు లేకపోవడంతో అద్దెభవనాల్లో సమస్యల మధ్య కొనసాగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాభివృద్ధి తిరిగి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, చిప్ప చక్రపాణి, రోమాల రమేష్, సత్తు కనకయ్య,రాజేశం,బూరుగుగంగన్న, సాగి అజయ్‌రావు, తదితరులున్నారు.

## సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** ప్రణాళిక బద్ధంగా సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని జెడ్పి బాలురు హై స్కూల్‌లో రూ .32 లక్షలతో ఆధునికరించిన గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల ప్రజాపరిషత్‌లో రూ.5లక్షలతో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలోనే పట్టణంలో సుల్తానాబాద్ ప్రభుత్వ హై స్కూల్ రూ.1 కోటి 50 లక్షలతో కొత్త భవనానికి శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, డి దామోదర్ రావు, పన్నాల రాములు, ఉస్తేం గణేష్, కుమార్ కిషోర్, పన్నాల రాములు, కందుకూరు ప్రకాష్, ముస్త్యాల రవీందర్, పోచం, కె. ప్రకాష్ రావు,హౌసింగ్ పిడి రాజేశ్వర్ రావు, ఎంపిడిఒ దివ్య దర్శన్ రావు, ఎంఇఒరాజయ్య,హెడ్మాస్టర్లు,రత్నాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ జెఇ, సచిన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం వద్ద నాయకుల నివాళి

సిపిఐ రాష్ట్ర మహాసభల్లో పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభల్లో పెద్దపల్లి జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారని సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజు పేర్కొన్నారు. శుక్రవారంతో సిపిఐ రాష్ట్ర మహాసభలు ముగిసాయని, మహాసభల అనంతరం మహాసభలో చేసిన తీర్మానాల ప్రకారం ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల పై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మహాసభ లో పాల్గొన్న ప్రతి నిధులు తీర్మానం చేశారని ఆయన పేర్కొన్నారు. మహాసభ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ప్రతి నిధి వర్గం నివాళులు అర్పించారని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ మహాసభలో పాల్గొన్న వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తో పాటు తదితరులు ఉన్నారు.

## హైస్కూల్ విద్యా బోధనపై దృష్టి సారించాలి: పెద్దపల్లి కలెక్టర్



**ప్రజా పక్షం/పెద్దపల్లి రూరల్ :** హైస్కూల్ విద్యా బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విద్యా శాఖపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యంగా పని చేయడంలో గాడిలో పడ్డాయని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని కలెక్టర్ తెలిపారు. హై స్కూల్ స్కూల్స్‌లో పదో తరగతి విద్యార్థులపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని, 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన బేసిక్స్ నుంచి నేర్పడం చాలా అవసరమని అన్నారు. ప్రతి సబ్జెక్టు పిల్లలకు సులభంగా అరమయ్యేలా బోధన ఉండాలని, బోధన విధానాలలో రావాల్సిన మార్పులపై సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిమాధవి, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు పూర్వవైభవం తెస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/అక్కన్నపేట:** గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని, వాటికి పూర్వ వైభవం తీసుకువస్తామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, హుస్నాబాద్, చిగురుమామిడి, భీమదేవరపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి నూతనంగా నిర్మించిన పలు పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు నిర్వహించిన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గ త ప్రభుత్వం సర్పంచులు, చైర్మన్ల అధికారాలు తగ్గించి, అధికారులతో పాలన సాగించిందన్నా రు. కాంగ్రెస్‌తోనే అధికార వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలను బలపరుస్తామన్నారు. త్వరలోనే గౌరవెల్లి రిజర్వాయర్ కళ సాకారమవుతుందని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో నిరంకుశ, నియంతృత్వ బిఆర్‌ఎస్ పాలనపోయి, సుభిక్షమైన ప్రజాపాలన వచ్చిందని వ్యాఖ్యానించారు. అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని, ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆర్థికపరంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు ఎదుర్కొంటున్నా సంక్షేమ పథకాలను మాత్రం ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తోందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రగతి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఎఎంసి, ప్యాక్స్ సొసైటీ పాలక మండలి చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### రైతులను రెచ్చగొట్టేలా బిఆర్‌ఎస్ వ్యవహరిస్తోంది

రైతులను రెచ్చగొట్టేలా భారత రాష్ట్ర సమితి వ్యవహరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో పర్యటించిన ఆయన మండల కేంద్రంలోని సహకార సంఘం ఎరువుల దుకాణం వద్ద యూరి యా కోసం బారులు తీరిన రైతాంగాన్నీ చూసి వా రి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎరువుల సరఫరా బాధ్యత కేంద్రానిదే అని రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్ర రైతాంగ గో డును మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సమాధానం చెప్పాల్సిన భాధ్యత వారిపై ఉందన్నారు. ఎరువుల విషమంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించి బిఆర్‌ఎస్ రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా తెలంగాణ ప్రభుత్వం నుండి తయారీ కాదని ఇది ఉమ్మడిగా కూడా లేదని, యూరి యా సరఫరా అంతా కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉంటుందన్నారు. వివక్షపూరితంగా ఉద్యేశ్యపూర్వకంగా ప్రభుత్వాన్నీ బదనాం చేయాలని చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తోందని త్వరలోనే ఎరువుల సమస్య తీరునుందని హామీ ఇచ్చారు.

### సామాజిక మాధ్యమాల్లో 'పొన్నం'కు నిరసన సెగ
### పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల డిమాండ్

గత ప్రభుత్వంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల విషయమై నేటికీ బిల్లులు చెల్లింపు జరగలేదని అక్కన్నపేట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు బొమ్మగాని రాజేశంతో పాటు కాశబోయిన యాదగిరి, గద్దల రమేష్ వాట్సప్ సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించి న పంచాయతీ భవనాల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న నేపథ్యంలో 'మా పెండింగ్ బిల్లులు చెల్లించడండీ మహాప్రభో' అంటూ వాట్సప్ మాధ్యమాల్లో నిరసన వ్యక్తం చేశారు. పలువురు లక్షల్లో అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని ,పనులు పూర్తయి ఏండ్లు గడుస్తున్నా మాగోడు పట్టడం లేదా అంటూ మంత్రిని నిలదీశారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి మా ప్రాణాలు కాపాడండి అంటూ మంత్రి పొన్నంను వేడుకున్నారు.

## 'ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని శాన్వికకు నాట్యభారతి' జాతీయ అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థిని శాన్విక సాయి(5వ తరగతి)కి నాట్య భారతి జాతీయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వివిధ కళల పట్ల అవగాహన కల్పించాలని, వాటిలోని విషయాలను సమగ్రంగా తెలియపరిచినట్లయితే ఆసక్తి ప్రదర్శిస్తారని వారు అభిప్రాయపడ్డారు. పాఠశాల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు వాటిలో పాల్గొనుటకై అనేక రకాలుగా అవకాశాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన నాట్య సింధూరం కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ ప్రధర్శన కనబరిచినందుకు పాఠశాలకు చెందిన శాన్విక సాయి(5వ) నాట్యభారతి జాతీయ అవార్డు ప్రదానం చేయడం జరిగిందని వారు తెలిపారు. అవార్డుతో పాటు విధ్యార్థినికి పతకం, సర్టిఫికెట్, ట్రోఫీని అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విధ్యార్థులున్నారు.

## చిన్నారుల కోసం అంగన్‌వాడీల్లో అన్ని సేవలు

శుక్రవారం సభలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతో పాటు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని, తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి ఇక్కడి సేవలు పరిశీలించి తమ పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య మాత్రమే కాకుండా పిల్లల సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పిల్లల బరువు, ఎత్తు, లోప పోషణ వంటివి తరుచుగా పరిశీలిస్తారని తెలిపారు. పిల్లల్లో ఏమైనా లోపాలున్నా, ఎదుగుదలలో తేడాలు గమనించిన ముందే అప్రమత్తం చేస్తారని అన్నారు. ప్రతి పిల్లవాడికి రికార్డు నమోదు చేస్తారని, పిల్లల్లో లోపాలు గుర్తిస్తే పరిష్కరించేందుకు వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని తెలిపారు. పుట్టిన పిల్లల నుండి ఆరు సంవత్సరాలవరకు వారి వయస్సును బట్టి వారి ప్రవర్తన, ఎదుగుదలలో మార్పులు ఉండాలని, వాటిని అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది గమనిస్తారని, తద్వారా శిశువు ఆరోగ్యాన్ని అంచనా వేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నమని, బిపి, షుగర్, వ్యాధిగ్రస్తులకు కావలసిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు శుక్రవారం సభలో తమ సమస్యలు తెలియజేయవచ్చని, అధికారులు పరిష్కారం చూపుతారన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.



అంగన్‌వాడీ కేంద్రం సందర్శన...

దుర్శేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పూర్వ ప్రాథమిక విద్య నేర్చుకుంటున్న చిన్నారులతో ముచ్చటించారు. వారందరికీ రోజువారిగా అందంచే బోజనాన్ని స్వయంగా వడ్డించారు. సిలబస్ ప్రకారం పూర్వ ప్రథమిక విద్య బోధించాలని, క్రమం తప్పకుండా బరువు, ఎత్తు కొలవాలని సిబ్బందిని ఆదేశించారు.

### ప్రభుత్వ పాఠశాల సందర్శన...

దుర్శేడు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఐదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారితో ఇంగ్లీష్ పాఠం చదివించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని టీచర్స్‌ను ఆదేశించారు. పేరెంట్స్ మీటింగ్స్ తరుచుగా నిర్వహిస్తూ పిల్లల ప్రగతిని వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, సిడిపిఒ సబితా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు

మెదక్ ఎంపి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** యూరియా పంపిణీ విషయంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిస్‌మేనేజ్‌మెంట్, కృత్రిమ కొరత సృష్టించటం మూలంగా అన్నదాతలు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విఎఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపి రఘునందన్‌రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనుందన్నారు. రాజకీయ నేతల తప్పుడు ప్రచారాలకు రైతులు ఆందోళన చెందవద్దన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించేవారిపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కాంగ్రెస్ నేతల ధర్నాకు భయపడి యూరియా ఇవ్వటం లేదని తాము యూరియా ఇస్తే వారు ఫోటోలకు ఫోజులిస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యూరియా ఇచ్చామని ఇప్పుడు ఇస్తామని ఎంపి స్పష్టం చేశారు. యూరియా తెచ్చిన వాళ్లకు ఓటు వేస్తామని కొందరు పార్టీల నేతలు చెప్పుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ మంత్రులు వస్తే కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చింది లెక్క చెప్తామన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో సిద్దిపేట,దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్, పటాన్‌చెరు పరిధిలో 56 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల కోసం రూ.4.5 కోట్లు, 28 గ్రామ పంచాయతీల నిర్మాణం కోసం రూ.5.6 కోట్లు నిధులు, కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. ఊరురా పనుల జాతర కార్యక్రమంలో పనుల ప్రారంభోత్సవాలు నిర్వహించాల్సి ఉండగా, కొందరు కాంగ్రెస్ పార్టీనేతలు ముందుగానే నిర్మాణ పనులకు కొబ్బరి కాయలు కొట్టడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. అలాంటివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఎంపి రఘునందన్‌రావు సూచించారు.

**బీహార్ యాత్రలకు..తెలంగాణ హెలికాప్టర్**

కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ నేత పర్యటన కోసం రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారని ఎంపి రఘునందన్‌రావు ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ సర్కార్ తెలంగాణ ప్రజల సొమ్మును మాజీ సిఎం కెసిఆర్ పంజాబ్ రైతులకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. 2018లో ఎంజిఎన్‌ఈజిఎస్ నిధులతో గజ్వేల్ నియోజకవర్గం పరిధిలో గ్రామ పంచాయతీలు నిర్మించారని, జిల్లా పరిధిలో ఒక్క గ్రామపంచాయతీకి నిధులు ఇవ్వలేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నారని ప్రచారం చేయటం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమదృష్టిలో నిధులు మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర నాయకుడు వంగ రాంచంద్రారెడ్డి,దూది శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు బాసంగారి వెంకన్న, కాసనగొట్టు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్లు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ఫొటో వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె హుస్సేన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఫొటోగ్రాఫర్లు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ ఫోటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక నందన గార్డెన్‌లో పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె హుస్సేన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రఫర్‌లు ముందుకు సాగాలన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కుటుంబ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టామని, ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు చనిపోయిన140 మంది ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు 2 కోట్లపైగా ఆర్థిక సహాయం అందించామన్నారు. ఫొటోగ్రాఫర్ల పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత,రెండు నెలల పాటు పనిచేసుకోలేని స్థితిలో ఉన్న ఫొటోగ్రాఫర్లకు ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లాలోని 100 మంది సీనియర్ ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు.జిల్లా వ్యాప్తంగా ఒకే రేట్ల పట్టికను ఆవిష్కరించారు. కుటుంబ భరోసాలో ఉండి మరణించిన రామగుండం అసోసియేషన్ సభ్యులు కడమంచి దినేష్ కు చెందిన 4,20,000/ రూ.ల చెక్కును అసోసియేషన్ బాధ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి,సౌత్ ఇండియా ప్రతినిధి,పూజా ల్యాబ్ అధినేత రాజేష్ రెడ్డి,రాష్ట్ర ముఖ్య సలహాదారులు మహిమాల కేదార్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కోశాధికారులు తుమ్మ చందు, మధు, మంచిర్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు అప్పాసు రామన్న, శ్యాస తిరుపతి, ముక్కెర శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి,కోశాధికారి ఎం.డి ఇర్ఫాన్, అల్లం సతీష్,పెద్దపల్లి మండల అధ్యక్షులు వనపర్తి శ్రీనివాస్, జిల్లాలోని పట్టణ, మండల అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,కోశాధికారులు, జిల్లా సలహాదారులు, జిల్లా కమిటీ సభ్యులు, సన్మాన గ్రహీతలతో పాటు అధిక సంఖ్యలో ఫోటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## హరీశ్‌రావు అసత్య ప్రచారం మానుకోవాలి

సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులకు మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని సిద్దిపేట నియోజక వర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలోఆయన మాట్లాడారు. గత జూన్‌లో సిద్దిపేట నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు నిధులు కావాలని మంత్రి కొండ సురేఖకు వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధిలోభాగంగా రెండు కోట్ల 60 లక్షలు నిధులు కేటాయించాలని జూన్ 10న ప్రోసిడింగ్ వచ్చిందన్నారు. ఈ విషయాన్ని అప్పుడు మీడియా సమావేశంలో 2.60 లక్షలు మంజూరైనాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాని ఈనెల 21న మాజీ మంత్రి హరీశ్‌రావు మీడియాకు 2.60 కోట్ల 60 లక్షలు మంజూరైనట్లు మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. 2.60 కోట్ల నిధులు తాను మంజూరు చేసినట్లు తప్పుడు ప్రచారం చేసుకోవటం తగదన్నారు. తాను నిధులు మంజూరు చేసినట్లు తనవద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, దమ్ముంటే మీ వద్ద ఏవైన ఆధారాలుంటే రెండు రోజుల్లో పాత బస్టాండ్ చౌరస్తాకు బహిరంగ చర్చకు రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సవాల్ విసిరారు. రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్ కాల్వలకు భూపరిహారం ఇవ్వకుండ రైతులను మోసం చేసింది బిఆర్‌ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అన్నారు. యూరియా పంపిణి చేసే బాధ్యత కేంద్రానిది అని, వారు పంపిణి చేయకుండ కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను రేవంత్‌రెడ్డి సర్కార్ కొనుగోలు చేసిందన్నారు. బిఆర్‌ఎస్‌పై రైతులపై చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి రావాలని బిజెపిపై వత్తిడి తెస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్న రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు సిద్దిపేట నియోజక వర్గం అభివృద్ధికి 22 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సిద్దిపేటలో రోడ్లు, డివైడర్లు చూపి అభివృద్ధి చెసామని గొప్పలు చెప్పుకోవటం కాదని, ఇంకా సిద్దిపేటలో చేయాల్సిన అభివృద్ధిపనులు చాల ఉన్నాయన్నారు. సిద్దిపేట నిలిచిపోయిన పనులకు సైతం నిధుల మంజూరుకు కృషిచేస్తున్నానని, త్వరలో నిధులు మంజూరు చేయించి సిద్దిపేట అభివృద్ధికి పాటుపడుతానన్నారు. ఎప్పటికైన సిద్దిపేట అభివృద్ధి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు అత్తుఇమామ్, బొమ్మల యాదగిరి, కలిమోద్దీన్, మార్క సతీష్, దాస అంజయ్య, ముద్దం లక్ష్మి, గయాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## చేపూర్ పల్లె గ్రామాలలో పనుల జాతర ప్రారంభం



**ప్రజాపక్షం /ఆర్మూర్ :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేపూర్ గ్రామంలో పశువుల షెడ్డుకు, పల్లె గ్రామంలో గొర్ల షెడ్డుకు వంద శాతం సబ్సిడితో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులను పివో సురేష్ బాబు, మండల అధ్యక్షుడు సుర కంటి చిన్నారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దాసరి శ్రీకాంత్, పంచాయతీ సెక్రెటరీ లోక హరీష్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ భరత్, రామ్‌సన్, ఐకెపి వివోలు సర్దా సంతోష, సింధుకర్ అమల, సారంగి శాంతి కుమార్, పీల్డ్ అసిస్టెంట్ రజిత, కొంపెల్లి సుధాకర్, తోటపల్లి దేవరాజ్, సర్దా గంగాధర్, సింధుకర్ చరణ్, జోరిగె ధర్మయ్య, లింబాద్రిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గని సమస్యలు పరిష్కరించండి

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఎస్‌ఆర్‌పి 3 గనిలో సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా డిమాండ్ చేశారు. శుక్రవారం జిఎం కమిటీ సభ్యులతో కలిసి గనిని సందర్శించి సమస్యలపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. గతంలో గనిలో సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకెళ్లిన ఇంత వరకు పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయాలని, పై అధికారులు గని సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి అంబాల రవి, ఉపాధ్యాక్షులు తౌటం మల్లేష్, విక్కీ శ్రీకాంత్, రాచర్ల రవీందర్, ఈర్ల పోషం తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘాలతో సమావేశం



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని జనరల్ మేనేజర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఏరియా జిఎం ఎం. శ్రీనివాస్ అన్ని కార్మిక సంఘాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ప్రగతి మైదానంలో నిర్వహించుకోబోయే వార్షిక రక్షణ బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జిఎం ఎస్.సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరి బాజీ సైదా, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, ఇన్చార్జి డిజిఎం పర్సనల్ రాజేశ్వర్, సీనియర్ పిఒ పి.కాంతారావు, ఎఐటియూసి నాయకులు కొమరయ్య, ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశం



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే, పాఠశాలను, కేజీబీవీ పాఠశాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలలను, స్కూల్ పరిసరాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. డ్రింకింగ్ వాటర్, టాయిలెట్ సరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భోజనం మెను పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మోర్తాడ్ ఎంపిడిఒ తిరుమల, ఎంఇఒ సమ్మిరెడ్డి, ఎంజెపిటిబిసి డబ్ల్యూ ఆర్‌ఎస్ ప్రిన్సిపల్ ప్రసాద్, కేజీబీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, మోర్తాడ్ పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** బిసి వెల్ఫేర్ అడ్వైసర్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వసతి గృహాల్లో నూతన విద్యార్థుల ప్రవేశం కొరకు, స్థితిగతులపై చర్చించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని వసతి గృహాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రైవేట్ భవన్‌లో వసతి గృహాలు ఉన్నందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ,ప్రభుత్వ భవనాలు మంజూరుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. విధుల నిర్వహణలో సిబ్బంది, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయవద్దని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సిబ్బందికి సూచింరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వసతి గృహ సంక్షేమ అధికారులు కృష్ణ, కవిత, మంజుల, గౌస్ హష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

బిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గ్రామాలు, పట్టణాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం కంది మండంలోని చేర్యాల, ఎర్దనూర్, తండాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పనుల జాతర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చేర్యాల గ్రామంలో అంగన్వాడి భవనం, ఎర్దనూర్, తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు శ్రవణ్ కుమార్, రాందాస్ నాయక్, ఎంపిడిఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# రక్తదానం ప్రతీఒక్కరి బాధ్యత

ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎంవి.రమేష్

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే





**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎం.వి రమేష్ తెలిపారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిర కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, జిల్లా వైద్యాధికారి సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మాట్లాడుతూ రక్తదానం మనిషి మాత్రమే చేయగలడన్నారు. ఒకరు చేసిన రక్తం ముగ్గురికి ఉపయోగపడుతుందన్నారు. నాలుగు రోజులపాటు జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికి వారుగా సంబంధం లేనట్లు వ్యవహిస్తే రక్త గ్రహీతలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరు రక్తం ఇవ్వడానికి అర్హులేనని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా మధ్యవర్తిత్వ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, దేశ వ్యాప్తంగా 90 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని కక్షిదారులు దీనికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సీతారాం మాట్లాడుతూ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో రెండు బ్లడ్ బ్యాంక్ కేంద్రాలు ఉన్నాయని, జైనూర్‌లో మరొకటి ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు, వైద్య సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పనుల జాతరలో అభివృద్ధి పనులు

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ కోవలక్ష్మి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయాల భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో 100 రోజులుగా ఒక్కసెలవు కూడా లేకుండా పనిచేసిన మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి లక్ష్మి నారాయణ, పలు శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది మౌలిక అవసరాల కల్పనపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :**ఆధునికరించిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ స్టోర్, మోటార్ వెహికల్ స్టోర్ రూమ్‌లను శుక్రవారం జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి మౌలిక అవసరాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఆర్‌ఐ స్టోర్ మోటార్ వెహికల్ స్టోర్ రూమ్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రత్యేక దృష్టి సారించి వాటిని ఆధునికరించడం జరిగిందని తెలిపారు. ఈ స్టోర్‌లు సిబ్బందికి అందించే కిట్స్ విధి నిర్వహణలో వినియోగించే కిట్స్ ,టెంట్స్, క్రీడా సామాగ్రి సురక్షితంగా భద్రపరచడానికి అనుకూలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట ఎఆర్, డిఎస్‌పి నరేందర్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

# జిఒ 49 రద్దుకు అసెంబ్లీలో పోరాటం

బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దీక్ష విరమణ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** జిఒ నెం. 49 రద్దు మరియు పోడు భూమల పరిష్కారానికి కాగజ్‌నగర్ పట్టణంలో నిరాహార దీక్ష చేపట్టిన సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు దీక్ష శుక్రవారం ఐదవ రోజుకు చేరడంతో ఆయన దీక్ష శిబిరాన్ని బిజెపి శాసనపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఉపనేత పాయల్ శంకర్, ఎమ్మెల్యేలు వెంకటరమణరెడ్డి, పైడి రాజేశ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి శాసనపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిఒ నెం. 49 వలన వెనకబడిన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మరింత వెనుకబడే ప్రమాదం ఉందని, అందుకే జిఒ నెం.49 రద్దు చేయాలని అసెంబ్లీలో పోరాటం చేస్తామన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారం కాకపోతే, రేపు కాంగ్రెస్ నేతలకు కూడా తెలంగాణలో రైతుల నిరసన ఎదురవుతుందని హెచ్చరించారు. పోడు భూముల సమస్యను పరిష్కరించకపోతే దశల వారిగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ మొండి వైఖరిని పోడు రైతులందరూ ఎండగట్టాలని ఈప్రభుత్వం అధికారంలో వచ్చి రైతులకు జీవనోపాధి లేకుండా చేస్తుందని వారు విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సూచనల మేరకు ఆరోగ్యం క్షిణించి, షుగర్ లేవెల్స్ తగ్గడంతో డా.హరీశ్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.




### కాగజ్‌నగర్ పట్టణ బంద్

జిఒ నెం. 49 రద్దు మరియు పోడు భూముల సమస్య పరిష్కారానికి గత ఐదు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వం లేదా అటవీ శాఖ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై బిజెపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తూ స్థానిక మార్కెట్ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. వ్యాపార సంస్థలు, దుకాణాలను మూసివేసి బంద్ విజయవంతం చేశారు.

# ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణ

ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి కాంతిలాల్ సుభాష్ పాటిల్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లావ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల పేరిట లక్కీ లాటరీలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు విభాగం ఎళ్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. సమస్యలు ఉంటూ వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670551కు తెలియజేయాలన్నారు.

**భీమ్‌గల్ :** త్వరలో రాన్ను వినయకచవితి పండుగను ప్రజలందరు శాంతియుతంగా జరుపుకోవాలని కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్‌శాఖా అధ్వర్యంలో మండల అధికారులతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు, ఈ సందర్భఃగా ఎస్‌ఐ మాట్లాడుతు విగ్రహాలను తరలించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంటపాల వద్ద మద్యపానం, డిజెలు వాడటం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రజాద్, ఎంపిడిఒ చింతరాజశ్రీనివాస్, విద్యుత్‌శాఖా అధికారి అన్నయ్యతో పాటు మండపాల నిర్వాహకులు తదితరలు పాల్గొన్నారు.

**మాక్లూర్ :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. పంచాయతీ అధికారులు, విఆర్‌ఎలు కలిసి గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయకుని నిమజ్జనం రోజు యువకులు మత్తుకు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. డిజెలకు అనుమతి లేదని, ఎవరైనా డిజెలు వినియోగిస్తే వాహనాలను సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిసే సహించేది లేదన్నారు. సమావేశంలో ఎస్సై రాజశేఖర్, ఎంపీడీఓ బ్రహ్మానందం, విద్యుత్ ఎఇ మిథున్ తదితరులు పాల్గొన్నారు.

**పాపన్నపేట :** మండలంలో గణేష్ ఉత్సవాలు, మిలాన్ ఉన్ నబీ వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వినాయక మంటప నిర్వాహకులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. వేడుకల్లో అన్నీ వర్గాలు, మతాల ప్రజలు పరస్పర సహకారం, సోదర భావంతో వ్యవహరించుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.





## విఐపిల భద్రత రక్షణ అధికారులుగా మన బాధ్యత

పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** వ్యక్తిగత భద్రత అధికారులుగా అతి ముఖ్యమైన వ్యక్తుల రక్షణ తమ బాధ్యతగా విధులు నిర్వహించాలని, అందుకు కావలసిన సాంకేతిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య సూచింరారు. శుక్రవారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పిఎస్‌ఒ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ల) రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోలీసు కమిషనర్ పాల్గొని మాట్లాడారు. విఐపిల భద్రత నేపథ్యంలో సేవలు అందించే పిఎస్‌వోల పాత్ర అత్యంత ముఖ్యమైనదని, నైపుణ్యాలను మెరుగుపరచడానికి, అత్యాధునిక విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పిఎస్‌ఒలు తీసుకోవలసిన చర్యలపై స్పష్టత ఉండటానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో పొందే జ్ఞానం, అనుభవం పిఎస్‌ఒల బాధ్యతల్ని మరింత సమర్థంగా నిర్వర్తించేందుకు దోహదపడుతుందని, ప్రతి పిఎస్‌ఒ అధిక నైపుణ్యంతో, పట్టుదలతో, నిబద్ధతతో ముందుకు వెళ్లడానికి ఉపయోగపడుతుందన్నారు. మీ భవిష్యత్తు సేవలకు ఈ శిక్షణ మైలురాయిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. కార్యక్రమంలో అదనపు డిసిపి ఎఆర్ ఎ.రాంచంద్రరావు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, సతీష్, శేఖర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సైలెన్సర్లు మార్పిడీ చేసి ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు

ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** శబ్ద కాలుష్యాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనదాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ తెలిపారు. జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ ద్విచక్ర వాహనదారులు అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ మాడిఫై చేసి అధిక శబ్దాలతో సౌండ్ పోల్యూషన్ చేస్తూ సామాన్య ప్రజానికానికి ఇబ్బందులకు గురిచేస్తున్న 50 వాహనాల సైలెన్స్‌ర్‌లను శుక్రవారం జిల్లాలోని వాంకిడి టోల్ ప్లాజా వద్ద రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వర ప్రసాద్, సిఐలు సత్యనారాయణ, రమేష్, సంజయ్, ఎస్‌ఐలు మధుకర్, చంద్రశేఖర్, ఉదయ్ కిరణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెల ప్రగతి కోసమే పనుల జాతర

ఎమ్మెల్యే భూపతిరెడ్డి,
కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మారుమూల, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనుల జాతర కార్యక్రమాన్ని చేపట్టిందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి వెల్లడించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని పాల్దా గ్రామంలో పనుల జాతరలో భాగంగా 12 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపడుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. డిచ్‌పల్లి మండలం ముల్లంగి గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద పెద్ద ఒడ్డెన్న అనే రైతుకు మంజూరు చేసిన పశువుల కొట్టం నిర్మాణానికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శంకుస్థాపన శారు. పాల్దా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలతో పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. నూతన గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు, డ్రైనేజీలు, సోక్ పిట్స్, అంగన్‌వాడీ భవనాలు, పశువుల కొట్టాలు, కోళ్ల ఫారాలు, గొర్రెల షెడ్లు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఒక్క రూరల్ నియోజకవర్గ పరిధిలోనే 33 అంగన్‌వాడీ భవనాలను ఏకకాలంలో చేపట్టడం జరుగుతుందని వివరించారు. పేదల సంక్షేమం, పల్లెల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాల అభివృద్ధి పరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆమె తెలిపారు . కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయా వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక నూతన కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. పనుల జాతరలో భాగంగా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్దేశించిన పనులను విరివిగా చేపడుతూ గ్రామాల అభివృద్ధికి బాటలు వేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన ముప్ప గంగారెడ్డి, డీఆర్‌డీఓ సాయ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శంకర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల మూడవ రోజు చిత్రమాలిక

ఫొటోలు... అనిల్





సిపిఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు సన్మానం







డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు



CPI తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్







నవచేతన పుస్తకాలయంలో రాజాకు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



రాజా, నారాయణ, అజీజ్ పాషా చర్చలు..



పాత కార్యవర్గం..



గీతా పనివారల ఫ్రంట్



లాయర్ల ఫ్రంట్



సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శితో పార్టీ వెటరన్ నేతలు



తల్లీ కూతుళ్లు, తండ్రీ కొడుకులు



రాజా, శ్రీనివాస్ రెడ్డితో ప్రజాపక్షం జర్నలిస్టులు



తక్కళ్లపల్లితో మగ్దూమ్ భవన్ కార్యాలయ సిబ్బంది




ప్రజానాట్యమండలి గీతాలాపన



ప్రజానాట్యమండలి నృత్యాలు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com